
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా వార్తలు

శుక్రవారం 23 మే 2025

ఉష్ణోగ్రత వివరాలు

కేంద్రం	గరిష్టం	కనిష్టం
నెల్లూరు	35.2	25.6
కావలి	36	28
ఆత్మకూరు	34	24
ఉదయగిరి	35	27
కందుకూరు	35	27

ప్రాజెక్టులకు భూసేకరణ వేగవంతం చేయండి

అధికారులతో కలెక్టర్ ఆనంద్

నెల్లూరు (హరనాథపురం), మే 22 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో వివిధ అభివృద్ధి ప్రాజెక్టుల భూసేకరణ ప్రక్రియ వేగవంతం చేయాలని కలెక్టర్ ఆనంద్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని తిక్కన భవన్‌లో జిల్లాస్థాయి అధికారులతో కలెక్టర్ సమావేశమయ్యారు. ఎన్‌హెచ్‌ఏఐ, రైల్వే, ఆర్‌ఓబీలు, ఆర్‌అండ్‌బీ రోడ్లు, ఏపీఐఐసీ, మెగా ఇండస్ట్రీయల్ హబ్ తదితర ప్రాజెక్టులకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న భూసేకరణను వెంటనే పూర్తి చేయాలని పేర్కొన్నారు. అభివృద్ధి ప్రాజెక్టులను పట్టా లెక్కిచ్చేందుకు ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉన్నందున, అధికారులు త్వరితగతిన భూసేకరణ చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా అటవీ శాఖాధికారి కె.మహబూబ్‌బాషా, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ శివకుమార్, ఆర్డీవోలు అనూష, పావని, వంశీకృష్ణ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ హుస్సేన్‌సాహెబ్, ఆర్‌అండ్‌బీ ఎస్ఈ గంగాధర్, సోమశిల ప్రాజెక్టు ఎస్ఈ వెంకటరమణారెడ్డి, ఎన్‌హెచ్ఏఐ, వివిధ ప్రాజెక్టుల అధికారులు పాల్గొన్నారు.

● పరిశ్రమల ఏర్పాటుకు...

నెల్లూరు (వెంకటేశ్వరపురం) : నూతన పరిశ్రమలకు ఔత్సాహికులకు త్వరగా అనుమతులు ఇవ్వాలని కలెక్టర్ ఆనంద్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో జిల్లా పరిశ్రమలు, ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆటోనగర్‌లో నిర్మాణంలో ఉన్న ఇరిగేషన్ కాలువ పనులు వెంటనే పూర్తి చేయాలన్నారు. జిల్లాలో టీబీ బాధితులకు పోషక సహాయం అందించడంలో సామాజిక బాధ్యతగా కార్పొరేట్ సంస్థలు ఆర్థిక సాయం అందించాలన్నారు. అదేవిధంగా యోగాంధ్రలో పరిశ్రమల భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఏపీఐఐసీ జెడ్ఎం శివకుమార్, పరిశ్రమలశాఖ జీఎం ప్రసాద్, ఆర్డీవోలు పాల్గొన్నారు.



మెగా డీఎస్సీ... యువతలో ఆశలు చిగురింపజేస్తోంది. ఎలాగైనా ప్రభుత్వ కొలువు సాధించాలన్న పట్టుదలతో దరఖాస్తులు వెల్లువలా వస్తున్నాయి. జిల్లాలో అన్ని కేటగిరీల్లో 673 పోస్టులు భర్తీ చేయనుండగా, 15,993 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. ఒక అభ్యర్థి ఎన్ని పోస్టులకైనా దరఖాస్తు చేసుకోవచ్చని ప్రభుత్వం ప్రకటించడంతో దరఖాస్తుల వారీగా లెక్కిస్తే 28,772 వచ్చాయి. అంటే ఒక్కో పోస్టుకు 42 దరఖాస్తులు అందినట్టు సమాచారం. కొన్ని కేటగిరీల్లో అభ్యర్థుల నడుమ తీవ్ర పోటీ నెలకొని ఉండగా మరికొన్నింటిలో పెద్దగా పోటీ లేకపోయినా దరఖాస్తులు మాత్రం అధికంగానే వచ్చాయి. మరోవైపు దరఖాస్తు చేసుకున్న వారిలో మహిళలే ఎక్కువగా ఉన్నారు.

42 ఒక్కో పోస్టుకు దరఖాస్తులు

● మెగా డీఎస్సీలో కొలువు కోసం యువతలో పోటాపోటీ

● 673 పోస్టులకు 28,772 దరఖాస్తులు

● మొత్తం అభ్యర్థుల సంఖ్య 15,993 మంది

● వీరిలో 9,820 మంది మహిళలే!

నిరుద్యోగ అభ్యర్థులు ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్న డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల కావడంతో ఉద్యోగాల సాధనకు భారీగా దరఖాస్తులు చేసుకున్నారు. జిల్లాలో భర్తీకానున్న 673 పోస్టులకు 15,993 మంది అభ్యర్థులు 28,772 దరఖాస్తులతో పోటీ పడుతున్నారంటే పోటీ ఏస్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. దరఖాస్తు చేసుకున్న వారిలో మహిళలే అధికంగా ఉన్నారు. పురుషులు 6,173 మంది, మహిళలు 9,820 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఇక రిజర్వేషన్ల వారీగా పరిశీలిస్తే బీసీ-డీ, ఎస్సీ, ఎస్సీ-2, ఎస్సీ-3 విభాగాల్లో ఎక్కువగా దరఖాస్తులు వచ్చాయి. ఈ కేటగిరీల అభ్యర్థులు తీవ్రంగా శ్రమించాల్సి ఉంటుంది. ఓసీ విభాగంలో పోటీ తక్కువగా కనిపిస్తున్నా ఇతర సామాజిక వర్గాల అభ్య ర్థులు కూడా సాధించిన మార్కులను బట్టి ఈ కేటగిరీ పోస్టుల కోసం పోటీ పడేందుకు అవకాశం ఉంటుంది.

● పోస్టుల వివరాలు

జడ్పీ, ఎంపీపీ, మున్సిపల్, ప్రభుత్వ మేనేజ్‌మెంట్లలో 673 పోస్టులు భర్తీ చేస్తున్నట్లు అధికారులు ప్రకటించారు. స్కూల్ అసిస్టెంట్ విభాగంలో లాంగ్వేజ్-1లో 39, హిందీ 18, ఇంగ్లీష్ 84, మ్యాథ్స్ 63, ఫిజికల్ సైన్స్ 76, బయాలజీ 63, సోషల్ 103, ఫిజికల్‌ఎడ్యుకేషన్ 107, ఎస్‌జీటీ 115 కలిపి మొత్తం 668 పోస్టులు, ట్రైబుల్ వెల్ఫేర్ విభాగంలో హిందీ 1, ఇంగ్లీష్ 1, మ్యాథ్స్ 1, ఎస్‌జీటీ 2 కలిపి 5 పోస్టులు, రెండు విభాగాల్లో 673 పోస్టులు ఉన్నట్లు గుర్తించారు. దరఖాస్తుదారులకు ఈ నెల 30 హాల్‌టికెట్లు విడుదల చేయనున్నారు. జూన్ 6, 7వ తేదీల్లో పరీక్షలు నిర్వహించి రెండురోజుల్లోనే ప్రాథమిక కీ విడుదల చేస్తారు. కీ విడుదలైన తరువాత ఏడు రోజులపాటు అభ్యంతరాలు స్వీకరించి అనంతరం తుది కీ విడుదల చేస్తారు. అనంతరం వారం రోజుల గడువులో మెరిట్ జాబితాను ప్రకటిస్తారు.

● మహిళలే ఎక్కువ

దరఖాస్తుదారుల్లో పలు సామాజిక వర్గాలకు చెందిన అభ్యర్థులు భారీగానే పోటీ పడుతున్నారు. ఓసీ విభాగంలో 1468 మంది, బీసీ-ఏలో 1654 మంది, బీసీ-బీలో 1930 మంది, బీసీ-సీలో 188 మంది, బీసీ-డీలో 2004 మంది, బీసీ-ఈలో 1050 మంది పోటీపడుతున్నారు. అలాగే ఎస్సీ వర్గీకరణ తరువాత ఎస్సీ-1లో 2, ఎస్సీ-2లో 2,283 మంది, ఎస్సీ-3లో 4,427 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఎస్టీ విభాగంలో 957 మంది, ఈడబ్ల్యుఎస్‌లో 900 మంది పోటీ పడుతుండగా, దివ్యాంగుల విభాగంలో వీహెచ్‌లో 69 మంది, హెచ్‌హెచ్‌లో 35 మంది, ఓహెచ్‌లో 365 మంది, ఎంఐలో ముగ్గురు అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు.

● మెగా డీఎస్సీకి రోస్టర్ పాయింట్లు

ఉమ్మడి జిల్లాలో మెగా డీఎస్సీ ద్వారా 668 పోస్టులు భర్తీ చేస్తున్న నేపథ్యంలో రోస్టర్ పాయింట్ల సిద్ధం చేసి పోస్టులు, కేటగిరీల వారీగా రిజర్వేషన్లు ఖరారు చేశారు. ప్రభుత్వ, జడ్పీ, ఎంపీపీ స్కూళ్లలో 629, నగరపాలక సంస్థ పరిధిలోని స్కూళ్లలో 25, మున్సిపల్ స్కూళ్లలో 14 ఖాళీలను భర్తీ చేయనున్నారు. ఈ పోస్టులకు సంబంధించి రిజర్వేషన్ల వారీగా నియామకాలు చేపట్టేందుకు రోస్టర్ పాయింట్లను సిద్ధం చేశారు. కులాల వారీగా సబ్జెక్ట్ టీచర్లు, ఎస్‌జీటీల పోస్టుల నియామకం ఉంటుంది. ఇందులోనూ మహిళలు, దివ్యాంగులకు కొన్ని పోస్టులు కేటాయిస్తుండగా, ఎస్సీ వర్గీకరణ అమల్లోకి రావడంతో ఈసారి ఎస్సీ పోస్టులను మూడు కేటగిరీలుగా విభజించారు. దివ్యాంగుల విభాగంలో వీహెచ్, హెచ్‌హెచ్, ఓహెచ్, ఎండీ తదితర కేటగిరీల వారీగా పోస్టులు భర్తీ చేస్తారు. అలాగే మాజీ సైనికుల కోటా, స్పోర్ట్స్ కోటాలో కూడా నియామకాలు ఉంటాయని అధికారులు తెలిపారు.

రిజర్వేషన్ల వారీగా పోస్టుల వివరాలు

కేటగిరీ	ప్రభుత్వ, జడ్పీ, ఎంపీపీ	మున్సిపల్	కార్పొరేషన్	మొత్తం
ఓసీ	254	6	8	268
బీసీ-ఏ	48	1	1	50
బీసీ-బీ	60	0	1	61
బీసీ-సీ	5	1	2	8
బీసీ-డీ	43	1	2	46
బీసీ-ఈ	24	1	1	26
ఎస్సీ-జి-1	6	1	3	10
ఎస్సీ-జి-11	38	1	1	40
ఎస్సీ-జి-111	48	1	2	51
ఎస్టీ	41	0	2	43
ఈడబ్ల్యుఎస్	62	1	2	65
మొత్తం	629	14	25	668

- నెల్లూరు (విద్య, ఆంధ్రజ్యోతి)



ఉపాధ్యాయ బదిలీల ప్రక్రియ ప్రారంభం

ఉపాధ్యాయ బదిలీలకు సంబంధించి బదిలీల నియంత్రణ చట్టం కింద నోటిఫికేషన్ విడుదలైంది. ఈ మేరకు జిల్లాలోని ప్రభుత్వ, జడ్పీ, ఎంపీపీ, పురపాలక, నగరపాలక మేనేజ్‌మెంట్లలో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు బదిలీలు, ఉద్యోగోన్నతులు చేపట్టనున్నారు. ఇప్పటికే ప్రారంభమైన ఈ ప్రక్రియ జూన్ 11వ తేదీ నాటికి పూర్తికానుంది. గ్రేడ్-2 హెచ్‌ఎంలకు, స్కూల్ అసిస్టెంట్లు, సెకండరీ గ్రేడ్ టీచర్లకు వేర్వేరుగా షెడ్యూల్ ప్రకటించగా తొలుత హెచ్‌ఎంల బదిలీలు, ఉద్యోగోన్నతులు చేపట్టనున్నారు.

- వివరాలు 8లో..



హంస వాహనంపై కామాక్షితాయి విహారం

బుచ్చిరెడ్డిపాళెం, (ఆంధ్రజ్యోతి) : జొన్నవాడలో మల్లికార్జునస్వామి, కామాక్షితాయి బ్రహ్మోత్సవాలు వేడుకగా జరుగుతున్నాయి. గురువారం కామాక్షితాయి హంస వాహనంపై కొలువుదీరి భక్తులకు దర్శనమిచ్చారు. ప్రత్యేక పుష్పాలంకరణ, మంగళ వాయిద్యాలు, పండితుల వేదమంత్రాల నడుమ అమ్మవారు విహరించారు. ఉదయం తిరుచా ఉత్సవంలో గంగా, కామాక్షితాయి సమేతంగా మల్లికార్జునస్వామికి గ్రామోత్సవం జరిగింది. ఆలయం ముందు ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఆలయ కమిటీ చైర్మన్ తిరుమూరు అశోక్‌రెడ్డి, ఈఓ ఏవీ శ్రీనివాసులురెడ్డి, సభ్యులు, స్థానిక సర్పంచు పెంచలయ్య కార్యక్రమాలను పర్యవేక్షించారు. కాగా, శుక్రవారం కామాక్షితాయికి రావణసేవ జరగనుంది.

మహా జోష్!

● నేడు నెల్లూరు పార్లమెంటు మినీ మహానాడు

నెల్లూరు, మే 22 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు పార్లమెంటు స్థాయి టీడీపీ మినీ మహానాడు శుక్రవారం జరగనుంది. ఉదయం 9 గంటలకు కనుపర్తిపాడు వద్ద ఉన్న వీపీఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో ఈ కార్యక్రమం ప్రారంభమవుతుంది. మంత్రులు నారాయణ, ఆనం రామనారాయణరెడ్డితోపాటు ఎంపీలు, ఎమ్మెల్యేలు, నేతలు హాజరుకానున్నారు. ఇప్పటికే అన్ని నియోజకవర్గాల్లో మినీ మహానాడు కార్యక్రమాలు పూర్తయ్యాయి. అక్కడ చేసిన తీర్మానాలను పార్లమెంటు స్థాయి మహానాడులో ప్రవేశపెడతారు. ఉదయం ప్రతినిధుల నమోదు, ఆ తర్వాత టీడీపీ జెండా ఆవిష్కరణ, అనంతరం టీడీపీ వ్యవస్థాపకులు ఎన్టీఆర్‌కు నేతలంతా నివాళులర్పిస్తారు. గత ఏడాది కాలంలో చనిపోయిన టీడీపీ కార్యకర్తలకు సంతాపం ప్రకటించి తీర్మానం చేస్తారు. తదుపరి నియోజకవర్గస్థాయిలో తీర్మానించిన అంశాలపై చర్చిస్తారు. చివరగా పార్లమెంటు స్థాయి తీర్మానాలను ప్రవేశపెడతారు. ఇలా చేసిన తీర్మానాలను ఈ నెల 27, 28, 29 తేదీల్లో కడపలో జరగనున్న మహానాడు కార్యక్రమంలో ప్రవేశపెడతారు. మధ్యాహ్నానికి కార్యక్రమం ముగుస్తుంది.





జై హనుమాన్!

భక్తిశ్రద్ధలతో హనుమజ్జయంతి

హనుమజ్జయంతి పర్వదినాన్ని జిల్లా అంతటా గురువారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. రామాలయాలు, ఆంజనేయస్వామి మందిరాలు, వైష్ణవాలయాల్లో ప్రాతఃకాలం నుంచే విశేష అభిషేకాలు, పూజలు, అర్చనలు చేశారు. జైశ్రీరామ్, జైజై హనుమాన్ నామస్మరణతో ఆలయాలు మారుమోగాయి. పలు ఆలయాల్లో పంచామృతాభిషేకాలు, విశేష అలంకరణ, హోమాలు, లక్ష మల్లెలతో అర్చన, తమలపాకులతో సామూహిక పూజల నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. సాయంత్రం పూలంగిసేవ, పల్లకీసేవలతోపాటు కొన్ని ఆలయాల్లో వాహన సేవలు, నగరోత్సవాలు జరిగాయి. నెల్లూరులోని శబరి శ్రీరామ క్షేత్రంలో జరుగుతున్న ఉత్సవాల్లో భాగంగా లక్ష మల్లెల అర్చన నిర్వహించారు. స్టోన్‌హౌస్‌పేటలోని కన్యకాపరమేశ్వరి ఆలయంలో లక్ష తమలపాకులతో పూజ చేశారు. బూందీతో ప్రత్యేకంగా రూపొందించిన హనుమంతుని రూపం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. కోవూరు శాసనసభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ఆంజనేయస్వామికి పూజలు చేసి ప్రసాదం స్వీకరించారు. పల్లెల్లో హనుమజ్జయంతిని ఘనంగా జరుపుకున్నారు.

- నెల్లూరు (సాంస్కృతికం, ఆంధ్రజ్యోతి)



రాపూరు : పెంచలకోనలో విశేష అలంకరణలో వీరాంజనేయ స్వామి

ఎప్పుడు వస్తాదో తెలియని ఎండీయూ వాహనం కోసం ఇక వేచి ఉండాల్సిన అవసరం లేదు. రోజువారి పనులు చేసుకుంటూనే వీలున్న సమయంలో నెలలో ఎప్పుడైనా డీలర్ల వద్ద సరుకులు తెచ్చుకునే వెసులుబాటును రాష్ట్ర ప్రభుత్వం అమలులోకి తేనుంది. ఎండీయూ వాహనాలకు స్వస్తి పలికి జూన్ 1 నుంచి చౌక దుకాణాల ద్వారా కార్డుదారులకు నిత్యావసర వస్తువులు పంపిణీ చేయనున్నట్లు ప్రకటించింది. దీంతో డీలర్లు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

- ఉదయగిరి (ఆంధ్రజ్యోతి)

● కనుమరుగు కానున్న 'ఎండీయూ' వ్యవస్థ

● వచ్చే నెల నుంచి డీలర్ల వద్దే రేషన్ పంపిణీ

● వృద్ధులు,దివ్యాంగులకు మాత్రం ఇళ్ల వద్దే...

● హర్షం వ్యక్తం చేస్తున్న డీలర్లు

చౌకదుకాణాలకు మళ్లీ ప్రాణం!

జిల్లాలో చౌకదుకాణాలు : 1,513

కార్డుదారులు : 7,22,25

ఎండీయూ వాహనాలు : 438



కనుమరుగుకానున్న ఎండీయూ వాహనాలు



చౌకదుకాణంలో రేషన్ పంపిణీ చేస్తున్న డీలరు (ఫైల్)

మొబైల్ డిస్పెన్సింగ్ యూనిట్లు (ఎండీయూ) వ్యవస్థ కోసం గత ప్రభుత్వం కోట్లాది రూపాయల ప్రజాధనాన్ని వృథా చేసింది. ఒక్కో వాహనాన్ని రూ.7 లక్షల చొప్పున చెల్లించి కొనుగోలు చేసింది. అందులో ఆపరేటర్ 10 శాతం వాటా అంటే రూ.70 వేలు చెల్లించగా మిగిలింది బ్యాంకు ద్వారా రుణం ఇప్పించారు. జిల్లాలో 438 వాహనాల కొనుగోలుకు సుమారు రూ.30 కోట్లు వెచ్చించారు. ప్రభుత్వం ఆపరేటర్ వేతనం రూ.10 వేలు, కూలీకి రూ.5 వేలు, ఇంధనం, ఇతర ఖర్చులకు రూ.3 వేలు, ఈఎంఐ రూ.3 వేలు చొప్పున ప్రతినెలా రూ.21 వేలు చెల్లించేవారు. అయితే, ఆపరేటర్లు ఈఎంఐ కట్టడం లేదంటూ నెలకు రూ.18 వేలు మాత్రమే వేస్తున్నది. ప్రభుత్వం ఇచ్చే నగదు సరిపోక ఆపరేటర్ అష్టకష్టాలు పడుతూ వాహనాన్ని నడిపేవారు. కొంత మంది ఆపరేటర్లు ఆర్థిక, శారీరక కష్టాలు పడలేక రేషన్ పంపిణీ వ్యవస్థకు మధ్యలోనే స్వస్తి పలికారు.

● చౌకదుకాణాల ద్వారా సరుకులు

వచ్చే నెల 1వ తేదీ నుంచి చౌక దుకాణాల ద్వారా నిత్యావసర వస్తువులు పంపిణీ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. చౌకదుకాణాలను కిరాణా సరుకుల అంగడిగా మార్చేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టనుంది. దుకాణాల్లో రేషన్‌తోపాటు నిత్యావసర సరుకులు కూడా అందించనుంది. నెలంతా రేషన్ దుకాణాల తలుపులు తెరిచి ఉండేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. వృద్ధులు, దివ్యాంగులకు మాత్రం ఇంటి వద్దే సరుకులు పంపిణీ చేయనున్నారు. ప్రభుత్వ నిర్ణయంతో డీలర్లు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ప్రభుత్వానికి రుణపడి ఉంటాం

జూన్ 1వ తేదీ నుంచి చౌక దుకాణాల ద్వారా కార్డుదారులకు నిత్యావసర వస్తువులు పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించడం హర్షణీయం. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో కార్డుదారులందరికీ సరుకులు అందుతాయి. కూటమి ప్రభుత్వానికి డీలర్లంతా రుణపడి ఉంటారు.



- ఎండీ ఖాదర్‌బాషా, డీలర్ల సంఘం అధ్యక్షుడు

అనేక ఇబ్బందులు పడ్డాం



గత ప్రభుత్వం ఎండీయూ వ్యవస్థను అమలు చేయడంతో అనేక ఇబ్బందులు పడ్డాం. సర్వర్ సమస్యతో కార్డుదారులకు పూర్తిగా సరుకులు అందేవి కావు. వారు తమ వద్దకు వచ్చి వివాదాలకు దిగేవారు. ఇక ఆ పరిస్థితుల ఉండవు.

- జీ.పెంచలయ్య, డీలర్, దేకూరుపల్లి

కష్టాలు తప్పాయి!



చౌక దుకాణాల ద్వారా కార్డుదారులకు నిత్యావసర వస్తువులు పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించడంతో తమ కష్టాలు తీరాయి. గత ప్రభుత్వం ఎండీయూ వ్యవస్థ అమలు చేయడంతో డీలర్లు పని లేక ఖాళీగా కూర్చొని ఉన్నారు. కొందరు కుటుంబ పోషణ కోసం ఇతర పనులకు సైతం వెళ్లారు. ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు.

- ఎంఏ ఫయాజ్, డీలర్, ఉదయగిరి

TENDER NOTICE

EXTENSION OF TENDER SUBMISSION DATE

నెం. 01 డిసిల్టింగ్/ తేది: 14-05-2025

డి.ఎల్.ఎస్.సి. శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా వారు కలువాయి మండలము, రాజుపాళెం గ్రామము పెన్నానది ఆనికట్ అప్ స్ట్రీమ్ (46.19 హెక్టార్స్ ఏరియా) కోసము ఆసక్తిగల సంస్థల నుండి APPCB నుండి స్వీకరించిన సమ్మతి మేరకు CTE Orders NLR-68/APPCB/ZO-TPT/CTE/2024-459 Date:02-11-2024 మరియు CTO Order NLR-68/APPCB/ZO-TPT/CTO/2024-597 Date:17-12-2024, దరఖాస్తులు కోరింది. మానవశక్తి ద్వారా డిసిల్టింగ్ మరియు సమీపములోని నిర్దేశిత డంపింగ్ పాయింట్కు ఉపయోగకరమైన మెటీరియల్ను రవాణా చేయడానికి ఖర్చు టన్నుకు రూ.129/-గా నిర్ణయించబడినది. ఆసక్తి ఉన్న సంస్థలు దరఖాస్తు చేసుకోగలరు.

వరుస సంఖ్యా	వివరములు	అప్ స్ట్రీమ్ సంగం బ్యారేజ్ నియర్ రాజుపాళెం గ్రామం, కలువాయి మండలం
1.	Bid Document Fee	Rs. 15,000/- Through DD in favor of sand account 2024 Nellore.
2.	Earnest Money Deposit (EMD) (10%)	Rs. 90,75,150/- in favor of sand account 2024 Nellore.
3.	Performance Security Deposit PSD (20%)	Rs. 1,81,50,300/- in favor of sand account 2024 Nellore. (Successful Bidder)
4.	Bid Submission Opening Date:	15-05-2025 at 10:00 A.M
5.	Revised Bid Submission Closing Date:	26-05-2025 at 05:00 P.M
6.	Bid Opening Date & Time	27-05-2025 at 04:00 P.M

Note: దరఖాస్తు రుసుము (Bid Document Fee) తిరిగి వాపసు ఇవ్వబడదు. ప్రైస్ బిడ్లు మరియు టెక్నికల్ బిడ్లు శ్రీయుత కలెక్టర్, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు వారి ఆధ్వర్యంలో నెల్లూరు నందు తెరువబడును. ఆసక్తి కలవారు Bid Document Fee మరియు EMD తో పాటు వారి దరఖాస్తును తీసుకొని శ్రీయుత కార్యనిర్వాహక ఇంజనీర్, నెల్లూరు మధ్య విభాగము, నెల్లూరు వారి కార్యాలయము నందు ఆఫీసు పనివేళలో Tender Schedule పొందగలరు. Technical మరియు Price Bid open చేయు సమయానికి బిడ్డర్లు గానీ బిడ్డర్ల తరపున ఏజెంటులు గానీ హాజరుకావలెను. ఈ నోటిఫికేషన్ను జారీ చేసి అధికార యంత్రాంగానికి ఈ నోటిఫికేషన్ వాయిదా వేయడానికి లేదా రద్దు చేయడానికి పూర్తి అధికారములు కలవు.

జిల్లా కలెక్టర్ మరియు మేజిస్ట్రేట్, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా.

నేడు గ్రామాల్లో విద్యుత్ కోత

కోవూరు, మే22 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని వేగూరు, ఇనమడుగు, మోడే గుంట గ్రామాల్లో శుక్రవారం విద్యుత్ సర ఫరా నిలిపి వేస్తున్నట్లు డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కే. మధు సూదన్‌రెడ్డి తెలిపారు. వేగూరు సబ్‌స్టేషన్‌లో కొత్త బ్రేకర్లు ఏర్పాటు చేస్తున్నందున ఉదయం 9 నుంచి 12 గంటల వరకు సరఫరా నిలిపివేస్తున్నామన్నారు. మెరుగైన విద్యుత్ అందించేందుకు చర్యలు చేపట్టామన్నారు. అత్యవసర విభా గాలకు చెందిన సంస్థలు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన కోరారు.

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ.9226
వెండి కిలో ధర	రూ. 100,900
వెండి ఒక గ్రాము	రూ. 103.90

పేదల బియ్యం పక్కదారి...

- అక్రమంగా తరలుతున్న రేషన్ రైస్
- రూ. లక్షలు దండుకుంటున్న అక్రమార్కులు
- చోద్యం చూస్తున్న అధికారులు

కొడవలూరు, మే 22 (ఆంధ్రజ్యోతి): పేదవారి ఆకలి తీర్చేందుకు ప్రభుత్వం పంపిణీ చేస్తున్న రేషన్ బియ్యం పక్కదారి పడుతోంది. అక్రమార్కులు ఈ బియ్యాన్ని రాజమార్గంలో తరలిస్తూ రూ. లక్షలు గడిస్తున్నారు. అడ్డుకోవాల్సిన అధికారులు నిమ్మకునీరెత్తినట్లుగా వ్యవహరిస్తున్నారు.

● సేకరణ ఇలా..

బియ్యం సరఫరా చేసే డీలర్ల నుంచే ఈ దందా కొనసాగుతోంది. కొందరు చౌకదుకాణడీలర్ల లబ్ధిదారులకు కిలో బియ్యానికి రూ.12 చెల్లించి నిల్వ చేస్తున్నారు. మరికొందరు ఈనెల బియ్యం తక్కువగా వచ్చాయని వేలిముద్రలు వేసి వెళ్లండి, కార్డు రద్దు కాకుండా ఉంటుందని ఉచిత సలహా ఇస్తూ మోసగిస్తూ, వారి కోటాను స్వాహా చేస్తున్నారు. అలాగే కొందరు వ్యాపారస్తులు గ్రామీణ ప్రాంతాల్లో ఎర్రగడ్డలు, పాతవస్తువులు కొనుగోలు చేస్తామనే ముసుగులో లగేజీ ఆటోలో వచ్చి బియ్యం కొనుగోలు చేస్తున్నారు. ఇలా సేకరించిన బియ్యాన్ని నిల్వ ఉంచి పెద్ద మొత్తంలో లారీల్లో తరలిస్తున్నారని పలువురు వాపోతున్నారు.

● సొంత బ్రాండ్‌తో విక్రయం

లబ్ధిదారుల నుంచి తక్కువ ధరకు కొనుగోలు చేసిన బియ్యాన్ని అధికారులకు అనుమానం రాకుండా తెల్ల సంచుల్లో నింపుతూ పక్క రాష్ట్రాల్లోని మిల్లర్లకు తరలిస్తున్నారు. పాలిష్ చేసిన బియ్యాన్ని సొంత బ్రాండ్ సంచుల్లో నింపి కిలో రూ.25చొప్పున బస్తా రూ.1500, రూ.1600కు అమ్ముకుని సొమ్ము చేసుకుంటున్నారు. మండలంలో ఇటీవల ఓ రైస్‌మిల్లుపై అధికారులు దాడులు నిర్వహించగా, బియ్యం పట్టుబడి కేసులు కూడా నమోదయ్యాయి. చుట్టుపక్కల గ్రామాలతోపాటు ఇతర మండలాల నుంచి వచ్చే అక్రమ రేషన్ బియ్యం నిల్వలకు కొడవలూరు అడ్డాగా మారింది. పగలు సేకరించిన బియ్యాన్ని రాత్రిళ్లు బహిరంగంగా తరలిస్తున్నారు. ఇకనైనా జిల్లా అధికారులు స్పందించి రేషన్ బియ్యం అక్రమంగా తరలింపునకు అడ్డుకట్ట వేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.





అన్ని గ్రామాల్లో ఉపాధి హామీ పనులు

● మధు, ఎన్ఆర్ఈజీఎస్ ఏపీఎం

ముత్తుకూరు, మే 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని గ్రామాల్లో ఉపాధి హామీ పనులు చేపడుతున్నామని ఎన్ఆర్ఈజీఎస్ ఏపీఎం మధు తెలిపారు. పేదవారికి ఉపాధి హామీ పనులు కల్పిస్తున్నామన్నారు.

?. గ్రామాల్లో ఉపాధి హామీ పనులు ఎలా సాగుతున్నాయి.

!. డెల్టా ప్రాంతం కావడంతో ప్రధానంగా సాగునీటి కాలువల పూడికతీత పనులు చేపడుతున్నాం.

?. ఎంత మందికి ఉపాధి కల్పిస్తున్నారు.

!. మండలంలో ప్రతిరోజు దాదాపు 1100 మందికి పైగా పనుల ద్వారా ఉపాధి కల్పిస్తున్నాము. ఉపాధి కూలీలకు రావాల్సిన నగదును వారి ఖాతాలకు నేరుగా వచ్చేలా చర్యలు తీసుకున్నాం.

?. వేసవిలో ఉపాధి కూలీలు ఇబ్బందిపడకుండా ఏమి చర్యలు తీసుకున్నారు.

!. నీడ కోసం పనులు జరిగే స్థలం వద్ద టార్పాలిన్ పట్టలతో తాత్కాలికంగా వసతి ఏర్పాటు చేశాం. వడదెబ్బ తగలకుండా స్థానిక ఏఎన్ఎంలతో మాట్లాడి కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందజేస్తున్నాం.

వ్యాపారకేంద్రంగా తహసీల్దారు కార్యాలయ ఆవరణ

కోవూరు, మే22 (ఆంధ్రజ్యోతి): స్థానిక తహసీల్దారు కార్యాలయ ఆవరణ ఇటీవల వ్యాపార కేంద్రంగా మారింది. పలు ప్రైవేటు సంస్థలు తమ కార్యకలాపాల్ని ఇక్కడ నుంచే కొనసాగిస్తున్నారు. ఓ కార్ల అమ్మక సంస్థ కార్లకు రుణం అందిస్తుందని ప్రచారం చేస్తూ గురువారం కార్యాలయ ఆవరణలో ప్రచారం సాగించారు. ప్రైవేటు సంస్థలు యథేచ్ఛగా కార్యాలయ ఆవరణలో తమ వ్యాపారాలు, ప్రచారం చేస్తున్నప్పటికీ రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదు.

మాజీ ఎమ్మెల్యే ప్రసన్నకు శస్త్రచికిత్స

కోవూరు, మే22 (ఆంధ్రజ్యోతి): మాజీ ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి చేతికి నెల్లూరులోని ఓ ప్రైవేటు వైద్యశాలలో గురువారం శస్త్రచికిత్స చేశారు. 15 రోజులపాటు ఆయన విశ్రాంతి తీసుకోవాలని వైద్యులు సూచించారు. ఈ క్రమంలో తనను కలిసేందుకు ఎవరూ ప్రయత్నం చేయవద్దని ఆయన సామాజిక మాధ్యమంలో విజ్ఞప్తి చేశారు.

మినీ మహానాడుకు తరలిన నేతలు



చెన్ను అశోక్‌రెడ్డి ఆధ్వర్యంలో మినీ మహానాడు కార్యక్రమానికి బయలుదేరుతున్న నేతలు

రాపూరు, మే 22 (ఆంధ్రజ్యోతి): వెంకటగిరిలో గురువారం జరిగిన మినీ మహానాడు సభకు రాపూరు మండలం టీడీపీ యువ నాయకుడు చెన్ను అశోక్ రెడ్డి ఆధ్వర్యంలో పలువురు నేతలు బైకు, కార్లలో తరలి వెళ్లారు. ఈ సందర్భంగా ప్రతి గ్రామం నుంచి టీడీపీ కార్యకర్తలు భారీగా మినీ మహానాడు సభకు తరలి వెళ్లారు. కార్యక్ర మంలో టీడీపీ నాయకులు నల్లవడ్ల వెంకట రమణారెడ్డి, మధుసూదన్ రెడ్డి, పఠాన్ చాన్‌బాషా, అందిన శంకర్ నారాయణ రెడ్డి, గడ్డం సంజీవరెడ్డి, చెన్ను పెంచల్ రెడ్డి, మందాటి చంద్రమోహన్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పార్లమెంటు మినీ మహానాడుకు తరలిరండి

కోవూరు, మే22 (ఆంధ్రజ్యోతి): నెల్లూరులోని వీపీఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో శుక్రవారం జరిగే టీడీపీ పార్లమెంటు స్థాయి మినీ మహానాడుకు తరలిరావాలని ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి కోరారు. కోవూరు నియోజకవర్గ పరిధిలోని టీడీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు ఈ మినీ మహానాడులో పాల్గొనాలని ఆమె విజ్ఞప్తి చేశారు. నాయకులు, కార్యకర్తలను ఆమె సామాజిక మాధ్యమం ద్వారా ఈ మేరకు ఆహ్వానం పలికారు.

భక్తిశ్రద్ధలతో హనుమజ్జయంతి



కోవూరు : శ్రీవీరాంజనేయస్వామి ఆలయంలో బారులు తీరిన భక్తులు

కోవూరు, మే 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీవీరాంజనేయ స్వామి ఆలయంలో గురువారం హనుమజ్జయంతిని భక్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయంలో ఉదయం నుంచే భక్తులు పెద్దసంఖ్యలో బారులు తీరారు. ఈ సంద ర్భంగా పూలంగిసేవ, పల్లకీసేవ నిర్వహించారు. ఆలయపూజారి జనార్దనం నాగరాజాచార్యులు భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. పెద్ది నాగార్జున భక్తులకు వెండి ఆంజనేయస్వామి పతకాలను పంపిణీ చేశారు.

● కొత్తూరులో...

ఇందుకూరుపేట, మే 22 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొత్తూరులో వెలసి ఉన్న శ్రీయోగాంజనేయస్వామి ఆలయంలో వ్యవస్థాపక ధర్మకర్తలు కలికి శ్రీలత- కోదండరామిరెడ్డి దంపతులు ఆధ్వర్యంలో హనుమజ్జయంతిని గురువారం వైభవంగా నిర్వహించారు. ముందుగా స్వామివారికి అర్చన, సహస్రనామ అష్టోత్తరం, విశేష పుష్పయాగం, సిందూరార్చన నిర్వహించారు. జగదేవిపేట పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ కిషోర్‌కుమార్, డాక్టర్ బ్రహ్మేశ్వర నాయుడుల ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో సబ్‌ట్రెజరీ అధికారి రమణారావు, హెల్త్ ఎడ్యుకేటర్ సుధాకర్‌రావు, టెంపుల్స్ మేనేజర్ శ్రీధర్‌నాయుడు, హెల్త్ సూపర్‌వైజర్ రమ, హెల్త్ అసిస్టెంట్ వరప్రసాద్, మాధవ, సచివాలయం హెల్త్ సెక్రటరీ సుజాత, 104 సిబ్బంది లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.



పెంచలకోనలో వీరాంజనేయ స్వామికి క్షేత్రోత్సవం నిర్వహిస్తున్న భక్తులు

రాపూరు, (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అన్ని గ్రామాల్లో హనుమాన్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని ఆంజనేయ స్వామి ఆలయం ఉదయం నుంచి భక్తులతో కిటకిటలాడింది. ఆంజనేయ స్వామికి తమలపాకులతో ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. మండల కేంద్రం మద్దెలమడుగు కేంద్రం వద్ద ఉన్న 25 అడుగుల హనుమాన్ విగ్రహం వద్ద ప్రత్యేక పూజలు చేసి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అలాగే పెంచలకోనలో ఉన్న వీరాంజనేయ స్వామి ఆలయంలో అమృతాభిషేకాలు, సింధూర పూజ, క్షేత్రోత్సవం వైభవంగా నిర్వహించారు.

●సైదాపురం : మండలంలో సైదాపురం, చాగణం, తుమ్మల తలుపూరు, కలిచేడు, గ్రిద్దలూరు తదితర గ్రామాల్లో ఆంజనేయస్వామికి విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.



బుచ్చిలో..

బుచ్చిరెడ్డిపాళెం, (ఆంధ్రజ్యోతి): హను మజ్జయంతి సందర్భంగా బుచ్చి నగర పం చాయతీతోపాటు మండలంలోని గ్రామాల్లో గురువారం వేడుకలు వైభవంగా జరిగాయి. పెనుబల్లి, జొన్నవాడ, బుచ్చి, రేబాల, దామరమడుగు, చెల్లాయపాళెం, రెడ్డి పాళెం, కట్టుబడిపాళెం, నాగమాంబాపురం, పంచేడు మిన గల్లు, కాగులపాడు, శ్రీరంగరాజపురం, తదితర గ్రామాల్లోని ఆంజనేయ స్వామి మందిరాలు, రామాలయాల్లోని ఆంజనేయస్వామికి అభిషేకాలు, నేతి వడలు, తమలపాకులు, తులసి మాలలతో అలంకరణ చేశారు. పలుచోట్ల అన్నదానాలు చేశారు. రాత్రి పలు గ్రామాల్లో ఆంజ నేయుడికి గ్రామోత్సవాలు నిర్వహించారు.



పొదలకూరులో..

పొదలకూరు, (ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీలక్ష్మీవెంకటేశ్వరస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం స్వామి, అమ్మవార్ల కల్యాణం కన్నుల పండువగా నిర్వహించారు. కల్యాణంలో భాగంగా వేద పండితులు, భక్తులు ప్రదర్శించిన మాల మార్పిడి నృత్యాలు ఆకట్టుకున్నాయి. భక్తజనం గోవిందనామ స్మరణలతో ఆలయం మారుమోగింది.

పొట్టు ట్రాక్టర్లతో ప్రమాదాలు

● వాహనదారుల ఇక్కట్లు



జాతీయ రహదారిపై నిబంధనలకు విరుద్ధంగా సక్రమంగా పట్టలు కట్టుకోకుండా వెళ్తున్న పొట్టు ట్రాక్టర్

వెంకటాచలం, మే 22 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని జాతీయ రహదారిపై వెళ్తున్న పొట్టు లోడు రవాణా ట్రాక్టర్లతో ప్రయాణికులు, వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. వెంకటాచలం మీదుగా ముత్తుకూరు, నాయుడుపేట వైపు ఉన్న పరిసర ప్రాంతాల్లోని వివిధ పరిశ్రమలకు ఈ పొట్టు ట్రాక్టర్లు వెళ్తుంటాయి. పొట్టు లోడుతో వెళ్లే ట్రాక్టర్ వెనుక వచ్చే ద్విచక్ర వాహనదారుల కళ్లలోకి పొట్టు పడుతుండటంతో తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. దీనికి ప్రధాన కారణం పొట్టు లోడుతో వెళ్లే ట్రాక్టర్లకు పట్టలు సక్రమంగా కట్టుకోకుండా వెళ్లడమేనని వాహనదారులు విమర్శిస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా నిత్యం పదుల సంఖ్యలో పొట్టు ట్రాక్టర్లు జాతీయ రహదారిపై వెళ్తుంటాయి. వెంకటాచలం మీదుగా ముత్తుకూరు, నాయుడుపేట వైపుగా నిత్యం పొట్టు ట్రాక్టర్లను తిప్పుతుండడంతో ప్రయాణికులు, ద్విచక్ర వాహనదారులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నిబంధనలు పాటించకుండా రవాణాచేసే వారిపై రవాణా, పోలీస్ శాఖల అధికారులు నామమాత్రపు దాడులు చేసి జరిమానాలు విధించి వదిలేస్తుండడంతో పొట్టు ట్రాక్టర్ల యాజమానులు తీరు మారడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. కొందరు పోలీస్ సిబ్బంది మాముళ్ల మత్తులో వాటిని వదిలేస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా పోలీస్, రవాణా శాఖ అధికారులు స్పందించి పొట్టు లోడు రవాణా చేసే ట్రాక్టర్లు నిబంధనలు పాటించేలా చర్యలు చేపట్టాలని ద్విచక్ర వాహనదారులు, ప్రయాణికులు కోరుతున్నారు.

గ్రామస్థాయిలో జనసేన బలోపేతానికి కృషి చేయాలి: బొబ్బేపల్లి



జనసేన పార్టీ క్రియాశీలక సభ్యులను సన్మానిస్తున్న సురేష్‌నాయుడు

వెంకటాచలం, మే 22 (ఆంధ్రజ్యోతి): గ్రామస్థాయిలో జనసేన పార్టీ బలోపేతానికి కృషిచేయాలనిఆపార్టీ సర్వేపల్లి నియోజకవర్గ సమన్వయకర్త బొబ్బేపల్లి సురేష్ నాయుడు పార్టీ క్రియాశీలక వలంటీర్లకు సూచించారు. స్థానిక ఆపార్టీ కార్యాలయంలో గురువారం క్రియాశీలక వలంటీర్లకు సభ్యత్వాల కిట్లు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి జనసైనికుడి కుటుంబానికి రక్షణ కల్పించేవిధంగా పార్టీ అధినేత పవన్ కల్యాణ్ క్రియాశీలక సభ్యత్వ నమోదు కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. సభ్యత్వం తీసుకున్న సభ్యుడికి ప్రమాదం జరిగితే వెంటనే రూ.5 లక్షలు ప్రమాద బీమా వస్తుందని, అలాగే గాయాలబారిన పడినవారికి వైద్య ఖర్చుల నిమిత్తం రూ.50 వేల రుపాయలు వస్తాయన్నారు. సర్వేపల్లి నియోజకవర్గంలో 3607 సభ్యత్వాలను నమోదు చేయించడంలో క్రియాశీలక వాలంటీర్ల పాత్ర ఎనలేనిదన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ డైరెక్టర్ గుమ్మినేని వాణిభవాని, నేతలు పినిశెట్టి మల్లికార్జున్, పసుపులేటి ప్రసాద్, షేక్ రహీమ్, నారదాసు రవి, అశోక్, మస్తాన్, కిషోర్, చల్లా చెంచయ్య, మణి, గుండు ఆనంద్, శరత్ తదితరులున్నారు.



తిరంగా ర్యాలీ నిర్వహిస్తున్న కూటమి నాయకులు

కొత్తూరులో ఘనంగా తిరంగా ర్యాలీ

ఇందుకూరుపేట, మే 22 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొత్తూరులో మండల బీజేపీ అధ్యక్షుడు కైలాసం శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో గురువారం తిరంగా ర్యాలీని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా టీడీపీ మండల అధ్యక్షుడు పవన్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ పహల్గాం దాడిలో పాకిస్థాన్ ముష్కరుల మారణకాండకు భారత సైనికులకు చూపించిన సాహసానికి జోహార్లని అన్నారు. అనంతరం వీర జవాన్ మురళీ నాయక్‌కి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు భాస్కర్‌గౌడ్, మారుబోయిన శ్రీనివాసులు, టీడీపీ నాయకులు పీఎల్.రావు, చైతన్య, విజయ్‌కుమార్, చెంచుకిషోర్‌బాబు, ఎన్డీఏ కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వరకవిపూడి పాఠశాలకు మహర్దశ



వరకవిపూడి స్కూల్(ఫైల్)

తోటపల్లిగూడూరు, మే 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వరకవిపూడి పాఠశాలకు మహర్దశ పట్టింది. ఇప్పటివరకు ప్రాథమిక పాఠశాలగా ఉన్న ఈ పాఠశాలను హైస్కూల్‌గా మార్చారు. ఈపాఠశాలలో సుమారు 140 మంది విద్యార్థులు చదువుతున్నారు. పాఠశాలను హైస్కూల్‌గా మార్చడంతో విద్యార్థులు, తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటి వరకు మండలంలో చిన్నచెరుకూరు, ఈదూరు, చెన్నపల్లిపాలెం, తోటపల్లిగూడూరులో హైస్కూల్స్ ఉన్నాయి. కొత్తగా వరకవిపూడిలో మరో హైస్కూల్ చేరడంతో ఐదుకు చేరాయి.

బైక్ బోల్తా : ఒకరికి గాయాలు

వెంకటాచలం, మే 22 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కసుమూరు పంచాయతీ షాపా బావి సమీపంలో బైక్ బోల్తాపడి ఒకరు గాయపడిన సంఘటన గురువారం జరిగింది. వివరాల్లోకి వెళితే... పొదలకూరు పట్టణానికి చెందిన శ్రీకాంత్ సర్వేపల్లిలోని తన బంధువుల ఇంటికి వచ్చి తిరిగి వెళ్తుండగా షాపా బావి దాటిన తర్వాత రోడ్డుపై ఉన్న కుక్కలు బైక్ వెనుక పడడంతో కంగారుపడిన శ్రీకాంత్ అదుపుతప్పి బైక్‌తో సహా రోడ్డుపై పడిపోయాడు. దీంతో అతడిని కసుమూరులోని ఒక ప్రైవేటు క్లీనిక్‌కు తరలించి ప్రథమ చికిత్స అందించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

C.R.I.M.E N.E.W.S



వాహన పత్రాలు తనిఖీ చేస్తున్న సీఐ

టిడ్కో ఇళ్లలో కార్డన్ సెర్చ్

● 45 బైకుల స్వాధీనం

నెల్లూరు(క్రైం), మే 22 (ఆంధ్రజ్యోతి) : నేర నియంత్రణ, అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేసేందుకు నగరంలోని భగత్‌సింగ్ కాలనీలో ఉన్న టిడ్కో గృహ సముదాయంలో గురువారం తెల్లవారుజామున నగర పోలీసులు కార్డన్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. అక్కడి 1922 ఇళ్లను పోలీసులు తనిఖీ చేశారు. సరైన పత్రాలు లేని 45 బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. అనుమానితుల వేలిముద్రలు సేకరించారు. ఈ సందర్భంగా ఎస్పీ జీ కృష్ణకాంత్ మాట్లాడుతూ సామాన్య ప్రజల్లో ధైర్యం నింపుతూ పోలీసు వ్యవస్థపై విశ్వాసం పెంచేందుకు ఈ ఆపరేషన్ నిర్వహిస్తున్నామని తెలిపారు. పరారీలో ఉన్న నేరస్తులను గుర్తించి అదుపులోకి తీసుకోవ డం, వెండి, బంగారు వంటి చోరీ సొత్తు, రికార్డులు లేని అన్ని వస్తువులు, వాహనాలు, అక్రమ మద్యం, ఆయుధాలు, పేలుడు పదార్థాలు, మాదక ద్రవ్యాలు వంటి వాటిని గుర్తించి స్వాధీనం చేసుకోవడమే కార్డన్ సెర్చ్ ఆపరేషన్ ముఖ్య ఉద్దేశమని వెల్లడించారు. చట్టవ్యతిరేక చర్యలు, అనుమా నాస్పద వ్యక్తుల సమాచారం ఉంటే ప్రజలు స్థానిక పోలీసులకుగానీ 112, 100 నెంబర్లకుగానీ తెలియజేయాలని కోరారు. కార్డన్ సెర్చ్‌లో సీఐలు వేణుగోపాల్‌రెడ్డి, దశరథరామయ్య, రోశయ్య, శ్రీనివాసరావు, 12 మంది ఎస్ఐలు, 100 మంది సిబ్బంది పాల్గొన్నారు.

రైల్వే ప్లాట్‌ఫాంపై ఒకరి మృతి



రైల్వే ప్లాట్‌ఫాంపై గుర్తుతెలియని మృతదేహం

నెల్లూరు (క్రైం), మే 22 (ఆంధ్ర జ్యోతి) : నెల్లూరు ప్రధాన రైల్వే స్టేషన్‌లోని రెండవ నెంబరు ప్లాట్‌ఫాం పై గుర్తుతెలియని వ్యక్తి గురువారం తెల్లవారు జామున మృతి చెందా డు. రైల్వే పోలీసుల సమాచారం మేరకు... 55 నుంచి 60 ఏళ్ల వ్యక్తి మృతదేహాన్ని రైల్వే పోలీసులు గుర్తించారు. మృతదేహంపై స్కైబ్లూ, పసుపు చెక్స్ ఫుల్ హాండ్స్ షర్ట్, బులుగు గళ్ల లుంగీ ఉన్నాయి. అనారోగ్యంతో మృతి చెంది ఉంటాడని ఎస్ఐ ఎన్ హరిచందన తెలిపారు. మృతుడి వివరాలు తెలిసిన వారు రైల్వే పోలీసులను సంప్రదించాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి ..



గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

దగదర్తి (బిట్రగుంట), మే 22 (ఆంధ్రజ్యోతి): దగదర్తి మండలం అనంతవరం పంచాయతీ లైన్స్‌నగర్ జాతీయ రహదారి ఫ్లైఓవర్ బ్రిడ్జిపై గుర్తుతెలియని వ్యక్తి(35) మృతదేహాన్ని గుర్తించినట్లు ఎస్ఐ జంపాని కుమార్ గురువారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు తెల్లవారుజామున కావలి వైపు వెళ్లే గుర్తుతెలియని వాహనం ఢీకొని అతను మృతి చెంది ఉండవచ్చన్నారు. మృతుడి ఛాతీ ఎడమవైపు, కుడి చేతిపైన ఇంగ్లిషు అక్షరాలతో ఎంఎం అనే పచ్చబొట్టు ఉందన్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని నెల్లూరు జీజీహెచ్‌కి తరలించామన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ప్రమాదవశాత్తు కాలువలో పడి ఒకరు...

ముత్తుకూరు, మే 22 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు కాలువలో పడి వ్యక్తి మృతి చెందిన సంఘటన ముత్తుకూరు మండలం బ్రహ్మదేవంలో గురువారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. వరకవిపూడి ఎస్టీ కాలనీకి చెందిన ఆలూరి కృష్ణ (35) చెత్త ఏరుకుంటూ జీవనం సాగించేవాడు. బుడ్డి డ్రైన్ సమీపంలో చెత్త ఏరుకుంటూ ప్రమాదవశాత్తు కాలువలో పడ్డాడు. గురువారం కృష్ణ మృతదేహం బుడ్డి డ్రైన్‌లో తేలుతూ కనిపించడంతో స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందజేశారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహానికి పంచనామా నిర్వహించి శవపరీక్ష నిమిత్తం నెల్లూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఈమేరకు ముత్తుకూరు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మద్యం మత్తులో గొంతుకోసుకున్న యువకుడు

నెల్లూరు(క్రైం), మే 22 (ఆంధ్రజ్యోతి) : మద్యం మత్తులో ఓ యువకుడు గురువారం ఉదయం గొంతు కోసుకున్నాడు. పోలీసుల సమాచారం మేరకు... నెల్లూరులోని కస్తూరిదేవి స్కూలు ఎదురు వీధిలో ఓ యువకుడు కత్తితో గొంతుకోసుకొని అపస్మారక స్థితిలో పడిఉండటాన్ని గమనించిన స్థానికులు దర్గామిట్ట పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు హుటాహుటిన అక్కడికి చేరుకుని ఆ యువకుడిని చికిత్స నిమిత్తం జీజీహెచ్‌కు తరలించారు. మార్గమధ్యలో తాను ప్రకాశం జిల్లా తుళ్లూరుకు చెందిన వాడినని, తన పేరు దాసు అని, బేల్దారి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నానని, తిరుపతి నుంచి వస్తున్నానని పోలీసులకు తెలిపాడు. గొంతు ఎందుకు కోసుకున్నావని అడగ్గా సమాధానం చెప్పలేదు. జీజీహెచ్‌లో చేర్పించిన పోలీసులు సాయంత్రం యువకుడిని విచారించేందుకు వెళ్లగా అప్పటికే అతను డిశ్చార్జ్ అయి వెళ్లిపోయాడని వైద్యసిబ్బంది తెలిపారు. అతని కోసం గాలిస్తున్నామని దర్గామిట్ట పోలీసులు తెలిపారు.

సమస్యలు పరిష్కరించండి

● మానవహారంగా సీహెచ్‌సీల నిరసన

నెల్లూరు (వైద్యం), మే 22 (ఆంధ్రజ్యోతి) : తమ సమస్యలు పరిష్కరిం చాలని కోరుతూ కమ్యూనిటీ హెల్త్ అధికారులు (సీహెచ్‌వో) గురువారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం వద్ద మానవహారం ఏర్పడి నిరసన తెలిపారు. వారు కొనసాగిస్తున్న సమ్మెలో భాగంగా ఈ కార్యక్రమం చేపట్టారు. సీహెచ్‌సీల సంఘం జిల్లా అధ్యక్షుడు భాను మహేష్ మాట్లాడుతూ గ్రామాల్లో వైద్య చికిత్సలు అందిస్తున్న తమకు వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా కోఆర్డినేటర్ ఆదిల్, రుబిక, విజయ్, ప్రశాంతి పాల్గొన్నారు.



మానవహారంగా ఏర్పడ్డ సీహెచ్‌సీలు

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	136
స్కిన్ చికెన్	244
స్కిన్‌లెస్	270

కోడిగుడ్ల ధర (100) : 530

ప్రకాష్‌రాజ్ దిష్టిబొమ్మ దహనం

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), మే 22 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని గుప్తా పార్క్ వద్ద గురువారం సినీ నటుడు ప్రకాష్‌రాజ్ దిష్టిబొమ్మను బీజేపీ నాయకులు దహనం చేశారు. ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి యశ్వంత్‌సింగ్ మాట్లాడుతూ పాకిస్థాన్ సినిమాలపై మన దేశంలో నిషేధం విధించడం సరికాదన్న ప్రకాష్‌రాజ్ వ్యాఖ్యలను ఖండిస్తున్నామన్నారు. ఆయన్ను దేశం నుంచి బహిష్కరించాలని డిమాండ్ చేశారు. ప్రకాష్‌రాజ్ నటించిన సినిమాలను కూడా బ్యాన్ చేయాలని రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలను కోరుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో హేమంత్, పెంచలయ్య, బాలాజీ, లక్ష్మి, మధు పాల్గొన్నారు.



శ్రీరామదూతం శిరసా నమామి !

● భక్తిశ్రద్ధలతో హనుమజ్జయంతి ● ఆలయాల్లో సామూహిక పూజలు ● అన్నదానాలు, నగరోత్సవాలు



కన్యకాపరమేశ్వరి ఆలయంలో బూందీతో చేసిన ఆంజనేయస్వామి రూపానికి హారతి ఇస్తున్న కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి

నెల్లూరు (సాంస్కృతికం), మే 22 (ఆంధ్రజ్యోతి) : ఆంజనేయ స్వామి జయంతి సందర్భంగా నగరంలోని ఆలయాల్లో ఉత్సవాలు వైభవంగా జరిగాయి. విశేష అభిషేకాలు, సామూహిక అర్చనలు, హోమాలు నిర్వహించారు. పలు ఆలయాల్లో భారీ ఎత్తున అన్నదానం జరిగింది. పూలంగి, పల్లకీ సేవలు, నగరోత్సవాలు నేత్రపర్వంగా సాగాయి.

● శబరి శ్రీరామక్షేత్రంలో ఉదయం అభిషేకం, రజిత కవచ అలంకారం, హోమం, సామూహిక లక్ష మల్లెల అర్చన, మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ జరిగాయి. సాయంత్రం బ్యాండుకచేరీ, విశేష అలంకారంలో పల్లకీసేవ, చిన్నారులకు వెండి డాలర్లతో కూడిన కంకణధారణ జరిగాయి. రాత్రి విశేష పుష్ప, విద్యుద్దీపాలంకరణతో నగరోత్సవం వైభవంగా జరిగింది. చెన్నూరు వెంకటేశ్వరరెడ్డి పర్యవేక్షించారు.

● మైపాడు గేట్ ప్రాంతంలోని అంజనేయస్వామి ఆలయంలో ఉదయం పంచామృతాభిషేకాలు, సామూహిక లక్ష తమలపాకుల పూజ జరిగాయి. మధ్యాహ్నం అన్నదానం, సాయంత్రం పూలంగిసేవ, చిన్నారులకు డాలర్ల పంపిణీ, అనంతరం పల్లకీసేవ నిర్వహించారు. మద్దూరు సుబ్బారావు మిత్రబృందం పర్యవేక్షించింది.

● బాలాజీనగర్ సీతారామ మందిరంలో ఉదయం అభిషేకాలు, సామూహిక ఆకుపూజ, అన్నదానం, సాయంత్రం వివిధ రకాల పండ్లతో అర్చనలు, పూలంగిసేవ, నగరోత్సవం జరిగాయి. సీతారామమందిరం, వాకాటి సంజీవయ్య, త్యాగరాజస్వామి కల్యాణ మండపం కమిటీల సంయుక్త ఆధ్వర్యంలో ఈ ఉత్సవాలు నిర్వహించారు.

● సుజాతమ్మకాలనీ అష్టలక్ష్మీ ఆలయంలోని కార్యసిద్ధి ఆంజనేయస్వామికి పంచామృతాభిషేకం, లక్ష తమలపాకులతో సామూహిక అర్చన, అన్నప్రసాద వితరణ, సాయంత్రం పల్లకీసేవ జరిగాయి. ఆలయ మేనేజింగ్ ట్రస్టీ డాక్టర్ సర్వేపల్లి అజయ్‌కుమార్, ట్రస్టీలు పర్యవేక్షించారు.

● వేదాయపాళెం త్యాగరాజస్వామి మందిరంలో ఉదయం అభిషేకాలు, మన్యుసూక్త, పురుష సూక్త, రుద్రసూక్త హోమాలు, ఆకుపూజ, సహస్ర నామార్చన, అన్నప్రసాదం వితరణ, రాత్రి పల్లకీసేవ జరిగాయి.

● స్టోన్‌హౌస్‌పేట కన్యకాపరమేశ్వరి ఆలయంలో లక్ష తమలపాకుల పూజ జరిగింది. 25కేజీల బూందీతో రూపొందించిన ఆంజనేయస్వామి రూపం భక్తులను ఆకట్టుకుంది. ఆ శిల్పానికి విశేష పూజలు చేశారు. కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి పాల్గొన్నారు. కోట గురుబ్రహ్మం, పేగు షణ్ముఖరావు, చిరంజీవి, ఎంపీ అంజనేయులు, భవనాపి సురేష్, బద్రి నారాయణ, ప్రధానార్చకుడు శివకుమార్ స్వామి పర్యవేక్షించారు.

● రాయాజీవీధి ఆంజనేయస్వామి ఆలయంలో ఉదయం పంచామృతా భిషేకాలు, ఆకుపూజ, హోమం, అన్నదానం జరిగాయి. రాత్రి సీతారాముల కల్యాణం ఘనంగా జరిగింది. హనుమాన్ మిత్రమండలి సభ్యులు పర్యవేక్షించారు.

● **రూరల్‌లో ఉత్సవాలు**

నెల్లూరు రూరల్(ఆంధ్రజ్యోతి) : హనుమజ్జయంతి ఉత్సవాలు నెల్లూరు రూరల్‌లోని గ్రామాల్లో వైభవంగా జరిగాయి. ఆలయాల్లో విశేష అభిషేకాలు, పూజలు, అన్నదానం జరిగాయి. పొట్టేపాళెంలోని హనుమంతుని ఆలయం వద్ద వేదగిరి క్షేత్రం బ్రహ్మోత్సవ కమిటీ చైర్మన్ ఇందుపూరు అచ్యుత శంకర్ రెడ్డి కుటుంబం ప్రత్యేక పూజలు చేసింది. ముందుగా ఆంజనేయునికి పల్లకీ సేవ నిర్వహించారు. వెల్లంటి, సౌత్‌మోపూరు, పెద్దచెరుకూరు, అల్లీపురం, ఆమంచర్ల, ములుముడి, కొండ్లపూడి గ్రామాల్లోనూ ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు జరిగాయి.



బాలాజీనగర్‌లో ఆంజనేయస్వామి నగరోత్సవం



అష్టలక్ష్మి ఆలయంలో లక్ష తమలపాకులతో పూజ చేస్తున్న భక్తులు



చెమ్మండివారితోట ఆంజనేయస్వామి ఆలయంలో పూర్ణాహుతి



మైపాడు గేటు హనుమాన్ మందిరం వద్ద అన్నదానం



కరపత్రాలు చూపుతున్న శ్రీరాం సతీష్, శ్రీనివాసరావు

'అపోలో'లో కాస్మెటిక్ క్లినిక్

నెల్లూరు (వైద్యం), మే 22 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని అపోలో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో నూతనంగా కాస్మెటిక్ క్లినిక్ ప్రారంభిస్తున్నట్లు ఆసుపత్రి మెడికల్ డైరెక్టర్ డాక్టర్ శ్రీరాం సతీష్, ప్లాస్టిక్ సర్జన్ డాక్టర్ శ్రీనివాసరావు వెల్లడించారు. గురువారం ఆసుపత్రిలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. మెట్రో నగరాలకే పరిమితమైన కాస్మెటిక్ సర్జరీలు నెల్లూరులోనూ అందుబాటులోకి తెచ్చామన్నారు. తక్కువ ఖర్చుతో వైద్య చికిత్సలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. ప్రమాదాల్లో ముఖంపై వచ్చే మార్పులను కాస్మెటిక్ సర్జరీతో సరిచేయ వచ్చని చెప్పారు. నూతన క్లినిక్ కరపత్రాలను ఆవిష్కరించారు.

కాంగ్రెస్‌లో పలువురి చేరిక

నెల్లూరు (వైద్యం), మే 22 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు చేవూరు దేవకుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో పలువురు గురువారం ఆ పార్టీలో చేరారు. పార్టీ నేత కిరణ్‌కుమార్ సహకారంతో దాదాపు 30 మంది యువకులు నగరంలోని ఇందిరాభవన్‌లో కాంగ్రెస్ పార్టీ కండువా కప్పుకున్నారు. కార్యక్రమంలో పార్టీ కోవూరు నియోజకవర్గ ఇన్‌చార్జి ఏటూరి శ్రీనివాసులు రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు తలారి బాలసుధాకర్, మోహన్‌రెడ్డి, గణేష్‌బాబు, కిశోర్‌బాబు, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

రాజరాజేశ్వరి ఆలయంలో దాతల పరిశీలన

నెల్లూరు (సాంస్కృతికం), మే 22 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని రాజరాజేశ్వరి ఆలయంలో జరుగుతున్న పునర్నిర్మాణ పనులను దాతలు ఆల్తూరు మహేష్‌రెడ్డి కుటుంబ సభ్యులు గురువారం పరిశీలించారు. దాదాపు రూ.50లక్షలతో అమ్మవారి ఆలయ విమాన గోపురం, నూతన ధ్వజస్తంభం, నవగ్రహ మండపం, సుందరేశ్వర ఆలయం వద్ద దక్షిణం వైపు ప్రహరీ నిర్మాణం జరుగుతున్నాయి. వాటిని దాతలు పరిశీలించారు. స్వామి, అమ్మవార్లకు పూజలు చేశారు.

సతీష్‌రెడ్డికి నెమలి ఈక కానుక

రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు గుండ్రా సతీష్ రెడ్డి జన్మదినం సందర్భంగా ప్రముఖ చిత్రకారుడు అమీర్‌జాన్ నెమలి ఈకపై సతీష్‌రెడ్డి రూపాన్ని చిత్రించి శుభాకాంక్షలు తెలిపారు.

చలం రచనలపై సాహితీ సమాలోచన

నెల్లూరు (సాంస్కృతికం), మే 22 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని వెంకటేశ్వర విద్యాలయంలో గురువారం పెన్నా రచయితల సంఘం ఆధ్వర్యంలో గుడిపాటి వెంకటాచలం రచనలపై సాహితీ సమాలోచనా కార్యక్రమం జరిగింది. స్త్రీ స్వేచ్ఛా రచనలు చేసిన చలం అంతర్ముఖం భావాలపై డాక్టర్ గంగిశెట్టి శివకుమార్, టేకుమళ్ల వెంకటప్పయ్య, అవ్వారు శ్రీధర్‌బాబు సమీక్షించారు. చలం చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమాన్ని సంఘం అధ్యక్షురాలు జీ సుభద్రాదేవి, కార్యదర్శి తోట సులోచన పర్యవేక్షించారు.

కడపలో మహానాడు ఏర్పాట్ల పరిశీలన



మహానాడు ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎంపీ వేమిరెడ్డి, నాయకులు

నెల్లూరు (హరనాథపురం), మే 22 (ఆంధ్రజ్యోతి) : కడపలో ఈ నెల 27 నుంచి జరగనున్న తెలుగుదేశం పార్టీ మహానాడు ఏర్పాట్లను గురువారం కడప జిల్లా టీడీపీ అధ్యక్షుడు శ్రీనివాసులురెడ్డి, ఎమ్మెల్సీ రాంభూపాల్‌రెడ్డి, ఇతర నాయకులతో కలిసి ఎంపీ వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి పరిశీలించారు. ఇప్పటివరకు జరిగిన పనులపై ఆరా తీసి, పలు సూచనలు చేశారు. ఎంపీ వెంట టీడీపీ నాయకులు కేతంరెడ్డి వినోద్‌రెడ్డి, రవీంద్రరెడ్డి, తదితరులు పాల్గొన్నారు. అలాగే మహానాడు ఏర్పాట్లపై తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, సమన్వకర్త కమిటీ కో కన్వీనర్ పల్లా శ్రీనివాస్ తదితర ముఖ్యనేతలతోనూ కమిటీ సభ్యుడు ఎంపీ వేమిరెడ్డి సమావేశమయ్యారు. తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వసతుల కల్పనపై మాట్లాడారు. ఇక 4 రోజులు మాత్రమే గడువు ఉన్నందున ఏర్పాట్లలో వేగం పెంచాలని నిర్ణయించారు.

ప్రతిభ పురస్కారాల ప్రదానోత్సవానికి ఆహ్వానం

నెల్లూరు(వ్యవసాయం, ఆంధ్రజ్యోతి): నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డిని పద్మశాలి సంఘం నాయకులు గురువారం వారి నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. పదో తరగతిలో ప్రతిభ కనబర్చిన పద్మశాలి విద్యార్థులకు పురస్కారాలు అందజేసే కార్యక్రమానికి అతిథులుగా రావాలని ఆహ్వానించారు. తప్పక వస్తామని వేమిరెడ్డి దంపతులు చెప్పినట్లు పద్మశాలి సంఘం నాయకుడు బుధవరపు బాలాజీ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం కోకన్వీనర్ గుత్తికొండ శ్రీనివాసులు, రామనాధం రాజశేఖర్, చింతలపూడి పెంచలయ్య, సోమగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

సామ్రాజ్యవాదుల కోసమే గాజాపై దాడులు

● రైతుకూలీ సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి సునీత



పాలస్తీనా ముఖచిత్రం పుస్తకాన్ని అవిష్కరిస్తున్న నాయకులు

నెల్లూరు (వైద్యం), మే 22 (ఆంధ్రజ్యోతి) : సామ్రాజ్యవాదుల ప్రయోజనాల కోసమే గాజాపై ఇజ్రాయిల్ దాడులు చేస్తోందని రైతుకూలీ సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి సునీత విమర్శించారు. గురువారం నగరంలోని సండేమార్కెట్ సమావేశ మందిరంలో పాలస్తీనా ముఖ చిత్రం పుస్తకావిష్కరణ జరిగింది. ఆమె మాట్లాడుతూ దేశాల మధ్య యుద్ధాలకు, దాడులకు కారణం అమెరికానే అన్నారు. ప్రజాసైన్స్ వేదిక రాష్ట్ర నాయకుడు జీ మాల్యాద్రి మాట్లాడుతూ పాలస్తీనాలో మానవ హననానికి పాల్పడుతున్న ఇజ్రాయిల్‌కు అమెరికా అండగా ఉందని, ఈ నేపథ్యంలో పాలస్తీనా ప్రజల కు మనం సంఘీభావం తెలపాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏపీటీఎఫ్ నాయకుడు ఖాదర్‌బాషా, ఏఐఎఫ్‌టీయూ నాయకుడు లక్ష్మీరెడ్డి, సండేమార్కెట్ యూనియన్ అధ్యక్షుడు హఫీజుద్దీన్, రైతుకూలీ సంఘం జిల్లా అధ్యక్షుడు సుబ్బరాయుడు, జిల్లా సహాయ కార్యదర్శి రమణయ్య, స్త్రీ విముక్తి సంఘటన కార్యదర్శి కొండమ్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు అసౌకర్యం కలుగకుండా

ట్రాఫిక్‌ను నియంత్రించాలి : ఎస్పీ



ట్రాఫిక్ స్టేషన్‌లో సిబ్బందితో మాట్లాడుతున్న ఎస్పీ

నెల్లూరు(క్రైం), మే 22 (ఆంధ్రజ్యోతి) : ప్రజల అత్యవసర కార్యకలాపాలు సాఫీగా సాగాలంటే ట్రాఫిక్ పోలీసుల పాత్ర కీలకమైనదని, ప్రజలకు అసౌకర్యం లేకుండా ట్రాఫిక్‌ను నియంత్రించాల్సిన బాధ్యత ట్రాఫిక్ పోలీసులపై ఉంటుందని ఎస్పీ జీ కృష్ణకాంత్ సూచించారు. నగరంలోని నార్త్, సౌత్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్లు, నవాబుపేట పోలీసు స్టేషన్‌ను ఎస్పీ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ట్రాఫిక్ పాయింట్స్, హిట్ అండ్ రన్ కేసులు, ప్రమాదాలు జరిగే ప్రాంతాలు, నివారణ చర్యలు, యూ టర్న్ పాయింట్స్, పార్కింగ్ ప్రాంతాలు, బారికేడింగ్, వన్‌వే, ఆటోల కదలికలు... ఇలా పలు అంశాలపై అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులకు కనీస సౌకర్యాలు కల్పించాలని, స్టేషన్ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ద్విచక్ర వాహనాలు రాంగ్ రూట్‌లో వెళ్లడం, అనధికార పార్కింగ్‌లను సహించవద్దని, ఉల్లంఘించిన వారికి జరిమానా విధించాలని ఆదేశించారు. డ్రంక్ అండ్ డ్రైవ్‌పై స్పెషల్ డ్రైవ్ నిర్వహించడంతోపాటు ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు.

● నవాబుపేట పోలీసు స్టేషన్ పరిసరాలను, స్టేషన్ మ్యాప్, చార్ట్, జనరల్ డైరీని ఎస్పీ పరిశీలించారు. రౌడీషీటర్‌లు, సస్పెక్ట్‌లు, పాత నేరస్తులపై నిఘా పెంచాలని ఆదేశించారు. విజిబుల్ పోలీసింగ్, పెట్రోలింగ్ వ్యవస్థను ముమ్మరం చేయాలని, వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేయాలని సూచించారు. కేసులను వేగవంతంగా పరిష్కరించడానికి పలు సూచనలు చేశారు. స్టేషన్‌లో శిథిలావస్థలో ఉన్న వాహనాలను కోర్టు అనుమతితో వేలం వేయాలని, పీజీఆర్ఎస్ ఫిర్యాదులను ఆలస్యం లేకుండా పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజలతో మమేకమవుతూ నేరాలు, చట్టాలు, శిక్షలపై వారికి అవగాహన కల్పించాలని సూచించారు.

అభివృద్ధి పనుల్లో ప్రజలు భాగస్వాములు కావాలి

● రూరల్ ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి ● రూ.41లక్షలతో కల్లూరుపల్లిలో రోడ్డు పనులు

నెల్లూరు రూరల్, మే 22 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు రూరల్‌లో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాల్లో స్థానిక ప్రజలందరు ప్రత్యక్షంగా, పరోక్షంగా భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే శ్రీధర్ రెడ్డి పిలుపునిచ్చారు. 24వ డివిజన్ కల్లూరుపల్లి అరుంధతీవాడలో రూ.41 లక్షలతో నిర్మించ తలపెట్టిన సీసీరోడ్లకు గురువారం ఆయన శంకుస్థాపన చేశారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక 11 నెలల్లో ఈ ఒక్క డివిజన్‌లోనే ఇప్పటి వరకు రూ.5.60 కోట్లు అభివృ ద్ధి పనులకు ఖర్చు చేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేత కోటం రెడ్డి గిరిధర్‌రెడ్డి, కార్పొరేటర్ శాంతి, నాయకులు అరవ శీను, రాఘవేంద్ర, జెన్ని రమణయ్య, గంగాధర్, తదితరు లు పాల్గొన్నారు.

పలువురు టీడీపీలో చేరిక

నగరంలో 18వ డివిజన్‌కు చెందిన పలువురు వైసీపీ నాయకులు గురువా రం టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. రూ రల్ ఎమ్మెల్యే కార్యాలయంలో నిర్వహించిన ఓ కార్యక్రమంలో టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి సమక్షంలో ఆమలూరు సాయి కృష్ణ, ఖాద ర్‌బాషా, రావుల దినేష్‌గౌడ్, శివకుమార్ ఆచా రి, నరసింహ రెడ్డిల మిత్రబృందం టీడీపీలో చేరింది. కాగా, 35వ డివిజన్‌లో స్థానిక టీడీపీ నాయకుడు బర్నాబస్ ఆధ్వర్యంలో నిర్వహించి న పార్టీ ఆత్మీయ సమావేశంలో గిరిధర్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రతిభ పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

నెల్లూరు (సాంస్కృతికం), మే 22 (ఆంధ్రజ్యోతి) : నాయీబ్రాహ్మణ విద్యార్థుల నుంచి ప్రతిభా పురస్కారాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా నాయీ బ్రాహ్మణ ఎంప్లాయీస్ సొసైటీ ప్రధాన కార్యదర్శి వినుకొండ వెంకటేశ్వర్లు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 10వ తరగతి, ఇంటర్‌లో ఉత్తమ ఫలితాలు సాధించిన వారు పురస్కారాల కోసం జూన్ 22లోగా దరఖాస్తులు సమర్పించాలని కోరారు.

పన్ను సవరణ సర్వే సమగ్రంగా జరగాలి

● నగర కమిషనర్ నందన్

నెల్లూరు(సిటీ), మే 22,(ఆంధ్రజ్యోతి) : నగరంలోని ప్రతీ ఇంటిని పరిశీలించి పన్ను సవరణ సర్వేను సమగ్రంగా చేపట్టాలని కార్పొరేషన్ కమిషనర్ నందన్ సచివాలయ ఉద్యోగులను ఆదేశించారు. గురువారం 22వ డివిజన్ లో పర్యటించిన ఆయన అక్కడ నిర్మాణంలో ఉన్న భవనాలను పరిశీలించారు. కేఎస్ఆర్ పాఠశాల వద్ద భవనాలకు కొలతలేసి ఆస్తి పన్నును లెక్కకట్టారు. అనంతరం అదే ప్రాంతంలో ఉన్న చిన్న పిల్లల ఆసుపత్రిని పరిశీలించారు. కమర్షియల్ అనుమతులు కాకుండా రెసిడెన్షియల్ అనుమతులతో ఆసుపత్రి నిర్వహిస్తున్నట్లు గుర్తించారు. ఆ భవనానికి అసెస్‌మెంట్ జారీ చేసిన స్థానిక ఆర్ఐ, అడ్మిన్, ఇతర సిబ్బందికి షోకాజు నోటీసులు జారీ చేశారు. కాలువల్లో పూడిక తీయాలని సిబ్బందిని ఆదేశించారు. అడ్మిన్లతోపాటు ఇతర కార్యదర్శులు ప్రతీరోజు సవరణ పన్నుపై సర్వే నిర్వహించాలని సూచించారు. అనంతరం సెట్ కాన్ఫరెన్స్‌లపై సమీక్ష నిర్వహించారు.

జనసైనికులకు భరోసాయే ధ్యేయం

● నగర అధ్యక్షుడు సుజయ్



క్రియాశీలక సభ్యత్వ కిట్లు పంపిణీ చేస్తున్న సుజయ్‌బాబు

నెల్లూరు(క్రైం), మే 22 (ఆంధ్రజ్యోతి) : జనసైనికులకు, వీర మహిళలకు భరోసా కల్పించడమే జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్ ధ్యేయమని ఆ పార్టీ నగర అధ్యక్షుడు దుగ్గిశెట్టి సుజయ్ బాబు అన్నారు. పార్టీ క్రియాశీలక సభ్యత్వం తీసుకున్న వారికి నగరంలోని మాగుంట లేవుట్‌లో ఉన్న జనసేన పార్టీ నగర కార్యాలయంలో గురువారం కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రియాశీలక సభ్యత్వంతోపాటు ప్రమాద, జీవిత బీమాను పొందుతారని చెప్పారు. ఈ నాయకులు కోలా విజయలక్ష్మి, నాగరత్నం, షేక్ ఆలియా, అజయ్‌బాబు, షేక్ కంతర్, సుమంత్, బాలు, తదితరులు పాల్గొన్నారు.

ఎండీయూ విధానం రద్దు హర్షణీయం

● పట్టాభికి రేషన్ డీలర్ల కృతజ్ఞతలు

నెల్లూరు (హరనాథపురం), మే 22 (ఆంధ్రజ్యోతి) : గత ప్రభుత్వంలో ప్రవేశపెట్టిన ఎండీయూ విధానాన్ని రద్దు చేసి పాత విధానాన్ని కొనసాగించడం హర్షణీయమని రేషన్ డీలర్ల సంఘం నాయకులు పేర్కొన్నారు. గురువారం రాష్ట్ర పౌరసరఫరాల శాఖ డైరెక్టర్ వేమిరెడ్డి పట్టాభిరామిరెడ్డిని ఆయన నివాసంలో కలిసి సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. గత ప్రభుత్వ విధానంతో తాము ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నామని, కూటమి ప్రభుత్వం ఆ విధానాన్ని రద్దు చేసి మేలు చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో రేషన్ డీలర్స్ అసోసియేషన్ నాయకులు పలువురు పాల్గొన్నారు.

పత్రికా ప్రకటన

ఇందుమూలముగా యావన్మందికి తెలియజేయడమేమనగా, జిల్లా ఆడిట్ అధికారి, స్టేట్ ఆడిట్, నెల్లూరు వారి కార్యాలయంలో సహాయ ఆడిట్ అధికారిగా పనిచేయుచున్న శ్రీమతి యం. శ్రీనమ్మ గారి సేవా పుస్తకం కనిపించనందున ఎవరి వద్దనైన లేదా కార్యాలయంలో ఉన్నచో జిల్లా ఆడిట్ అధికారి, స్టేట్ ఆడిట్, రంగనాయకులపేట, నెల్లూరు వారి కార్యాలయమునకు గాని లేదా 9441214241/ 9494638187 నంబర్లకు ఫోన్ ద్వారా గాని సమాచారం ఇవ్వవలసినదిగా కోరడమైనది.

పబ్లిక్ నోటీస్

మహారాజశ్రీ విశాఖపట్టణం అదనపు కుటుంబ న్యాయస్థానం

F.C.O.P.No. 1043/2024

Between:

లెక్కల విజయలక్ష్మి ...పిటిషనర్

And

రేబాల అఖిలాష్ ...రెస్పాండెంట్

పై నెంబరు గల పైన తెలిపిన న్యాయస్థానంలో విడాకుల నిమిత్తం (Section 13 (1-a)(1-b)) దావా దాఖలు చేసియున్నారు. సదరు దావా తేదిలు: 15-07-2024, 29-08-2024, 27-09-2024, 28-10-2024, 20-11-2024, 18-12-2024, 24-01-2025, 05-03-2025, 07-04-25, 07-05-2025, 09-05-2025లలో వాయిదాలలో హాజరు కానందున ఆఖరు వాయిదా 16-06-2025 న 10.30 ని.లకు వాయిదా ఉన్నది. సదరు దావాకు మీరు కాని, మీ తరుపున లాయర్/ న్యాయవాది ద్వారా గాని వచ్చి తగు చర్యలు తీసుకొనవలెను. లేని ఎడల మీకు పరోక్షంగా తీర్మానం చేయబడునని కోర్టు వారు తెలిపియున్నారు. ఈ ప్రకటన ద్వారా తెలియ జేయబడినది.

రెస్పాండెంట్ అడ్రస్ : రేబాల అఖిలాష్, S/o. రేబాల రవీంద్ర, D.No.7-1-246, ఎడ్ హౌస్ పేట, స్టోన్ హౌస్ పేట, నెల్లూరు - 524002, ఆంధ్రప్రదేశ్.

K.V. SREERAMA MURTHY
Advocate, D.No.5-16-56, Reddy Tunglam, Gajuwaka Mandal, Visakhapatnam - 530012, Cell. 85208 45724, 94400 33502

డాక్యుమెంట్లు పోయినవి

నా క్లయింట్ అయిన **గుల్ల ఫాల్, తండ్రి బిక్షాలు,** కాకుటూరు గ్రామం, వెంకటాచలం మండలం, నెల్లూరు. **ఫోన్ నెం. 9515771871** అను అతను, అతని కుమారుడైన **గుల్ల నాగార్జున రావు**కు చెందిన నెల్లూరు రిజిస్ట్రారు ఆఫీసులో **తేది:10-08-1988**న రిజిష్టర్డు కాబడిన ఒరిజినల్ డాక్యుమెంట్లు 1) 5075/1988 2) 5076/1988ను **తేది:19-05-2025**న ఆత్మకూరు బస్టాండు నుండి నవాబుపేటకు పోతూ ఉండగా ఆటోలు పోయినవి. పై ఒరిజినల్ డాక్యుమెంట్లు ఎవ్వరికైనా దొరికిన యెడల పై తెలిపిన నా క్లయింట్‌కు చేర్చి పారితోషికము పొందగలరు.

రామిరెడ్డి రోజారెడ్డి
న్యాయవాది, నెల్లూరు. సెల్: 9440847450

బహిరంగ ప్రకటన

ఇందుమూలముగా నా క్లయింట్ M/s. Shriram Finance Ltd., Nellore-2 బ్రాంచి మేనేజర్ వారు ఇచ్చిన లోగొట్టా ప్రకారం యావన్మందికి తెలుపునది [illegible]

SCHEDULE

[illegible]

Perepi Venugopal, B.Com., B.L., Advocate, Tekkemitta, Nellore, Cell: 8374259528

ప్రకటన

నా క్లయింట్ అయిన పోమినేని ప్రసాద్ తండ్రి పెంచలనాయుడు, [illegible]

M.Mushtaq Ahmed, M.B.A., B.L., Advocate, D.No.23-1-957, Mulapet, Nellore-524003, Cell: 9441443110

ప్రకటన

[illegible]

Dasu Gurukumar, B.A., B.L., Advocate, 15-619-2, James Garden, Nellore-524002, Cell: 9849285887

బహిరంగ ప్రకటన

ఇందుమూలముగా నా క్లయింట్ M/s. Shriram Finance Ltd., Venkatagiri బ్రాంచి మేనేజర్ వారు ఇచ్చిన లోగొట్టా ప్రకారం యావన్మందికి తెలుపునది [illegible]

SCHEDULE

[illegible]

Tayi Vijayakumar, B.Com., B.L., Advocate, Teachers Colony, Venkatagiri. Cell 9440507929

ఆకట్టుకున్న హనుమాన్ శోభాయాత్ర



బుచ్చిలో నిర్వహించిన హనుమాన్ శోభాయాత్ర

హనుమజ్జయంతి సందర్భంగా గురువారం బుచ్చిలో నిర్వహించిన హనుమాన్ శోభాయాత్ర ఆకట్టుకుంది. వేలాదిమంది జైశ్రీరామ్.. జైజై శ్రీరామ్.. జై హనుమాన్.. జై బజరంగబళి...అంటూ నినాదాలు చేస్తుండగా యాత్ర సాగింది. ముందుగా ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి జెండా ఊపి శోభాయాత్రను ప్రారంభించారు. స్థానిక డీఎల్ఎస్ఆర్ హైస్కూలు ప్రాంగణం నుంచి మొదలయిన యాత్ర బస్టాండ్ సెంటర్ మీదుగా గాంధీబొమ్మ సెంటర్ వరకు సాగింది. ర్యాలీకి ముందు శ్రీరాముడు, ఆంజనేయుడితోపాటు వివిధ వేషధారణలు, గుర్రాలు, బైకులు కొనసాగాయి. ఈ కార్యక్రమంలో చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ, కమిషనర్ బాలకృష్ణ, పలువురు కౌన్సిలర్లు, తహసీల్దార్ వెంకటేశ్వర్లు, ఎంపీడీవో శ్రీహరి, మండల పార్టీ నాయకులు గుత్తా శ్రీనివాసులు, బెజవాడ జగదీష్, తదితరులు పాల్గొన్నారు.

-బుచ్చిరెడ్డిపాళెం, (ఆంధ్రజ్యోతి

సైనిక్ స్కూల్ ఫలితాల్లో 'విశ్వం' ప్రభంజనం

● రాష్ట్ర స్థాయిలో ప్రథమ ర్యాంకు సాధించిన మోక్షిత్

తిరుపతి(విద్య), మే 22(ఆంధ్రజ్యోతి): ఆలిండియా సైనిక్ స్కూల్ ఎంట్రన్స్ టెస్ట్ - 2025లో రాష్ట్ర స్థాయిలో ప్రథమ ర్యాంకుతోపాటు విశ్వం విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించి ప్రభంజనం సృష్టించారని విద్యాసంస్థల అధినేత, కోచింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ ఎన్.విశ్వనాథరెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన మేరకు... 6, 9 తరగతుల ప్రవేశాలకుగాను ఏప్రిల్ 5న జాతీయ స్థాయిలో ప్రవేశ పరీక్ష నిర్వహించగా 9వ తరగతి విభాగంలో వి. మోక్షిత్ మొత్తం 400 మార్కులకుగాను 370 మార్కులు సాధించి రాష్ట్ర స్థాయిలో ప్రథమ ర్యాంకు సాధించాడు. 6వ తరగతి విభాగంలో 300 మార్కులకుగాను హృతిక్ రాయల్ 281 మార్కులు, వి.నిహార్ 275, సోహిని 270 మార్కులతో అత్యుత్తమ ఫలితాలు సాధించారు. వీరితోపాటు రసజ్ఞ, జీవన్ సాయిరెడ్డి, ఆర్యన్‌రెడ్డి, భువనేష్, లోహిత్, మహీధర్, అశ్విన్ తదితరులు రాష్ట్రస్థాయిలో మంచి ర్యాంకులు సాధించారు. గురువారం తిరుపతి వరదరాజనగర్‌లోని విశ్వం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో వి.మోక్షిత్ తదితర విద్యార్థులను అభినందించారు. విశ్వనాథరెడ్డి మాట్లాడుతూ తమ విద్యార్థులు గణితంలో 150/150, ఇంటెలిజెన్స్ టెస్ట్‌లో 50/50 మార్కులు పొంది రాష్ట్రానికే గర్వకారణంగా నిలిచారని వెల్లడించారు. పిల్లల



మోక్షిత్‌ను అభినందిస్తున్న విశ్వనాథరెడ్డి, విశ్వచందన్‌రెడ్డి

భవిష్యత్తుకు బంగారు బాటలువేస్తూ అత్యుత్తమ శిక్షణ ఇస్తున్న అధ్యాపక బృందానికి, ఉన్నత విజయాలు సాధించిన విద్యార్థినీ విద్యార్థులకు, తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో విశ్వం విద్యా సంస్థల కరస్పాండెంట్ తులసి విశ్వనాథరెడ్డి, అకడమిక్ డైరెక్టర్ ఎన్.విశ్వచందన్‌రెడ్డి పాల్గొని విద్యార్థులను అభినందించారు. సమాచారం కావాల్సిన వారు 8688888802/9399976999లలో సంప్రదించాలని సూచించారు.



ఆలయ ఈవోకి నగదును అందచేస్తున్న రాజు ప్రభాకర్‌రెడ్డి దంపతులు

నిత్యాన్నదానానికి విరాళం

రాపూరు, మే 22 (ఆంధ్రజ్యోతి): పెంచలకోన శ్రీవారి శాశ్వత నిత్యాన్నదాన పథకానికి కడప జిల్లా మాధవరం గ్రామస్థులు రాజు ప్రభాకర్ రెడ్డి, రెడ్డెమ్మ దంపతులు రూ. 2,05,121 ఆలయ ఈవో పోరెడ్డి శ్రీనివాసులురెడ్డికి అందచేశారు. వీరికి ఆలయ అధికారులు వేద పండితులతో వేదాశీర్వచనం చేసి, ప్రత్యేక పూజలు నిర్వహించి, స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందచేశారు.

ఉపాధ్యాయ బదిలీల

ప్రక్రియ ప్రారంభం

● 8, 5 ఏళ్ల సర్వీసు పూర్తిచేసిన వారికి తప్పనిసరి ● జిల్లాలో 3వేల మందికిపైగా స్థానచలనం

నెల్లూరు(విద్య), మే 22 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఉపాధ్యాయ బదిలీలు, ఉద్యోగోన్నతుల ప్రక్రియ ప్రారంభమైంది. 8 ఏళ్లు, 5 ఏళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న వారికి తప్పనిసరి బదిలీలు జరగనున్నాయి. ఒకే పాఠశాలలో రెండేళ్లు పూర్తి చేసుకున్న వారూ బదిలీకి దరఖాస్తు చేసుకోవచ్చు. ప్రధానోపాధ్యాయులు, స్కూల్ అసిస్టెంట్ బదిలీలు, ఉద్యోగోన్నతులు వెబ్ కౌన్సెలింగ్ ద్వారా జరగనుండగా ఎస్జీటీలకు మాన్యువల్ కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ మేనేజ్‌మెంట్‌లో 278 మంది, జడ్పీ మేనేజ్‌మెంట్‌లో 9,483 మంది, మునిసిపల్ విభాగంలో 183 మంది, నగరపాలక సంస్థలో 411 మంది కలిపి మొత్తం 10,355 మంది ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు. వీరిలో ఐదేళ్లు పూర్తి చేసిన హెచ్‌ఎంలో 45 మంది, 8 ఏళ్లు పూర్తి చేసుకున్న స్కూల్ అసిస్టెంట్‌లు 774 మంది, సెకండరీ గ్రేడ్ టీచర్లు 572 మంది ఉన్నారు. మొత్తం 2,821 మందికి తప్పనిసరి బదిలీలు జరగనుండగా వీరితో పాటు రెండేళ్ల సర్వీస్ పూర్తి చేసుకున్న వారితో కలిపి 3వేల మందికి పైగా స్థానచలనం కలగనుంది. ఉద్యోగ విరమణకు సమీపంలో ఉన్న ఉపాధ్యాయులకు మాత్రం మినహాయింపు ఇచ్చారు.



తొలుత ప్రధానోపాధ్యాయులకు..

తొలుత గ్రేడ్-2 ప్రధానోపాధ్యాయులు దరఖాస్తు ప్రక్రియ పూర్తికాగా ఈ నెల 24వతేదీన సీనియారిటీ జాబితాను ప్రకటిస్తారు. 25న జాబితాలపై అభ్యంతరాలు స్వీకరించి 26న పరిష్కరిస్తారు. 27న దరఖాస్తు చేసిన హెచ్‌ఎంల తుది సీనియారిటీ జాబితాను విడుదల చేసి 28వతేదీన ఆన్‌లైన్‌లో తాము కోరుకునే స్థానాలకు ప్రాధాన్యత క్రమంలో వెబ్ ఆప్షన్‌లు ఎంచుకుంటారు. 30న బదిలీ ఉత్తర్వులు అందచేస్తారు. అదే రోజున స్కూల్ అసిస్టెంట్లకు హెచ్‌ఎంలుగా ఉద్యోగోన్నతులు కల్పిస్తారు. వీరికి 31వ తేదీన నియామక ఉత్తర్వులు అందచేస్తారు.

ప్రాధాన్యత కేటగిరీలో..

వందశాతం దృష్టిలోపం ఉన్నవారికి, 80శాతంకు పైగా శారీరక వైకల్యం ఉన్నవారికి తొలి ప్రాధాన్యత ఇవ్వనున్నారు. అలాగే 75శాతం దృష్టిలోపం, 70-79 శాతం శారీరక వైకల్యం, 70శాతానికి పైగా వినికిడి లోపం ఉన్నవారికి రెండో ప్రాధాన్యత ఇస్తారు. పునర్వివాహం చేసుకోని వితంతువులు, క్యాన్సర్, ఓపెన్ హార్ట్ సర్జరీ, బోనోటీసీ, కిడ్నీ మార్పిడి, డయాలసిస్, సైనల్ సర్జరీ చేసుకున్నవారికి, జీవిత భాగస్వామి, పిల్లలు జునైనల్, డయాబెటిస్, తలసేమియా, హీమోఫిలియా, కండరాల క్షీణతతో బాధపడుతన్న వారికి వైద్య చికిత్స పొందుతున్న వారికి తరువాత ప్రాధాన్యతలు కింద బదిలీలు జరగనున్నాయి.

1289 మంది ఎస్‌ఏలకు తప్పనిసరి

జిల్లాలో స్కూల్ అసిస్టెంట్‌లు 1289 మంది 8 ఏళ్ల సర్వీస్ పూర్తి చేసుకోవడంతో వీరు తప్పనిసరి బదిలీ కానున్నారు. ఎస్‌ఏలకు సంబంధించి ఇప్పటికే దరఖాస్తు ప్రక్రియ ప్రారంభం కాగా ఈనెల 24వరకు దరఖాస్తులు చేసుకోవాలి. 26, 27వతేదీల్లో ప్రాథమిక సీనియారిటీ జాబితాను సబ్జెక్ట్‌ల వారీగా విడుదల చేస్తారు. 28న జాబితాలపై అభ్యంతరాలను స్వీకరించి 29వతేదీ వరకు పరిశీలించి పరిష్కరిస్తారు. 31న సీనియారిటీ తుది జాబితాను సబ్జెక్ట్‌ల వారీగా ప్రకటిస్తారు. జూన్ 1, 2 తేదీల్లో బదిలీల్లో ప్రాధాన్యత క్రమంలో వెబ్ ఆప్షన్స్ ఇవ్వాల్సి ఉంటుంది. అనంతరం 4వతేదీన బదిలీ ఉత్తర్వులు అందచేస్తారు. 5న అర్హులైన ఎస్జీటీలకు ఎస్‌ఏలకు ఉద్యోగోన్నతులు కల్పిస్తారు. 6న నియామక ఉత్తర్వులు అందచేస్తారు.

1487 మంది ఎస్జీటీలు తప్పనిసరి

జిల్లాలో 8 ఏళ్ల సర్వీస్ పూర్తి చేసుకున్న 1487 మంది ఎస్జీటీలు తప్పనిసరి బదిలీ కానున్నారు. వీరు ఈ నెల 28వతేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలి. ఈ దరఖాస్తులను 28వతేదీ వరకు పరిశీలిస్తారు. 31వతేదీన ప్రాథమిక సీనియారిటీ జాబితాను విడుదల చేస్తారు. వీటిపై జూన్ 1వతేదీ సాయంత్రం వరకు అభ్యంతరాలను స్వీకరించి 2వతేదీ వరకు పరిశీలన చేస్తారు. అనంతరం జూన్ 6న తుది సీనియారిటీ జాబితాను విడుదల చేసి 7 నుంచి 10వతేదీ వరకు ఎస్జీటీలు కోరుకున్న స్థానాలకు వెబ్ ఆప్షన్‌లకు ప్రాధాన్యత క్రమంలో ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలి. జూన్ 11న బదిలీ ఉత్తర్వులు విడుదల చేస్తారు. బదిలీలు, ఉద్యోగోన్నతలకు సంబంధించి పాయింట్లు, ప్రాధాన్యత కేటగిరీలను కూడా విడుదల చేశారు.

చిన్నారులకు ఎంఆర్ వాక్సిన్ వేయాలి

● మూడు విడతలుగా అమలు చేయండి

● టాస్క్‌ఫోర్స్ అధికారులతో కలెక్టర్ ఆనంద్

నెల్లూరు (వైద్యం), మే 22 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని ఐదేళ్లలోపు చిన్నారులందరికి ఎంఆర్(మీజిల్స్, రూబెల్లా) వ్యాక్సిన్‌ను తప్పనిసరిగా వేయాలని కలెక్టర్ ఆనంద్ ఆదేశించారు. గురువారం కలెక్టర్ చాంబర్‌లో ఎంఆర్ వాక్సినేషన్‌పై జిల్లా టాస్క్‌ఫోర్స్ కమిటీ సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ తట్టు, పొంగు వ్యాధుల నివారణకు టీకాలు వేసుకోని చిన్నారులను గుర్తించి ప్రతి ఒక్కరికీ వ్యాక్సిన్ వేయాలని సూచించారు. తట్టు, పొంగు వ్యాధులు నమోదైన ప్రాంతాల్లో ముమ్మరంగా సర్వేచేసి నివారణ చర్యలు చేపట్టాలని, ప్రజలకు అవగాహన కల్పించాలని దిశానిర్దేశం చేశారు. జిల్లాలో మూడు విడతల్లో ఎంఆర్ వాక్సిన్ పంపిణీ కార్యక్రమం నిర్వహించాలని సూచించారు. ఈ నెల 26 నుంచి 31వ తేదీ వరకు మొదటి విడత వాక్సిన్ వేయాలన్నారు. జూన్ 23 నుంచి 28వ తేదీ వరకు రెండవ విడత, జూలై 21 నుంచి 26వ తేదీ వరకు మూడవ విడత ఎంఆర్ వాక్సిన్ పంపి ణీని అమలు చేయాలన్నారు. పట్టణ ప్రాంతాలు, మురికివాడలు, ఇటుక బట్టీలు, భవన నిర్మాణ కార్మికుల నివాస ప్రాంతాలు, మత్స్యకార గ్రామాలను లక్ష్యంగా చేసుకుని చిన్నారుల వ్యాక్సినేషన్ కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో డీఎంహెచ్‌వో డాక్టర్ సుజాత, డీఐవో డాక్టర్ ఉమామహేశ్వరి, ఐసీడీఎస్ పీడీ సువర్ణ, డీసీహెచ్‌ఎస్ పరిమళ, మెప్మా పీడీ లీలారాణి, ఐటీడీఏ పీవో మల్లికార్జున, మలేరియా నివారణ అధికారి హుస్సేనమ్మ, డాక్టర్ మౌనిక తదితరులు పాల్గొన్నారు.

'బెల్టు' కావాలంటే

వేలం పాడాల్సిందే !

● నిన్న అయ్యవారిపల్లె ... మొన్న అంకభూపాలపురం

● రేపు ఏ గ్రామమో మరి...!


● పల్లెల్లో విచ్చలవిడిగా మద్యం బెల్టు షాపులు

● సీఎం చంద్రబాబు హెచ్చరికలు బేఖాతర్

● చోద్యం చూస్తున్న ఎక్సైజ్ అధికారులు

వలేటివారిపాలెం, మే 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అయ్యవారిపల్లెలో మద్యం బెల్టుషాపు నిర్వహణకు గ్రామస్థులు బుధవారం బహిరంగ వేలం పెట్టారు. గ్రామానికి చెందిన వీరయ్య అనే వ్యక్తి రూ.10 లక్షలకు వేలం పాడారు. ముందురోజు గ్రామంలో దండోరా వేసి వేలం పెట్టారు. ఈ వేలంలో 10 మంది పాటదారులు డిపాజిట్లు చెల్లించి పాల్గొన్నారు. ఐదారుగురు పాటదారులు తగ్గేదెలా అన్నట్లుగా పోటాపోటీగా పాట పాడారు. చివరికి వీరయ్య రూ.10 లక్షలకు పాట దక్కించుకున్నాడు. రెండునెలల క్రితం అంకభూపాలపురంలో కూడా బెల్టుషాపు వేలం పెట్టగా రూ .1.50 లక్షలకు సత్యనారాయణ అనే వ్యక్తి దక్కించుకున్నాడు. మొన్న అంకభూపాలపురం, నిన్న అయ్యవారిపల్లె, రేపు ఏ గ్రామమోమరి... అంటూ ప్రజలు చర్చించుకుంటున్నారు.

● పరిస్థితి ఇలా ఉంటే...



పరిస్థితి ఇలాగే ఉంటే గ్రామ గ్రామాన బెల్టుషాపు లకు వేలం నిర్వ హించే అవ కాశాలు ఉన్నాయని ప్రజలంటున్నారు. గ్రామపెద్దల సమ క్షంలో వేలం దక్కించుకున్న వ్యక్తి తప్ప ఇంక ఎవరూ బెల్టుషాపు నిర్వ హించకూడదని నిర్ణయించారు. ఎక్సైజ్, ఎన్‌ఫోర్స్ మెంట్ అధికారులకు తెలిసీ కూడా ఎందుకు చర్యలు తీసుకోవడంలేదని ప్రజలు మండిపడుతున్నారు. ప్రభుత్వం మారినా ఎక్సైజ్ అధికారుల తీరు మాత్రం మార లేదు. 'బెల్టుషాపులు పెడితే తాట తీస్తా.... ఫైన్ కాదు ఏకంగా మూసి వేయడమే'.. అంటూ సీఎం చంద్రబాబు చేస్తున్న హెచ్చరికలను ఎక్సైజ్ అధికారులు బేఖాతరు చేస్తున్నారు. అధికారుల నిఘా కొరవడడంతో వేలం పాటలు జరుగుతున్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటి కైనా వారు స్పందించి బెల్టుషాపులు వేలంపై నిఘా పెట్టాలని ప్రజలు కోరుతున్నారు.

విచారించి చర్యలు తీసుకుంటా

అయ్యవారిపల్లెలో బెల్టుషాపు కోసం వేలం పెట్టిన సంగతి మా దృష్టికి రాలేదు. విచారించి చర్యలు తీసుకుంటా. వీటిపై ఇక నిఘా పెడతాం.

- వెంకట్రావు, ఎక్సైజ్ సీఐ

గజిట్ నోటిఫికేషన్ ఇచ్చేదెప్పుడు!?

రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి అధికారంలోకి వచ్చాక ఐదు నెలల క్రితం సాగునీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించారు. నీటి పారుదలశాఖ, రెవెన్యూ అధికారుల ఆధ్వర్యంలో ఈ ఎన్నికలను అట్టహాసంగా నిర్వహించారు. విజేతలకు అక్కడికక్కడే ధ్రువీకరణ పత్రాలు అందచేశారు. అయితే, ఇప్పటికి ఐదు నెలలు దాటినా గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేయలేదు. ఈ గెజిట్ విడుదల చేస్తేనే ఎంపికైనవారికి పూర్తి అధికారాలు లభిస్తాయి.

- సంగం (ఆంధ్రజ్యోతి)

జిల్లాలో 765 సాగునీటి సంఘాలు ఉండగా, 2024, డిసెంబరు 14న ఎన్నికలు జరిగాయి. కొన్నింటికి పోటీలు జరగ్గా, మరికొన్నింటికి ఏకగ్రీవం అయ్యాయి. గెలుపొందిన వారికి ఎన్నికలు నిర్వహించిన అధికారులు ఫామ్ -10 కాపీలను అందించారు. ఎన్నికలు జరిగిన 15 నుంచి 30 రోజుల్లోపు గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేయాల్సి ఉంది. కానీ ఐదు నెలలు దాటినా ఆ దిశగా చర్యలు తీసుకోకపోవడంతో సాగునీటి సంఘాలకు ఎన్నికైన వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గెజిట్ నోటిఫికేషన్‌లో ఎంపికైన అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, సభ్యుల పేర్లతో కూడిన జాబితా ఉంటుంది. సంఘం పదవీకాలం ఎంత వరకు తదితర వివరాలూ ఉంటాయి. ఈ గెజిట్ నోటిఫికేషన్ వస్తేనే సాగునీటి సంఘాలకు పూర్తి అధికారం వచ్చినట్లవుతుంది.



సాగునీటి సంఘం ఎన్నికల్లో గెలుపొందిన వారికి ధ్రువ పత్రం ఇస్తున్న అధికారులు (ఫైల్)

● సంఘాల బాధ్యతలు..

చెరువులకు, డిస్ట్రిబ్యూషన్ కాలువలకు అత్యవసర పనులు చేపట్టడం. గండ్లు పడినా, కాలువలు దెబ్బతిన్నా ఇరిగేషన్ అధికారుల దృష్టికి తీసుకెళ్లి వాటి మరమ్మతులు చేపట్టడం, ఆయకట్టు పరిధిలోని రైతులకు వంతులవారీగా నీటిని సరఫరా చేయ డం, నీటి తీరువా పన్ను వసూలు చేయించి ప్రభుత్వానికి కట్టడం, చెరువుల్లో చేపలు వేలం వేయించి వచ్చే ఆదాయాన్ని ప్రభుత్వ పద్దుల్లో జమ చేయించడం వంటి పనులు సంఘాల పాలకవర్గం చేయాల్సి ఉంటుంది.

ఆంధ్రజ్యోతి క్లాసిఫైడ్స్

FLAT FOR SALE

పెద్ద చెరుకూరు (అల్లీపురం) సిరిగార్డెన్‌లోని గణేష్ సాగర్ అపార్ట్‌మెంట్ నందు 2 BHK 1300 Sft Flats అమ్మబడును. మర్రి శీనయ్య, సెల్: 970190 4999, 96184 84822

AJR-212082

సరస్వతి ట్రావెల్స్

నెలలో 2 సార్లు అరుణాచలం యాత్ర, కాశి, శిరిడి, తమిళనాడు, రామేశ్వరం 2 రోజులు యాత్ర కలదు. 2+2, A/C, NoN A/C పంక్షన్‌లకు బస్సులు కలవు. సం.ప్ర. సెల్: 80085 11207, 73828 11207

AJR-212014

నవగ్రహ యాత్ర

నవగ్రహాలు, షుగర్ నివారణ, సంతానం లేని, వివాహం కాని వారికి పూజలకు ఆలయాలు తేది:05-06-25 3రోటి1కి 5499/- (AC బస్సు, భోజనం+రూం) కె.వాసు, సెల్: 94913 40504

AJR-212079

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన/క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీల్లో భాగంగా మహిళలకు ఆగస్టు 15వ తేదీ నుంచి ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించేందుకు అడుగులు వేస్తోంది. అదే జరిగితే ఉచిత ప్రయాణం కావడంతో ఆర్టీసీ బస్సులు మహిళలతో నిండుతాయి. దీంతో సంస్థకు ఓఆర్ భారీగా పెరుగుతుంది. రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా ప్రయాణిస్తున్న మహిళలకు సంబంధించిన నగదును ఆర్టీసీ సంస్థకు చెల్లించడంతో ఆర్టీసీ సంస్థ పూర్వవైభవం పొందేందుకు అవకాశాలు అధికంగా ఉన్నాయి.

'ఉచితం' ఊపిరి పోసేనా?

● ఆర్టీసీకి పూర్వవైభవం వచ్చేనా? ● భారీగా పడిపోయిన ఓఆర్

● వేసవి సెలవుల్లోనూ పెరగని ప్రయాణికుల సంఖ్య

● రైళ్లు, ప్రైవేటు బస్సులు, కార్ల వైపు మొగ్గు

● నెల్లూరు రీజియన్‌లో నిత్యం 1.50లక్షల మంది ప్రయాణం

● వారిలో సగం మహిళలే...!

● ఉచిత ప్రయాణంతో మరింత పెరిగే అవకాశం

● పథకానికి ప్రభుత్వం నిధుల చెల్లింపు

● సంస్థ పునరుజ్జీవానికి ఆశలు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), మే 22 (ఆంధ్రజ్యోతి) : ఒకప్పుడు ప్రయాణం అంటే గుర్తుకు వచ్చే ఎర్ర బస్సే. అయితే రోజులు గడిచే కొద్దీ ఆటోలు, ప్రైవేటు బస్సుల సంఖ్య భారీగా పెరిగిపోవడం, ప్రజలు సొంత వాహనాలు కొనుగోలు చేయడం, రైలు ప్రయాణం మరింత సౌకర్యంగా ఉండటంతో ఆర్టీసీ ఆదాయం తగ్గుతూ వచ్చింది. దీనికితోడు డీజిల్ భారం, ప్రైవేటు ట్రావెల్స్ బస్సుల్లోని సౌకర్యాలు, వేగంతో పోటీ పడలేక ఆర్టీసీ మరింత వెనుకబడింది. మిగతా రోజుల్లో ఎలా ఉన్నా ఏటా దసరా, సంక్రాంతి, వేసవి సెలవుల్లో మాత్రం ఆర్టీసీకి ప్రయాణికుల ఆదరణ బాగానే ఉండేది. కానీ, ఈ ఏడాది వేసవి సెలవల్లో సైతం ఆర్టీసీ నెల్లూరు రీజియన్‌కు 75 శాతం కూడా ఓఆర్ రాకపోవడంతో అధికారులు ఆశ్చర్యపోతున్నారు. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం ఆగస్టు 15 నుంచి మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం అని చేస్తున్న ప్రకటనలు రోడ్డు రవాణా సంస్థకు కొత్త ఊపిరిని అందించనున్నాయి.

ఉచిత ప్రయాణం ఊపిరి పోసేనా

రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల హామీల్లో భాగంగా ఈ ఏడాది ఆగస్టు 15వ తేదీ నుంచి రాష్ట్రంలో మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం అందించేందుకు సిద్ధమవుతోంది. ఈ పథకం ఆర్టీసీకి ఊపిరి పోస్తుందని సంస్థ అధికారులు, కార్మికులు ఆశపడుతున్నారు. ఆర్టీసీ నెల్లూరు రీజియన్‌లోని ఏడు డిపోల పరిధిలో రోజూ లక్ష యాభైవేల మంది ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణిస్తున్నారు. తద్వారా రోజుకు రూ.93 లక్షల రాబడి వస్తోంది. ఈ ప్రయాణికుల్లో సగం మంది మహిళలు ఉంటున్నారు. మహిళలకు ఉచిత ప్రయాణం అందించడంతో రీజియన్‌లో రోజు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే మహిళల సంఖ్య లక్షకుపైగా పెరగవచ్చని అంచనా. ప్రస్తుతం తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల్లో మహిళలకు ఉచితంగా ప్రయాణం అందిస్తున్న ఆయా ప్రభుత్వాలు అందుకు సంబంధించిన నిధులను రోడ్డు రవాణా సంస్థలకు మూడు నెలలకో, వార్షిక బడ్జెట్‌లోనే కేటాయిస్తున్నాయి. ఈ విధానంలోనే మన రాష్ట్ర ప్రభుత్వం ఆర్టీసీకి మహిళల ఉచిత ప్రయాణా నికి సంబధించిన నగదును చెల్లించే అవకాశం ఉంది. దీంతో సంస్థకు సాధారణంగా వచ్చే రాబడితోపాటు, మహిళ ప్రయాణికులు పెరగడంతో ప్రభుత్వం నుంచి వచ్చే నగదును కలుపుకుంటే ఆర్టీసీ సంస్థ లాభాల బాట పడు తుందని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.



బస్సులు పెంచాలి, సిబ్బందినీ పెంచాలి

ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం అంటే బస్సుల సంఖ్యను తప్పనిసరిగా పెంచాల్సి వస్తుందని పలువురు అభిప్రాయ పడుతున్నారు. రీజియన్ వ్యాప్తంగా ఇప్పటికే కూటమి ప్రభుత్వంలో 137 కొత్త బస్సులను ప్రభుత్వం అందించింది. అయితే గత ప్రభుత్వంలో రీజియన్‌కు కొత్త బస్సులు రాకపోవంతో కాలం చెల్లిన బస్సుల సంఖ్య పెరిగి పోయింది. వాటి స్థానంలో కొత్త బస్సులను అధికారులు తిప్పుతున్నారు. ఈ క్రమంలో మహిళలకు ఉచిత ప్రయాణం అమల్లోకి వస్తే రీజియన్‌కు కొత్త బస్సులు మరిన్ని అవసరమ వుతాయి. ఇక ప్రస్తుతం రీజియన్‌లో ఎక్కువగా ఉన్న సింగల్ డ్రైవర్ టిమ్ సర్వీసు లను రద్దు చేయాల్సి ఉంటుంది. పాత విధానంలో బస్సుల్లో డ్రైవర్, కండక్టర్ ఇద్దరు ఉంటేనే బస్సుల్లో మహిళలు ఎంత మంది ఎక్కారు, పురుషులు ఎందరు, రాయితీ పాస్‌లు, ఇలా అన్నీ విభాగాలను క్షుణ్ణంగా పరిశీలించుకునే అవకాశం ఉంటుంది.

వెంగళాపురం ఆలయంలో చోరీ

● అమ్మవారి తాళిబొట్లు, రూ.15 వేల నగదు అపహరణ

లింగసముద్రం, మే 22 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వెంగళాపురంలో ఉన్న శ్రీకోదండ రామాలయంలో దొంగలు పడ్డారు. గురువారం ఆలయం తలుపు తాళాలు పగులగొట్టి ఉండడాన్ని గ్రామస్థులు గమనించి లోపలికి వెళ్లి చూశారు. సీతాదేవి ఉత్సవ విగ్రహానికి, అమ్మవారి మరో విగ్రహానికి ఉన్న రెండు బంగారు తాళిబొట్లను దొంగిలించారు. అలాగే హుండీని గ్రామానికి దూరంగా తీసుకెళ్లి పగులగొట్టి అందులోని నగదును దోచుకెళ్లారు.రెండు తాళిబొట్ల విలువ సుమారు రూ.35 వేలు, హుండీలోని నగదు సుమారు రూ.15 వేలు ఉండవచ్చని గ్రామస్థులు తెలిపారు. బుధవారం అర్ధరాత్రి దొంగలు ఈ చోరీకి పాల్పడి ఉండవచ్చని వారు భావిస్తున్నారు.అయితే ఈ విషయమై పోలీసులకు ఎలాంటి ఫిర్యాదు అందలేదు.

తొమ్మిది మంది పేకాటరాయుళ్ల అరెస్టు

● రూ.29,500 స్వాధీనం

కందుకూరు, మే 22 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని కనిగిరి రహదారి పక్కన ఉన్న హనుమాన్ లాడ్జీపై పట్టణ ఎస్సై సాంబశివయ్య గురువారం తన సిబ్బంతో కలిసి దాడులు నిర్వహించారు. లాడ్జిలో పేకాడుతున్న 9 మందిని అదుపులోకి తీసుకొని, వారి వద్ద నుంచి రూ.29,500 నగదు స్వాధీనం చేసుకున్నారు. పేకాటరాయుళ్లను స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. లాడ్జీలో పేకాట ఆడుతున్నారని తనకు అందిన సమాచారం మేరకు ఈ దాడులు నిర్వహించినట్లు ఆయన చెప్పారు.

సోమశిలలో 45.108 టీఎంసీల నీరు

అనంతసాగరం, మే 22(ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయంలో గురువారం నాటికి 45.108 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఎగువ ప్రాంతాల నుంచి 100 క్యూసెక్కుల ప్రవాహం వస్తుండగా దిగువ డెల్టాకు 3,230, ఉత్తర కాలువకు 200, దక్షిణ కాలువకు 50 క్యూసెక్కుల చొప్పున సరఫరా చేస్తున్నారు.

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ.9226
వెండి కిలో ధర	రూ. 1,00,900
వెండి ఒక గ్రాము	రూ. 103.90

సంక్షేమం, అభివృద్ధి టీడీపీతోనే సాధ్యం

● సీఎం చంద్రబాబు సారథ్యంలో అభివృద్ధి పథంలో రాష్ట్రం ● ఆత్మకూరును అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తాం ● మినీ మహానాడులో మంత్రి ఆనం

ఆత్మకూరు, మే 22 (ఆంధ్రజ్యోతి): సంక్షేమం, అభివృద్ధి తెలుగుదేశం పార్టీ తోనే సాధ్యమని, గత వైసీపీ ప్రభుత్వ పాలనలో అధోగతికెళ్లిన రాష్ట్రాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అభివృద్ధి పథంలో నడుపుతున్నారని రాష్ట్ర మంత్రి, ఆత్మకూరు ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డి అన్నారు. ఆత్మకూరు పట్టణంలోని ఏఎంసీ ప్రాంగణంలో గురువారం మినీ మహానాడు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ పాలనలో నిర్వీర్యంగా మారిన నీటిపారుదల వ్యవస్థను చక్కదిద్ది రైతాంగానికి కూటమి ప్రభుత్వం బాసటగా నిలుస్తోందని, సోమశిల జలాశయం నుంచి ఎప్పుడూలేని విధంగా జిల్లాలో రెండవ పంటకు డెల్టాతో పాటు మెట్టప్రాంత రైతులకు సాగునీటిని విడుదల చేయడం జరిగిందన్నారు. వైసీపీ పాలనలో సోమశిల ప్రాజెక్టు గేట్లకు గ్రీజు కూడా పెట్టలేని దుస్థితి ఏర్పడిందని విమర్శించారు. సీఎం చంద్రబాబు నాయుడు రూ. 118 కోట్ల నిధులు కేటాయించి జలాశయం పురోభివృద్ధి పనులు చేపట్టాలని ఆదేశించడం హర్షదాయకమని తెలిపారు. ఆత్మకూరు నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి చూపుతామన్నారు. ఆత్మకూరు పట్టణంలోని జిల్లా ప్రభుత్వ వైద్యశాలను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయడంతో పాటు సోమశిలలో 30 పడకల ఆసుపత్రికి సీఎం చంద్రబాబునాయుడు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారన్నారు. ఆత్మకూరు నియోజకవర్గ అభివృద్ధికి ఆయన ఎనిమిది తీర్మానాలను మహానాడులో ప్రతిపాదించారు. ముందుగా ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, పలువురు టీడీపీ ముఖ్య నేతలు ప్రసంగించారు.



మినీ మహానాడుకు హాజరైన టీడీపీ శ్రేణులు



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న మంత్రి ఆనం, ఎంపీ వేమిరెడ్డి, పక్కన అబ్దుల్ అజీజ్ తదితరులు

పండుగ వాతావరణంలో..

మంత్రి ఆనం సారథ్యంలో ఆత్మకూరు నియోజకవర్గ మినీ మహానాడు పండుగ వాతావరణంలో జరిగింది. నియోజకవర్గంలోని అన్నిమండలాల నుంచి టీడీపీ నేతలు, శ్రేణులు తరలి వచ్చారు. ముందుగా పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో పార్లమెంట్ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్, నెల్లూరు పార్లమెంట్ అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్, ఎస్డీసీసీ చైర్మన్ మెట్టుకూరు ధనుంజయరెడ్డి, టీడీపీ సీనియర్ నాయకుడు తాళ్లూరి గిరినాయుడు, సోమశిల ప్రాజెక్టు చైర్మన్ కేశవచౌదరి, టీడీపీ పట్టణ అధ్యక్షుడు తుమ్మల చంద్రారెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ జి వెంకటరమణమ్మ, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి దావా పెంచలరావు, రాష్ట్ర మహిళా కార్యదర్శి పులిమి శైలజారెడ్డి, పలువురు టీడీపీ ప్రజాప్రతినిధులు, ముఖ్య నేతలు పాల్గొన్నారు.

వాడవాడలా వైభవంగా హనుమజ్జయంతి



ఆత్మకూరు: ఆంజనేయస్వామి సమేత సువర్చలాదేవి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు



కుల్లూరులో ఆంజనేయస్వామి విగ్రహం వద్ద పూజా కార్యక్రమంలో కలెక్టర్ ఆనంద్, ఎస్పీ కృష్ణకాంత్



ఉదయగిరి అభయాంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే కాకర్ల సురేష్

ఆత్మకూరు, మే 22 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ పరిధిలోని పలు ప్రాంతాల్లోని ఆంజనేయస్వామి ఆలయాల్లో గురువారం హనుమజ్జయంతి వేడుకలు వైభవంగా నిర్వహించారు. ఆత్మకూరు పట్టణ సమీపంలోని హనుమాన్ జంక్షన్‌లో ఉన్న అభయాంజనేయస్వామి ఆలయంలో పంచామృతాభిషేకం, ఆకుపూజ, హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహించారు. అనంతరం అభయాంజనేయస్వామి సమేత సువర్చలాదేవి కల్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటుచేశారు.

ఆంజనేయస్వామికి ప్రముఖుల పూజలు

కలువాయి : హనుమాన్ జయంతి సందర్భంగా కలువాయి మండలం కుల్లూరులోని అభయాంజనేయస్వామిని గురువారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. గ్రామంలో టీటీడీ సౌజన్యంతో 33 అడుగుల అభయ ఆంజనేయస్వామి విగ్రహం ఏర్పాటు చేశారు. తిరుమల తిరుపతి దేవస్థానం చైర్మన్ బీఆర్ నాయుడు, జిల్లా కలెక్టర్ ఆనంద్, ఎస్పీ జీ కృష్ణకాంత్ తదితరులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. మాజీ ఎమ్మెల్సీ మాదాసు గంగాధరం ఆహ్వానం మేరకు ప్రముఖులతో పాటు టీడీపీ నాయకులు మురళీ కన్నబాబు, ఆనం చెంచుసుబ్బారెడ్డి, మాదాసు యజ్ఞపవన్ దంపతులు పూజల్లో పాల్గొన్నారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

●సంగం: స్థానిక ఆంజనేయస్వామి ఆలయంలో గురువారం భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. హనుమజ్జయంతి ఉత్సవంలో భాగంగా అభిషేకాలు, పూలంగిసేవ నిర్వహించారు. అనంతరం ఆకుపూజ చేశారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. రాత్రి హనుమంతుడి గ్రామోత్సవం నిర్వహించారు.

●అనంతసాగరం: మండలంలోని సోమశిల, ఉప్పలపాడు, అనంతసాగరం గ్రామాల్లో గురువారం హనుమజ్జయంతి వేడుకలు నిర్వహించారు. కోదండరామస్వామి ఆలయాల్లో ఆంజనేయస్వామికి విశేష పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదానం నిర్వహించారు.

●ఉదయగిరి : పట్టణ శివారు ప్రాంతంలోని హనుమంతుని వాగు వద్ద ఉన్న అభయాంజనేయస్వామి, మండలంలోని యర్రబల్లిగడ్డ ఆంజనేయస్వామి, గండిపాళెం జలాశయం ఆవరణలో ఉన్న అభయాంజనేయస్వామి ఆలయాల్లో పూజలు నిర్వహించారు. హనుమంతుని వాగు వద్ద అభయాంజనేయస్వామి ఆలయంలో ఎమ్మెల్యే కాకర్ల సురేష్ స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు ఆయనకు తీర్థప్రసాదాలు అందజేశారు. భక్తుల సౌకర్యార్థం అన్నదానం నిర్వహించారు.

●దుత్తలూరు: మండలంలోని వెంకటంపేట గ్రామంలో ఉన్న వీరాంజనేయస్వామి ఉత్సవాలు సందర్భంగా గురువారం హనుమజ్జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా వేదపండితులు స్వామివారికి అభిషేకాలు, హోమాలు, పూర్ణాహుతి, నైవేద్యం సమర్పణ తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయగిరి నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జి మేకపాటి రాజగోపాల్‌రెడ్డి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే నందిపాడు, బ్రహ్మేశ్వరం, నర్రవాడ, సోమలరేగడ తదితర గ్రామాల్లో హనుమజ్జయంతి వేడులకను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

●వరికుంటపాడు(ఉదయగిరి రూరల్): మండలంలోని తూర్పుబోయమడగల, వరికుంటపాడు, రామాపురం, విరువూరు తదితర గ్రామాల్లో గురువారం హనుమజ్జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. స్వామివారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు భక్తులకు తీర్థప్రసాదాలు అందచేశారు. అనంతరం భక్తుల సౌకర్యార్థం అన్నప్రసాద వితరణ, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

●సీతారామపురం : స్థానిక ఆంజనేయస్వామి ఆలయంలో ఆకుపూజ చేసి అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నదానం చేశారు.

●వింజమూరు : పట్టణంలోని హనుమాన్ దేవాలయాల్లో జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. స్వామివారికి తమలపాకులతో పూజలు చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

పీఎం సూర్య ఘర్‌పై అవగాహన ర్యాలీ



పీఎం సూర్య ఘర్‌పై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న విద్యుత్ సిబ్బంది

సంగం, మే 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ ఏఈ ఉడతా మన్మధరావు ఆధ్వర్యంలో పీఎం సూర్య ఘర్ పథకంపై గురువారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ సబ్‌స్టేషన్ నుంచి బస్టాండ్ వరకు నిర్వహించారు. ఈసందర్భంగా ఏఈ మాట్లాడుతూ ఎస్టీలకు ఉచితంగా పీఎం సూర్య ఘర్ పథకం ఏర్పాటు చేస్తున్నామన్నారు. మిగతా వర్గాల వారికి సుమారు రూ. 75 వేల వరకు రాయితీతోపాటు బ్యాంకు రుణం అందచేస్తారన్నారు. వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏడీఈ సతీష్, ఎస్‌సీఆర్ సోలార్ ఎనర్జీ సొల్యూషన్స్ నిర్వాహకులు, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

జనసేన పార్టీ బలోపేతానికి కృషి చేయాలి



జనసేన పార్టీ సభ్యత్వ కార్డులను పంపిణీచేస్తున్న భోగినేని కాశీరావు

సీతారామపురం, మే 22 (ఆంధ్రజ్యోతి): గ్రామస్థాయి నుంచి జనసేన పార్టీ బలోపేతానికి ప్రతిఒక్కరూ కృషిచేయాలని నా సేన కోసం నావంతు రాష్ట్ర కమిటీ మెంబర్ భోగినేని కాశీరావు సూచించారు. సీతారామపురం గ్రామ పంచాయతీలో గురువారం ఆయన జనసేన పార్టీ కార్యకర్తల ఇంటింటికీ వెళ్లి పార్టీ క్రియాశీలక సభ్యత్వ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నియోజకవర్గంలో 4 వేల మందికి సభ్యత్వ నమోదు కిట్లను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. సభ్యత్వ నమోదులో జిల్లాలో ఉదయగిరి నియోజకవర్గం మూడో స్థానంలో నిలిచిందన్నారు. క్రియాశీలక సభ్యత్వం ఉన్నవారికి రూ.5 లక్షల బీమా, రూ.50వేలు ప్రమాద బీమా కల్పించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో మండల జనసేన నాయకులు భోగినేని కాశీరత్తయ్య (గాంధీ), నాగేంద్ర, వెంకటేశ్వర్లు, కొత్త జగదీష్, తోట నవీన్, సుభాహని తదితరులు పాల్గొన్నారు.

ఉదయగిరి దుర్గాన్ని పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దుతా

● ఎమ్మెల్యే కాకర్ల సురేష్

ఉదయగిరి, మే 22 (ఆంధ్రజ్యోతి): ఉదయగిరి దుర్గాన్ని పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దుతానని ఎమ్మెల్యే కాకర్ల సురేష్ పేర్కొన్నారు. గురువారం దుర్గంపై గల మెట్ల మార్గం, కోనకాలువ, తొట్టి ప్రాంతాన్ని టీడీపీ నాయకులు, అధికారులతో కలిసి పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ చారిత్రక నేపథ్యం కలిగిన ఉదయగిరి దుర్గాన్ని పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. దుర్గం పర్యాటక ప్రాంతంగా మారితే పలువురికి ఉపాధి అవకాశాలు కలుగుతాయన్నారు. అందులో భాగంగా తొలివిడతగా దుర్గంపల్లి మెయిన్ రోడ్డు దుర్గం మెట్ల మార్గం వరకు రూ.96 లక్షలు, హనుమంతుని వాగు వద్ద అభయాంజనేయస్వామి ఆలయం వరకు రూ.7 లక్షలతో సిమెంట్ రోడ్ల నిర్మాణం చేపడుతున్నామన్నారు. అనంతరం ఉదయగిరి పట్టణ ప్రజల దాహార్తిని తీర్చే కోన కాలువ నీటిని రుచి చూశారు. కాలువ పక్కన ప్రజలు నడిచేలా మార్గాన్ని ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ కన్వీనర్ బయ్యన్న, టీడీపీ నాయకులు రియాజ్, నల్లిపోగు రాజా, నరసింహా, గడ్డం వెంకటేశ్వర్లు, బొజ్జా శ్రీనివాసులు, ఏడుకొండలు, తుమ్మల కిరణ్, పంచాయతీ డీఈ మణికుమార్, ఏఈ శ్రీనివాసరాజు పాల్గొన్నారు.

దీపం పథకం నగదు చెల్లింపుల్లో జాప్యం

● అయోమయంలో లబ్ధిదారులు

ఉదయగిరి రూరల్, మే 22 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వం దీపం-2 పథకం కింద ఉచితంగా ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్ల పంపిణీ పథకానికి శ్రీకారం చుట్టింది. అందులో భాగంగా ఇప్పటికే మొదటి విడత ప్రక్రియ పూర్తిచేసి వినియోగదారుల బ్యాంకు ఖాతాలకు ఉచిత రాయితీ నగదును జమ చేయడం జరిగింది. అలాగే రెండో విడతగా గ్యాస్ సిలిండర్లను బుక్ చేసుకున్న వారికి నగదు చెల్లింపుల్లో ఆలస్యం కావడంతో అయోమయానికి గురవుతున్నారు. రోజులు గడుస్తుండడంతో ఏజెన్సీలు, బ్యాంకుల వద్దకు పరుగులు తీస్తున్నారు. తొలి విడతలో రాయితీ నగదు రోజుల వ్యవధిలోనే జమ అయినప్పటికీ ప్రస్తుతం ఎందుకు ఆలస్యమవుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సాంకేతిక కారణాలతో ఆలస్యం

సాంకేతిక కారణాలతో నిధులను విడుదల చేయడం కొంతమేర ఆలస్యమయినప్పటికీ చెల్లింపుల ప్రక్రియ త్వరలోనే పూర్తవుతుందని అధికారులు, ఏజెన్సీలు సూచిస్తున్నారు. అలాంటి వినియోగదారులతో సహా అర్హులైన ప్రతిఒక్కరూ తమ బ్యాంకు ఖాతాతో ఆధార్‌ను అనుసంధానం చేయించుకోవాలన్నారు. అలాగే ఆధార్, రేషన్ కారులతో ఏజెన్సీలను సంప్రదించి సమస్యను పరిష్కరించుకోవాలని, అవగాహన కల్పించే పనిలో పడ్డారు. అధిక శాతం మందికి నగదు జమ కాలేదనే ఫిర్యాదులతో అధికారులు ఇలాంటి చర్యలు చేపట్టారు. అంతేగాక కొంతమంది వినియోగదారులు ఈకేవైసీ చేయించుకోక పోవడం కూడా కారణంగా గుర్తించారు. ఈనెల చివరి నాటికి ప్రక్రియ పూర్తిచేసుకున్న వారికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా వారం రోజుల వ్యవధిలోనే బ్యాంకుల్లో నగదు జమ చేయడం జరుగుతుందన్నారు. కాగా పట్టణాల్లో 1000 చదరపు అడుగుల కంటే అదనంగా ఇంటి స్థలంతో సహా నెలకు 300 యూనిట్ల కంటే అదనపు విద్యుత్ వినియోగించే వారిని అనర్హులుగా ప్రభుత్వం ప్రకటించిన విషయం విదితమే.

డీసీ పల్లిలో పొగాకు ధరలు

మర్రిపాడు, మే 22 (ఆంధ్రజ్యోతి) : డీసీ పల్లి పొగాకు వేలం కేంద్రానికి గురువారం రైతులు 486 బేళ్లను తీసుకొని రాగా 18 కంపెనీల ప్రతినిధులు 341 బేళ్లను కొనుగోలు చేశారు. వివిధ కారణాలతో 145 బేళ్లను తిరస్కరించారు. కేజీ గరిష్ఠ ధర రూ. 280కాగా, కనిష్ఠ ధర రూ. 200 పలికినట్లు వేలం నిర్వహణాధికారి జి రాజశేఖర్ తెలిపారు.

న్యూస్ బాక్స్

ఆత్మకూరు నుంచి శ్రీశైలానికి బస్సు సౌకర్యం

ఆత్మకూరు, మే 22 (ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు ఆర్టీసీ డిపో నుంచి శుక్రవారం నుంచి ప్రతిరోజూ శ్రీశైలానికి బస్సు సౌకర్యం ఏర్పాటుచేశామని ఆర్టీసీ డీఎం షేక్ కరీముల్లా గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆత్మకూరు నుంచి వింజమూరు, పామూరు, కనిగిరి, పొదిలి, మార్కాపురం, దోర్నాల మీదుగా శ్రీశైలానికి ఎక్స్‌ప్రెస్ బస్సు నడుపుతామని, రూ. 440 బస్సు చార్జీ ఉంటుందన్నారు. ఆత్మకూరు నుంచి ఉదయం 6 గంటలకు బస్సు బయలుదేరి మధ్యాహ్నం 2 గంటలకు శ్రీశైలం చేరుతుందని, శ్రీశైలం నుంచి సాయంత్రం 5 గంటలకు బయలుదేరి రాత్రి ఒంటిగంటకు ఆత్మకూరుకు చేరుతుందని తెలిపారు. కావున ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పోలేరమ్మ ఆలయంలో హుండీ చోరీ

అనంతసాగరం, మే 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని పాతదేవరాయపల్లి గ్రామదేవత పోలేరమ్మ ఆలయంలో బుధవారం రాత్రి దుండగులు ప్రవేశించి హుండీని పగలగొట్టి నగదు తస్కరించారు. హుండీలో సుమారు రూ.5 వేలు ఉంటుందని గ్రామస్థులు తెలిపారు. ఈమేరకు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఏడు మద్యం సీసాల స్వాధీనం

ఉదయగిరి, మే 22 (ఆంధ్రజ్యోతి): ఉదయగిరి ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని దుత్తలూరు మండలం వెంకటంపేట గ్రామంలో నిర్వహిస్తున్న అనధికార మద్యం బెల్టు దుకాణంపై దాడులు నిర్వహించినట్లు ఎస్‌ఐ దీప్తికరంత్ గురువారం తెలిపారు. ఈదాడుల్లో ఏడు మద్యం సీసాలతోపాటు నిర్వాహకుడిని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

కులం పేరుతో దూషించారని ఫిర్యాదు

సంగం, మే 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జండాదిబ్బకు చెందిన నాయబ్ అనే వ్యక్తి తనను కులం పేరుతో దూషించి దాడి చేశాడని మొలతాటి శీనయ్య గురువారం సంగం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసుల వివరాల మేరకు.. శీనయ్య గ్రామంలోని తాజ్ సెంటర్‌లో పాలు, ఐస్‌క్రీమ్ దుకాణం నిర్వహిస్తున్నాడు. ఈక్రమంలో గురువారం ఉదయం గ్రామానికి చెందిన నాయబ్ కుమారులు ఇద్దరు ఐస్‌క్రీమ్ కోసం వచ్చారు. కాగా, అప్పుడే ఐస్‌క్రీమ్ తీసుకుని రావడంతో పిండి పిండిగా ఉన్నాయి కాసేపు ఆగి రండి కూలింగ్ పెట్టి ఇస్తానని చెప్పడంతో పిల్లలు వెళ్లిపోయారు. ఆతరువాత కొంత సేపటికి నాయబ్ వచ్చి పిల్లలకు ఐస్‌క్రీమ్ ఇవ్వలేదని తనను కులం పేరుతో దూషిస్తూ దాడి చేశాడని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పిడుగు పడి గృహోపకరణాల దగ్ధం

కలువాయి, మే 22 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన కలువాయిలో బుధవారం రాత్రి ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. పాత పోస్టుఆఫీసు వీధిలోని ఓ భవనంపై పిడుగుపడి పిట్ట గోడ దెబ్బతింది. ఇళ్లలో గృహోపకరణాలు కాలిపోయాయి. గ్రామస్థులు భయాందోళన చెందారు.

వివాహ ఖర్చులకు ఆర్థిక సాయం

ఉదయగిరి, మే 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గండిపాళెం గ్రామానికి చెందిన పులి లాబాను కుమార్తె సువర్ణ వివాహ ఖర్చుల నిమిత్తం జీఎంకే ట్రస్టు అధినేత, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు గుంటుపల్లి మాలకొండయ్యచౌదరి గురువారం తన ప్రతినిధులచే రూ.5 వేలు నగదు కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు ప్రతినిధి బుడంగుంట్ల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

నేడు జేవీవీ మండల సమావేశం

వరికుంటపాడు(ఉదయగిరి రూరల్), మే 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక పొదుపు కార్యాలయంలో శుక్రవారం జేవీవీ మండల సమావేశం నిర్వహించనున్నట్లు శాఖ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కుమ్మిత శ్రీనివాసులురెడ్డి తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ సమావేశంలో ప్రధానంగా జిల్లా మహాసభ నిర్వహణ, భవిష్యత్తు కార్యాచరణ తదితర అంశాలపై చర్చించడం జరుగుతుందన్నారు. అనంతరం మండల నూతన కమిటీ ఎన్నిక నిర్వహించడం జరుగుతుందన్నారు. కావున బాధ్యులు, కమిటీ సభ్యులు తప్పక హాజరు కావాలని కోరారు.

C.R.I.M.E N.E.W.S



వాహన పత్రాలు తనిఖీ చేస్తున్న సీఐ

టిడ్కో ఇళ్లలో కార్డన్ సెర్చ్

● 45 బైక్‌ల స్వాధీనం

నెల్లూరు(క్రైం), మే 22 (ఆంధ్రజ్యోతి) : నేర నియంత్రణ, అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేసేందుకు నగరంలోని భగత్‌సింగ్ కాలనీలో ఉన్న టిడ్కో గృహ సముదాయంలో గురువారం తెల్లవారుజామున నగర పోలీసులు కార్డన్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. అక్కడి 1922 ఇళ్లను పోలీసులు తనిఖీ చేశారు. సరైన పత్రాలు లేని 45 బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. అనుమానితుల వేలిముద్రలు సేకరించారు. ఈ సందర్భంగా ఎస్పీ జీ కృష్ణకాంత్ మాట్లాడుతూ సామాన్య ప్రజల్లో ధైర్యం నింపుతూ పోలీసు వ్యవస్థపై విశ్వాసం పెంచేందుకు ఈ ఆపరేషన్ నిర్వహిస్తున్నామని తెలిపారు. పరారీలో ఉన్న నేరస్తులను గుర్తించి అదుపులోకి తీసుకోవడం, వెండి, బంగారు వంటి చోరీ సొత్తు, రికార్డులు లేని అన్ని వస్తువులు, వాహనాలు, అక్రమ మద్యం, ఆయుధాలు, పేలుడు పదార్థాలు, మాదక ద్రవ్యాలు వంటి వాటిని గుర్తించి స్వాధీనం చేసుకోవడమే కార్డన్ సెర్చ్ ఆపరేషన్ ముఖ్య ఉద్దేశమని వెల్లడించారు. చట్టవ్యతిరేక చర్యలు, అనుమానాస్పద వ్యక్తుల సమాచారం ఉంటే ప్రజలు స్థానిక పోలీసులకుగానీ 112, 100 నెంబర్లకుగానీ తెలియజేయాలని కోరారు. కార్డన్ సెర్చ్‌లో సీఐలు వేణుగోపాల్‌రెడ్డి, దశరథరామయ్య, రోశయ్య, శ్రీనివాసరావు, 12 మంది ఎస్‌ఐలు, 100 మంది సిబ్బంది పాల్గొన్నారు.

రైల్వే ప్లాట్‌ఫాంపై ఒకరి మృతి



రైల్వే ప్లాట్‌ఫాంపై గుర్తుతెలియని మృతదేహం

నెల్లూరు (క్రైం), మే 22 (ఆంధ్ర జ్యోతి) : నెల్లూరు ప్రధాన రైల్వే స్టేషన్‌లోని రెండవ నెంబరు ప్లాట్‌ఫాం పై గుర్తుతెలియని వ్యక్తి గురువారం తెల్లవారు జామున మృతి చెందాడు. రైల్వే పోలీసుల సమాచారం మేరకు... 55 నుంచి 60 ఏళ్ల వ్యక్తి మృతదేహాన్ని రైల్వే పోలీసులు గుర్తించారు. మృతదేహంపై స్కైబ్లూ, పసుపు చెక్స్ ఫుల్ హాండ్స్ షర్ట్, బులుగు గళ్ల లుంగీ ఉన్నాయి. అనారోగ్యంతో మృతి చెంది ఉంటాడని ఎస్‌ఐ ఎన్ హరిచందన తెలిపారు. మృతుడి వివరాలు తెలిసిన వారు రైల్వే పోలీసులను సంప్రదించాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి ..



గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

దగదర్తి (బిట్రగుంట), మే 22 (ఆంధ్రజ్యోతి): దగదర్తి మండలం అనంతవరం పంచాయతీ లైన్స్‌నగర్ జాతీయ రహదారి ఫ్లైఓవర్ బ్రిడ్జిపై గుర్తుతెలియని వ్యక్తి(35) మృతదేహాన్ని గుర్తించినట్లు ఎస్‌ఐ జంపాని కుమార్ గురువారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు తెల్లవారుజామున కావలి వైపు వెళ్లే గుర్తుతెలియని వాహనం ఢీకొని అతను మృతి చెంది ఉండవచ్చన్నారు. మృతుడి ఛాతీ ఎడమవైపు, కుడి చేతిపైన ఇంగ్లిషు అక్షరాలతో ఎంఎం అనే పచ్చబొట్టు ఉందన్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని నెల్లూరు జీజీహెచ్‌కి తరలించామన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు ఎస్‌ఐ తెలిపారు.

ప్రమాదవశాత్తు కాలువలో పడి ఒకరు...

ముత్తుకూరు, మే 22 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు కాలువలో పడి వ్యక్తి మృతి చెందిన సంఘటన ముత్తుకూరు మండలం బ్రహ్మదేవంలో గురువారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. వరకవిపూడి ఎస్టీ కాలనీకి చెందిన ఆలూరి కృష్ణ (35) చెత్త ఏరుకుంటూ జీవనం సాగించేవాడు. బుడ్డి డ్రైన్ సమీపంలో చెత్త ఏరుకుంటూ ప్రమాదవశాత్తు కాలువలో పడ్డాడు. గురువారం కృష్ణ మృతదేహం బుడ్డి డ్రైన్‌లో తేలుతూ కనిపించడంతో స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందజేశారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహానికి పంచనామా నిర్వహించి శవపరీక్ష నిమిత్తం నెల్లూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఈమేరకు ముత్తుకూరు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.


మద్యం మత్తులో గొంతుకోసుకున్న యువకుడు

నెల్లూరు(క్రైం), మే 22 (ఆంధ్రజ్యోతి) : మద్యం మత్తులో ఓ యువకుడు గురువారం ఉదయం గొంతు కోసుకున్నాడు. పోలీసుల సమాచారం మేరకు... నెల్లూరులోని కస్తూరిదేవి స్కూలు ఎదురు వీధిలో ఓ యువకుడు కత్తితో గొంతుకోసుకొని అపస్మారక స్థితిలో పడిఉండటాన్ని గమనించిన స్థానికులు దర్గామిట్ట పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు హుటాహుటిన అక్కడికి చేరుకుని ఆ యువకుడిని చికిత్స నిమిత్తం జీజీహెచ్‌కు తరలించారు. మార్గమధ్యలో తాను ప్రకాశం జిల్లా తుళ్లూరుకు చెందిన వాడినని, తన పేరు దాసు అని, బేల్దారి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నానని, తిరుపతి నుంచి వస్తున్నానని పోలీసులకు తెలిపాడు. గొంతు ఎందుకు కోసుకున్నావని అడగ్గా సమాధానం చెప్పలేదు. జీజీహెచ్‌లో చేర్పించిన పోలీసులు సాయంత్రం యువకుడిని విచారించేందుకు వెళ్లగా అప్పటికే అతను డిశ్చార్జ్ అయి వెళ్లిపోయాడని వైద్యసిబ్బంది తెలిపారు. అతని కోసం గాలిస్తున్నామని దర్గామిట్ట పోలీసులు తెలిపారు.

సమస్యలు పరిష్కరించండి

● మానవహారంగా సీహెచ్‌సీల నిరసన

నెల్లూరు (వైద్యం), మే 22 (ఆంధ్రజ్యోతి) : తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కమ్యూనిటీ హెల్త్ అధికారులు (సీహెచ్‌వో) గురువారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం వద్ద మానవహారం ఏర్పడి నిరసన తెలిపారు. వారు కొనసాగిస్తున్న సమ్మెలో భాగంగా ఈ కార్యక్రమం చేపట్టారు. సీహెచ్‌సీల సంఘం జిల్లా అధ్యక్షుడు భాను మహేష్ మాట్లాడుతూ గ్రామాల్లో వైద్య చికిత్సలు అందిస్తున్న తమకు వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా కోఆర్డినేటర్ ఆదిల్, రుబిక, విజయ్, ప్రశాంతి పాల్గొన్నారు.



మానవహారంగా ఏర్పడ్డ సీహెచ్‌సీలు

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	136
స్కిన్ చికెన్	244
స్కిన్‌లెస్	270

కోడిగుడ్ల ధర (100): 530


విలేకరులతో టీడీపీ నాయకులు

దళితులకు అండగా టీడీపీ

కొండాపురం, మే22(ఆంధ్రజ్యోతి): దళితులకు అండగా టీడీపీ ఉంటుందని మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షుడు పోలినేని చంద్రబాబునాయుడు అన్నారు. గురువారం స్థానిక టీడీపీ నాయకులతో కలసి ఆయన విలేకరులతో మాట్లాడారు. టీడీపీ నాయకులు దళితలను భయపెట్టి అక్రమకేసులు పెడుతున్నారని మర్రిగుంట సర్పంచి డీ. గోపి, రేషన్ డీలర్ సురేష్ అనడం సమంజసంకాదన్నారు. మర్రిగుంటలో అర్ధరాత్రి అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తుంటే గ్రామస్థులు అడ్డుకొని పోలీసులకు ఫిర్యాదుచేయడంతో కేసు నమోదు చేశారన్నారు. ఈవిషయంలో టీడీపీ నాయకుల ప్రమేయంలేదన్నారు. ఇటువంటి ఆరోపణలు మానుకోవాలని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గుడవళ్లూరు సర్పంచి మాచర్ల, నాయకులు పోలినేని రమేష్, దాసరి అశోక్, జాగర్లమూడి శ్రీనివాసులు, నర్రా శివన్నారాయణ, చిట్లాబత్తిన మాచర్ల , కే.నరేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

తూర్పుపాలెంలో సీతారాముల కల్యాణం


కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు

కొండాపురం, మే22(ఆంధ్రజ్యోతి): మండలంలోని తూర్పుపాలెంలో సీతారాముల కల్యాణ వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఐదు రోజుల తిరునాళ్లలో భాగంగా సీతారాముల విగ్రహాలకు విశేషపూజలుచేసి ప్రత్యేకంగా అలంకరించి కల్యాణం జరిపించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందచేశారు.

ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుకు భూమిపూజ


భూమిపూజలో పాల్గొన్న ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు

కందుకూరు, మే 22 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని దివివారిపాలెంలో 220 కేవీ సబ్‌స్టేషన్ వద్ద 100 ఎంవీఏ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ నిర్మాణం చేపట్టనున్నారు. ఇందుకు గురువారం ఉదయం భూమిపూజ నిర్వహించారు. స్థానిక ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ముఖ్య అతిథిగా పాల్గొని భూమిపూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ అధికారులు షేక్ అమీన్, నాగరాజు, సుధీర్‌బాబు, శ్రీనివాసులు, రవితేజ, టీడీపీ నాయకులు దామా మల్లేశ్వరరావు, చదలవాడ కొండయ్య, దివివారిపాలెం టీడీపీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

ఆలయాల భూములకు నేడు వేలం

కావలి,మే22(ఆంధ్రజ్యోతి):పట్టణంలోని కలుగోళ్ల శాంభవి, పాతూరు శివాలయం, విష్ణాలయాలకు సంబంధించిన సుమారు 22 ఎకరాల భూములకు శుక్రవారం వేలం నిర్వహిస్తున్నట్లు ఈవో రాధాక్రిష్ణ, ఆలయాల ధర్మకర్త క్రిష్ణమోహన్ తెలిపారు. ఉదయం 11 గంటలకు కలుగోళ్లశాంభవి ఆలయ ఆవరణలో వేలం నిర్వహించనున్నామన్నారు. పాల్గొనదలచిన వారు నిబంధనల మేరకు ముందుగా దరావత్తు చెల్లించాలని చెప్పారు.

తెగిన విద్యుత్ తీగలు తప్పిన ప్రమాదం

కావలి రూరల్, మే22(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని తుమ్మలపెంట రోడ్డు డంపింగ్ యార్డు సమీపంలో గురువారం రోడ్డు 11కేవీ విద్యుత్ తీగలు తెగిపడ్డాయి. పెద్దశబ్దంతో మంటలు వచ్చి తీగలు తెగి రోడ్డుపై పడ్డ సమయంలో అటుగా వాహనాలు రాకపోవటంతో పెను ప్రమాదం తప్పిందని స్థానికులు తెలిపారు. అధికారులు స్పందించి దెబ్బతిన్న విద్యుత్ లైన్లు తొలగించి కొత్త లైన్లు ఏర్పాటు చేయాలని వారు కోరుతున్నారు.

వేలంపై వదంతులు నమ్మొద్దు

కందుకూరు, మే 22 (ఆంధ్రజ్యోతి) : గ్రామదేవత అంకమ్మ ఆలయ షాపుల వేలంపై వదంతులు నమ్మవద్దని దేవస్థానం అధికారి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం జరిగే షాపుల బహిరంగ వేలం యథావిధిగా జరుగుతుందన్నారు. నిబంధనలకు అనుగుణంగా వేలంలో పాల్గొనవచ్చన్నారు.

రేపు కరేడు గ్రామానికి రామచంద్ర యాదవ్ రాక

ఉలవపాడు, మే 22(ఆంధ్రజ్యోతి) : రైతుల అభ్యర్థన మేరకు శనివారం సాయంత్రం కరేడుకు భారత చైతన్య యువజన పార్టీ జాతీయ అధ్యక్షుడు రామచంద్ర యాదవ్ రానున్నారని బీసీ కులాల జేఏసీ రాష్ట్ర చైర్మన్ మిరియం శ్రీనివాసులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇండోసోల్ కంపెనీకి గ్రామస్తుల అనుమతి లేకుండా సర్వే చేయించి రైతుల భూములు లాక్కొనేందుకు ప్రభుత్వం సిద్ధ పడటం, దాన్ని రైతులు వ్యతిరేకిస్తున్నందున గ్రామస్తులకు, రైతులకు మద్దతుగా నిలిచేందుకు ఆయన వస్తున్నట్లు పేర్కొన్నారు.

విట్స్ గోల్డ్ మెడలిస్టులకు అభినందనలు

కావలిటౌన్, మే22(ఆంధ్రజ్యోతి) గోల్డ్ మెడల్స్ సాధించిన విట్స్ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులను గురువారం కళాశాలలో అభినందించారు. ఇటీవల అనంతపురం జేఎన్‌టీయూ స్నాతకోత్సవంలో విద్యార్థిని భవిత సీఎస్‌సి ఏఐ విభాగంలో, అభినయ సీఎస్‌సీ ఐవోటి విభాగాల్లో అత్యున్నత ప్రతిభ కనబరిచి గోల్డ్ మెడల్స్ సాధించారు. విట్స్ చైర్మన్ దొడ్ల విద్యాధర్‌కుమార్ రెడ్డి, అకడమిక్ డైరెక్టర్ ప్రత్యూషా రెడ్డి, అకడమిక్ ఇన్‌చార్జ్ లిఖిత్ రెడ్డి, ప్రిన్సిపాల్ శేషయ్య, వైస్ ప్రిన్సిపాల్స్ శ్రీనాథ్, సునీల్‌కుమార్ అధ్యాపకులు తదితరులు వారిని అభినందించారు.

గ్రామగ్రామాన హనుమజ్జయంతి

● పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు ● వివిధ ప్రాంతాల్లో అన్నదానం


లింగసముద్రం : ఆంజనేయుడి విగ్రహ ఊరేగింపు


బిట్రగుంట : ప్రత్యేక పూజల్లో పాల్గొన్న భక్తులు


గుడ్లూరులో ఆంజనేయుడి పూజల్లో పాల్గొన్న భక్తులు

కావలి రూరల్, మే22(ఆంధ్రజ్యోతి): మండలంలోని గ్రామాల్లో గురువారం హనుమజ్జయంతి వేడుకలు కనుల పండుగలా జరిగాయి. గ్రామాల్లో ఉన్న ఆంజనేయస్వామి ఆలయాలు, విగ్రహాలను పూలతో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. చౌదరిపాలెంలోని ఆంజనేయ స్వామి విగ్రహం వద్ద అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాత్రికి అన్న సంతర్పణ, స్వామి వారి ఊరేగింపు నిర్వహించారు.

● గుడ్లూరు, (ఆంధ్రజ్యోతి): గ్రామంలో గురువారం హనుమాన్ జయంతి వేడుకలను వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హనుమాన్ దీక్షాపరులు ఒక్కపొద్దులతో మొక్కు చెల్లించుకున్నారు. మిట్టపాలెం వేణుగోపాల స్వామి ఆలయ ప్రాంగణంలో ఉన్న ఉత్తర ముఖ ఆంజనేయుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీ రామ్‌సేవక్ ఆధ్వర్యంలో కాషాయజెండాలతో గుడ్లూరు వీధుల్లో ప్రదర్శన నిర్వహించారు. మెలుళ్లూరు వెళ్లే రహదారిపక్కన ఉన్న ఆంజనేయస్వామి ఆలయం వద్ద భక్తులు ఆకు పూజ నిర్వహించారు. శివాలయం సమీపంలో ఉన్న అంనేయస్వామి విగ్రహం వద్ద సనిశెట్టి గిరిబాబు ఆధ్వర్యంలో భక్తులకు పులిహోర, మంచినీళ్ల ప్యాకెట్లను అందచేశారు.


కందుకూరులో అరటి పండ్లతో ఆంజనేయుడికి అలంకరణ

● వలేటివారిపాలెం, (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రసన్నాంజనేయస్వామి ఆలయంలో గురువారం హనుమాన్ జయంతి వేడుకలు జరిగాయి. ఈ సందర్భగా స్వామి విగ్రహన్ని సిందూరం తులసి, బంతి, మందారం మాలలతో ప్రత్యేక అలంకరణ చేశారు. ఉదయం విశేష అభిషేక పూజలు నిర్వహించారు. భక్తులు పొంగళ్లు పెట్టుకొని కొబ్బరికాయలు కొట్టి మొక్కు తీర్చుకున్నారు. మధ్యాహ్నం గుత్తా కొండయ్య, జయమ్మ, గుత్తా నాగమోహన్, శ్రీలత, గుత్తా చంద్రమోహన్, సునీత,ముండి గ్రామానికి చెందిన తాడిబోయిన చిరంజీవి ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పాటు చేశారు

● కొండాపురం, (ఆంధ్రజ్యోతి): హనుమాన్ జయంతిని గురువారం మండలంలోని భీమవరప్పాడు, సాయిపేట, మర్రిగుంట గ్రామాల్లో ఘనంగా జరుపుకున్నారు. ఆంజనేయుడి విగ్రహాలకు అభిషేకాలుచేసి, ప్రత్యేక పూజలను నిర్వహించారు. సాయిపేట ఆంజనేయస్వామి విగ్రహంవద్ద నిర్వాహకులు అన్నదానం ఏర్పాటుచేశారు.

● కందుకూరు, (ఆంధ్రజ్యోతి) : హనుమాన్ జయంతి సందర్భంగా గురువారం కందుకూరులో శోభాయాత్ర జరిగింది. విశ్వహిందూ పరిషత్, బజరంగ దళ్, కందుకూరు ఆర్‌ఎస్‌ఎస్ ఖండ సంఘచాలక్ డాక్టర్ తన్నీరు మల్లికార్జునరావు ఆధ్వర్యంలో అంకమ్మ ఆలయం వద్ద ఉన్న బజరంగ్ సెంటర్ నుంచి పట్టణంలోని పలు బజారుల్లో మోటార్ సైకిళ్లపై శోభాయాత్ర కొనసాగింది. యాత్ర మధ్యలో అంబేడ్కర్, పొట్టిశ్రీరాములు, మహాత్మా గాంధీ విగ్రహాలకు పూలమాలలు వేసి ఘననివాళులు అర్పించారు. పట్టణంలోని పెద్దబజారు కోదండ రామాలయంలోని ఆంజనేయస్వామికి పంచామృత అభిషేకం, చందనాలంకారం, ఆకుపూజ నిర్వహించారు. హైదరాబాద్‌కు చెందిన శ్రీరామ శరన్ గురుదేవుల ప్రియ శిష్యులు రామ్నాథ్ బిరుదంకితులు పంగులూరి గోవిందరావు ప్రవచనం చేశారు. అనంతరం పంచామృత ధార పుస్తక ఆవిష్కరణ చేశారు.

● కావలిటౌన్, (ఆంధ్రజ్యోతి) పట్టణంలో గురువారం హనుమత్ జయంత్యుత్సవాలు వైభవంగా జరిగాయి. ముసునూరు హనుమత్ క్షేత్రం, మద్దూరుపాడు వీరాంజనేయస్వామి ఆలయం, జనతాపేట ఆలయాల్లో ప్రత్యేక పూజలు అన్నదానాలు నిర్వహించారు. మద్దూపాడు ఆలయంలో పెద్దఎత్తున వేడుకలు జరిగాయి. ఉదయం స్వామివారికి పంచామృత సేవలు, అభిషేకాల అనంతరం వడమాల అలంకారంలో దర్శనమిచ్చారు. ఎమ్మెల్యే క్రిష్ణారెడ్డి పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్ష కార్యదర్శులు పీ శ్రీధర్, గుత్తికొండ కిషోర్ తదితరులు పాల్గొన్నారు. ముసునూరు హనుమత్ క్షేత్రంలో ప్రధాన అర్చకులు వేదగిరి సూర్యనారాయణాచార్యులు పర్యవేక్షణలో ఉదయం శాంతి అభిషేకాలు, శాంతి అభిషేక సిందూరార్చన, హోమ పూజలు జరిగాయి. అనంతరం సామూహిక లక్ష సిందూరార్చన పూజలు జరిగాయి. రాత్రి కోలాటాలు, మంగళ వాయిద్యాల మధ్య పల్లకీసేవ, ఆలయ ఉత్సవం కనులపండువగా జరిగాయి.

● అల్లూరు, (ఆంధ్రజ్యోతి) : హనుమాన్ జయంతిని పురస్కరించుకొని గురువారం మండలంలోని అల్లూరు మారుతీ ఆశ్రమంలో, వేణుగోపాలస్వామి ఆలయంలో, కోనేరు సెంటరులోని అభయాంజనేయస్వామి పుష్కరిణి వద్ద ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. పలుచోట్ల అన్నదానం చేశారు.

● బిట్రగుంట, (ఆంధ్రజ్యోతి): బోగోలు పంచాయతీ పాతహరిజనవాడలోని కోదండరామస్వామి ఆలయంలో కొలువై ఉన్న అభయాంజనేయస్వామికి గురువారం పంచామృతాభిషేకం నిర్వహించారు. అనంతరం స్వామివారికి సిందూర, ఆకుపూజలు చేశారు. బోగోలు చెన్నకేశవస్వామి, బృందావనంలోని కోదండస్వామి, రాజావీధిలోని షిరిడీ సాయిమందిరం, రైల్వేలోకో, ట్రాఫిక్ రామాలయాల్లోనూ హనుమజ్జయంతి కార్యక్రమాలు జరిగాయి. ఎస్‌జీవీకండ్రికలోని ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు, అన్నసంతర్పణ కార్యక్రమాలు నిర్వహించారు.


కావలి టౌన్ : హనుమత్ క్షేత్రంలో పవనసుతుడికి పల్లకీసేవ

● కలిగిరి, (ఆంధ్రజ్యోతి): మండలంలోని జిర్రావారిపాలెం తిప్ప, కమ్మవారిపాలెం, కుమ్మరకొండూరు, కలిగిరిలో గురువారం హనుమజ్జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. కలిగిరిలోని బాలాంజనేయుడికి చందనంతో శ్రీరామ అని వ్రాసిన తమలపాకులతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మిగిలిన ఆలయాలవద్ద స్వామి వారికి అభిషేకాలు జరిగాయి.

● లింగసముద్రం, (ఆంధ్రజ్యోతి) : పంచాయతీలోని బలిజపాలెంలో ఉన్న ఆంజనేయ స్వామి ఆలయాన్ని సందర్శించిన భక్తులు స్వామి వారికి భక్తి శ్రద్ధలతో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు అన్నదానం చేశారు.సాయంత్రం 4 గంటలకు ఆంజనేయస్వామి విగ్రహానికి శోభాయాత్ర నిర్వహించారు.భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.


కావలి : ఆంజనేయస్వామికి పూజలు నిర్వహిస్తున్న భక్తులు


వలేటివారిపాలెం : ప్రసన్నాంజనేయుడి ఆలయం వద్ద పొంగళ్లు పెడుతున్న మహిళలు


కలిగిరి : ప్రత్యేకాలంకరణలో ఆంజనేయుడు

పాత చెరువు అలుగులో ప్లాస్టిక్ వ్యర్థాలు

● కమ్మేసిన చిల్లచెట్లు

లింగసముద్రం, మే 22 (ఆంధ్రజ్యోతి): గ్రామంలోని పాత చెరువు దక్షిణ వైపున ఉన్న అలుగు చిల్లచెట్లు, ప్లాస్టిక్ వ్యర్థాలతో నిండి పోయింది. గ్రామంలోని హోటళ్ల, ఇతర దుకాణాల వారు ప్లాస్టిక్, వ్యర్థాలను అలుగులో పడేస్తున్నారు.దీంతో దుర్వాసన వస్తోంది.దీనికితోడు గత ఆరేళ్ల నుంచి తీవ్ర వర్షాభావ పరిస్థితుల కారణంగా చెరువులోకి నీరు చేరలేదు. ఈ అలుగు పక్కనే ఉన్న కాలనీవాసులు కూడా మురుగు నీటిని అలుగులోకే వదులుతున్నారు. అయితే ఈ అలుగుపై వేసిన చప్టా ద్వారానే తిమ్మారెడ్డిపాలెం, గంగపాలెంతోపాటు పలు గ్రామాల ప్రజలు నిత్యావసర వస్తువులకోసం, ప్రభుత్వ కార్యాలయాలకు లింగసముద్రానికి వచ్చి వెళుతుంటారు.వ్యవసాయ సీజన్‌లో పనుల కోసం రైతులు, రైతుకూలీలు పొలాలకు వెళుతుంటారు. దుర్వాసనతో వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.సంబంధిత అధికారులు స్పందించి వ్యర్థాలు తొలగించాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు.


ప్లాస్టిక్ వ్యర్థాలు, చిల్లచెట్లతో నిండిన లింగసముద్రం పాత చెరువు అలుగు

బోగస్ మస్టర్లపై ప్రత్యేక దృష్టి

● దయాసాగర్, ఉపాధి పథకం ఏపీవో



వలేటివారిపాలెం, మే 22 (ఆంధ్రజ్యోతి) మండలంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులపై నిరంతరం పర్యవేక్షణ ఉంటుందని ఏపీవో దయాసగర్ తెలిపారు. పనుల వద్దకు వెళ్లి మస్టర్లను పరిశీలిస్తున్నామని, స్వయంగా మస్టర్లు వేసి కూలీలతో మాట్లాడుతున్నామని ఆయన వివరించారు.

? : పనుల వద్ద కూలీలలకు ఏయే వసతులు కల్పిస్తున్నారు.

! : ఉపాధి పనుల వద్ద కూలీలకు టెంట్, మంచినీరు, మెడికల్ కిట్లు, ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు తదితర వసతులు కల్పిస్తున్నాం. కూలీలు ఉదయం 6 నుంచి 10 గంటల వరకు పనిచేసేలా చర్యలు చేపడుతున్నాం.

? : మండలంలో ఎన్ని జాబ్ కార్డులు ఉన్నాయి.

! : మండలంలో 10932 జాబ్ కార్డులు ఉం డగా, 18539 మంది కూలీలు పనిచేస్తున్నారు.

? : రోజుకు ఎంత మంది కూలీలు పనులకు హాజరవుతున్నారు ?

! : ప్రతి రోజూ 5 వేల నుంచి 5500 మంది వరకు కూలీలు పనులకు హాజరవుతున్నారు.

బుడంగుంట కాలనీలో పారిశుధ్యం అధ్వానం

కావలి, మే22(ఆంధ్రజ్యోతి): స్వచ్ఛ సర్వేక్షణలో భాగంగా పారిశుధ్య నిర్వహణకు మున్సిపల్ అధికారులు ప్రాధాన్యం ఇస్తున్నా కాలనీలవైపు మాత్రం చిన్న చూపు చూస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. మున్సిపాలిటీ పరిధిలో ఉన్న బుడంగుంట కాలనీలో పారిశుధ్య నిర్వహణను పట్టించుకోవటం లేదని ఆ కాలనీవాసులు వాపోతున్నారు. పట్టణానికి శివారులో ఉన్న ఆ కాలనీకి అసలే విషపురుగుల సంచారంతో భయపడుతుండగా, దానికి తోడు అక్కడ రోడ్ల వెంబడి ఉన్న చెట్లను తొలగించడంలేదు. దీంతో రోడ్ల వెంబడి చెట్లుపెరిగి మూసుకుపోవటమేకాక వాటివల్ల విషపురుగులు తిరుగుతున్నాయని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. అలాగే డ్రైనేజీ కాలువలు నిర్మించినా వాటిలో చెత్తాచెదారం తొలగించడంలేదు. మున్సిపల్ అధికారులు స్పందించి బుడంగుంట కాలనీలో పారిశుధ్య నిర్వహణకు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.


కంప, పిచ్చి చెట్లతో మూసుకుపోతున్న రోడ్డు


చెత్తాచెదారంలో నిండిన డ్రైనేజీ కాలువ

రూ.3.26 కోట్లతో ఇంటింటికి కుళాయి


అగ్ని ప్రమాద బాధితులకు ఆర్థికసాయాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి

అల్లూరు, మే 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రతీ ఇంటికి కుళాయిని ఏర్పాటు చేసేందుకు జలజీవన్ మిషన్ ద్వారా రూ3.26 కోట్లు మంజూరయ్యాయని కావలి ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి తెలిపారు. పట్టణ పరిధిలోని చెర్లోసంఘం వద్ద సీపీడబ్ల్యూఎస్ పథకాన్ని గురువారం ఆయన పునఃప్రారంభించారు. దాదాపు రూ40 లక్షల నిధులతో మరమ్మతులు చేసిన మిషనరీని ఆయన పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ కొంతమంది స్వార్థ రాజకీయ నాయులు అందలాన్ని ఎక్కాలనే ఆలోచనతో నగర పంచాయతీని తీసుకొచ్చి అభివృద్ధిని నిర్వీర్యం చేశారన్నారు. త్వరలో అల్లూరును గ్రామ పంచాయతీగా మార్పు చేసేందుకు ఆర్డినెన్స్ వస్తుందన్నారు. రాష్ట్రంలో మహిళా సాధికారత ఒక్క చంద్రబాబునాయుడుతోనే సాధ్యపడుతుందని ఎమ్మెల్యే అన్నారు. బీసీ వెల్ఫేర్ ఆధ్వర్యంలో రామకృష్ణ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన ఉచిత కుట్టు శిక్షణ కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సోమశిల ప్రాజెక్టు కమిటీ ఉపాధ్యక్షుడు బీద గిరిధర్, ఎంపీపీ దర్శిగుంట శశిరేఖ, జడ్పీటీసీ సభ్యురాలు వేణమ్మ, నాయకులు పలగాటి శ్రీనివాసులురెడ్డి, బండి అమర్‌రెడ్డి, మేడా కృష్ణారెడ్డి, నీలపరెడ్డి హరీష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● ఇటీవల అగ్ని ప్రమాదానికి గురై నాలుగు గడ్డివాములు దగ్ధమైన సంఘటనలో బాధితులకు ఎమ్మెల్యే ఆర్థిక సాయం చేశారు. సింగపేట మజరా గ్రామమైన మూర్తిరాజపురంలో బాధితులతో మాట్లాడి ఒక్కొక్కరికి రూ.10 వేలు వంతున ఆర్థిక సాయాన్ని అందజేశారు.

● టీడీపీ ఆధ్వర్యంలో కడపలో జరగబోయే మహానాడు కార్యక్రమాన్ని విజయవంతం చేయాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని ఎమ్మెల్యే అన్నారు. గురువారం రాత్రి ఆయన నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతీ కార్యకర్త పార్టీకి కీలకమని, కార్యకర్తలకు ఏ సమస్య వచ్చినా తాను ముందుండి సమస్యను పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రేబాల శంకర్‌రెడ్డి, కృష్ణచైతన్య, రత్తయ్య, ఆట తిరుమల, ఊటు శ్రీకాంత్, నీలపరెడ్డి హరీష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీజేఐని అవమానించిన వారిపై చర్యలు తీసుకోవాలి


ఆర్డీవోకు వినతిపత్రం ఇస్తున్న దళిత సంఘాల నేతలు

కావలి, మే22(ఆంధ్రజ్యోతి): భారత ప్రధాన న్యాయమూర్తి(సీజేఐ) ఎస్ఆర్ గవాయ్‌ని అవమానించిన వారిపై చర్యలు తీసుకోవాలని దళిత సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షుడు ఎస్ మల్లి పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం ఆర్డీవో కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేసి ఆర్డీవో ఎం. సన్నీ వంశీక్రిష్ణకు వినతి పత్రం అందచేసారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈనెల 18న ముంబాయి న్యాయవాదుల సంఘం సన్మాన కార్యక్రమంలో సీజేఐకి తగిన ప్రొటోకాల్ పాటించకుండా అవమానపరిచారన్నారు. బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జరుగుమల్లి విజయరత్నం, సురేష్, ఆదెయ్య, తిరుపతి, జెడ్డా వాసు, సమితి కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

జలదంకిలో తిరంగా ర్యాలీ



జలదంకిలో నిర్వహించిన తిరంగా ర్యాలీ

జలదంకి, మే22(ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ సిందూర్‌లో పాల్గొని విజయం సాధించిన త్రివిధ దళాలకు మద్దతుగా గురువారం రాత్రి జలదంకిలో తిరంగా ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో పాల్గొన్న ప్రజలు తివర్ణపతాకాలను చేతబూని భారత్‌మాతాకీ జై అంటూ నినాదాలు చేశారు. జలదంకి ఆర్టీసీ బస్టాండ్ కూడలి నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు యాత్ర కొనసాగింది. అనంతరం ఆపరేషన్ సిందూర్ గురించి వక్తల ప్రసంగాలు సాగాయి. ఈ యాత్రలో అన్ని రాజకీయపార్టీల నేతలతో పాటుగా ఎస్ఐ సయ్యద్ లతీఫున్నీసా, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

25న ప్రతిభ పురస్కారాలు

కందుకూరు, మే 22 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి ప్రకాశం జిల్లాలో ఈ ఏడాది 10వ తరగతి, ఇంటర్ పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనపరిచిన విశ్వబ్రాహ్మణ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందచేయనున్నట్లు ఉమ్మడి ప్రకాశం జిల్లా విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు చెన్నుపల్లి శ్రీనివాసాచారి, విశ్వబ్రాహ్మణ విద్యాభివృద్ధి కమిటీ కన్వీనర్ అద్దంకి వెంకట అజయ్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 25న దర్శిలోని వెంకటేశ్వర కల్యాణ మండపంలో అవార్డుల ప్రదానం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ కే శ్రీనివాసులు, రాష్ట్ర బీసీ కమిషన్ మెంబర్ కుందుర్తి గురవాచారి, విద్యావేత్తలు తదితరులు పాల్గొంటారని పేర్కొన్నారు.

ఎండీయూ వాహనాల రద్దు తగదు : బుర్రా

కందుకూరు, మే 22 (ఆంధ్రజ్యోతి): ఇంటింటికి రేషన్ పంపిణీ చేసే ఎండీయూ వాహనాల రద్దు చేయడం తగదని మాజీ ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ అన్నారు. గురువారం పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి విలేకర్ల తో మాట్లాడారు. పేదల సంక్షేమాన్ని అడ్డుకునే ఉద్దేశ్యంతోనే రేషన్ సరఫరా వాహనాలను అడ్డుకుంటున్నారని ఆరోపించారు. ఇంటి వద్దనే రేషన్ బియ్యం సరఫరా కొనసాగించాలని, లేదంటే ఉపాధి కోల్పోయి రాష్ట్రవ్యాప్తంగా 10,000 ఎండీయూ వాహనదారులు రోడ్డున పడతారన్నారు. అంతేకాకుండా రేషనలైజేషన్ పేరుతో సచివాలయం వ్యవస్థను నిర్వీర్యం చేయాలని చూస్తుందని కూటమి ప్రభుత్వంపై ఆయన ఆరోపణలు చేశారు.

పండ్ల, పూలతోటల పెంపకంపై సమావేశాలు

కలిగిరి, మే 22(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం ద్వారా మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో ఆసక్తిగల రైతులకు పండ్ల, పూలతోటల పెంపకం, పొలంలో అభివృద్ధి పనులకు సంబధించి ఆయా గ్రామాల్లో సమావేశాలు నిర్వహిస్తామని ఎంపీడీవో ప్రత్యూష పేర్కొన్నారు. శుక్రవారం అనంతపురం, కావలిముస్తాపురం, వెలగపాడు, తూర్పుగుడ్లదొన, పడమరగుడ్లదొన, 24న ఎరుకల రెడ్డిపాలెం, 27న లక్ష్మీపురం, సిద్దనకొండూరు,పరికోట, 29న కుమ్మరకొండూరు, క్రాకుటూరు, 30న పెదకొండూరు, పోలంపాడు, 31న రావులకొల్లు, ఏపినాపి, జూన్3న చిన అన్నలూరు, తూర్పుదూబగుంట, 5న కృష్ణారెడ్డిపాలెం, 6న గంగిరెడ్డిపాలెం, తెల్లపాడు, 7న నాగసముద్రం, వీరనకొల్లు, జూన్10న కలిగిరి గ్రామాల్లో సదస్సులు నిర్వహిస్తామన్నారు. ఈ సమావేశాలకు సన్నచిన్నకారు రైతులు ఆధార్‌కార్డు, జాబ్‌కార్డ్, 1బి, అడంగల్‌కాపీలతో హాజరుకావాలని ఆమె తెలిపారు.

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5

తిరుపతి

జిల్లా వార్తలు

శుక్రవారం 23 మే 2025

ఆంధ్రజ్యోతి పాఠకులకు గమనిక

ఆంధ్రజ్యోతి కొత్త చందాదారులుగా చేరదలచుకున్న వారు అలాగే ప్రస్తుత చందాదారులకు పేపరు పంపిణీ విషయంలో ఎలాంటి సమస్యలు ఎదురైనా ఈ క్రింది ఫోన్ నెంబర్లకు సంప్రదించగలరు.

తిరుపతి, చంద్రగిరి, రేణిగుంట	: 99854 38368
చిత్తూరు, పూతలపట్టు, గంగాధర నెల్లూరు	: 99854 10940
పలమనేరు, కుప్పం, పుంగనూరు	: 97036 18724
మదనపల్లి, పీలేరు, తంబళ్లపల్లి	: 99854 22298
శ్రీకాళహస్తి, పుత్తూరు, నగరి, సత్యవేడు	: 99890 59755

'అక్షరమే అండగా.. సమస్యల పరిష్కారమే అజెండాగా' లక్ష్యమిదే

జీవకోన సభలో ఆంధ్రజ్యోతి డైరెక్టర్ వేమూరి ఆదిత్య



'అక్షరమే అండగా..' సభలో మాట్లాడుతున్న ఆంధ్రజ్యోతి డైరెక్టర్ వేమూరి ఆదిత్య, వేదికపై ఎమ్మెల్యే ఆరణి, కమిషనరు మౌర్య

ఇకపై నిరంతరం ప్రజలకోసం

'ఆంధ్రజ్యోతి' వేసిన పునాదిని కొనసాగిస్తాం

ప్రజల సమస్యలను తెలుసుకొని వాటిని పరిష్కరించే దిశగా ఆంధ్రజ్యోతి వేసిన పునాదిని భవిష్యత్తులోనూ కొనసాగిస్తాం. ఆంధ్రజ్యోతి చేపట్టిన అక్షరమే అండగా.. పరిష్కారమే అజెండాగా కార్యక్రమంలో ప్రజలు చెప్పిన సమస్యల్లో చాలావాటిని వంద రోజుల్లో పరిష్కరించాం. మిగిలిన వాటినీ పరిష్కరిస్తాం. కుక్కల బెడద ఎక్కువగా ఉందని కూడా స్థానికులు చెప్పారు. వాటికి వ్యాక్సిన్ వేయించి కట్టడి చేసేలా ఇప్పటికే చర్యలు చేపడుతున్నాం. లెప్రసీ కాలనీకి పేరు మార్చాలని కార్పొరేటర్‌తో పాటు కాలనీవాసులు కోరారు. ఆ విషయాన్ని కౌన్సిల్ మీటింగ్‌లో ప్రతిపాదించి జ్యోతి లెప్రసీ కాలనీకి జ్యోతి కాలనీగా పేరు మార్చేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నాం.

- ఎన్.మౌర్య, కార్పొరేషన్ కమిషనర్



'ఆంధ్రజ్యోతి'కి అభినందనలు

'అక్షరం అండగా.. పరిష్కారమే అజెండాగా..' వంద రోజుల కిందట జీవకోనలో 'ఆంధ్రజ్యోతి' నిర్వహించిన సదస్సులో ప్రజలు పలు సమస్యలను ప్రస్తావించారు. ఇప్పటికే మున్సిపాలిటీ, తుడా నిధులతో సీసీ రోడ్లు, తాగునీటి సమస్యను పరిష్కరించాం. గంజాయి బ్యాచ్, ఆకతాయిల ఆగడాలను అరికట్టేందుకు పోలీస్ అవుట్ పోస్టు ఏర్పాటు చేశాం. శ్మశాన వాటికకు ప్రహరీ, గేట్ల ఏర్పాటుకు రూ.10 లక్షలు మంజూరు చేశాం. శాశ్వత ఇంటి పట్టాల విషయమై రెవెన్యూ, ఫారెస్టు, టీటీడీ అధికారులతో మాట్లాడి పరిష్కారం చూపుతాం. నా విజయానికి పునాది వేసిన జీవకోన అభివృద్ధికి తప్పక కృషి చేస్తా. సమస్యలను మా దృష్టికి తీసుకొచ్చి.. పరిష్కారానికి కృషి చేసిన ఆంధ్రజ్యోతికి ప్రత్యేక అభినందనలు.

- ఆరణి శ్రీనివాసులు, తిరుపతి ఎమ్మెల్యే



తిరుపతి, మే 22 (ఆంధ్రజ్యోతి): 'ఇప్పటికే పత్రికాపరంగా ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు ఎంతగానో కృషి చేస్తున్నాం. అదే తరహాలో మరో అడుగు ముందుకు వేసి 'అక్షరమే అండగా.. పరిష్కారమే అజెండాగా' కార్యక్రమానికి పునాది వేశాం. ప్రజల దగ్గరకు వెళ్లి వారి సమస్యలను తెలుసుకొని వాటిని పరిష్కరించేందుకు మా వంతు కృషి చేస్తున్నాం. అందులో భాగంగా వంద రోజుల కిందట ఇదే జీవకోనలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రజలు వివరించిన అనేక సమస్యల్లో సగానికిపైగా పరిష్కారం లభించింది. మిగిలిన వాటినీ పూర్తిగా పరిష్కరించేందుకు మా వంతు కృషి చేస్తాం' అని 'ఆంధ్రజ్యోతి' డైరెక్టర్ వేమూరి ఆదిత్య అన్నారు. తిరుపతి నగరం జీవకోనలోని శ్రీలలితా త్రిపుర సుందరి ఆలయంలోని ఫంక్షన్ హాలులో గురువారం జరిగిన 'అక్షరమే అండగా సభ'లో అధికార ప్రముఖుల ప్రసంగాలు, ప్రజల స్పందన తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వేమూరి ఆదిత్య మాట్లాడుతూ.. ఇప్పటికే రూ.65 లక్షలతో అనేక సమస్యలకు పరిష్కారం చూపడంతో పాటు శాంతి భద్రతల రక్షణ కోసం పోలీసు అవుట్‌పోస్టు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సమస్యల పరిష్కారంలో ఇది మొదటి అడుగేనని, ఇదే తరహాలో ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలను పరిష్కరించే దిశగా కృషి చేస్తామని చెప్పారు. ఇందుకు సహకరించిన అధికారులకు, ప్రజా ప్రతినిధులకు, జీవకోన ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు అన్నా సంధ్య, అన్నా అనిత, ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ కుమారమ్మ, ఆంధ్రజ్యోతి అసిస్టెంట్ ఎడిటర్ ఆర్ఎం ఉమామహేశ్వరరావు, బ్రాంచ్ మేనేజర్ వి.సురేష్‌రెడ్డి, ఎడిషన్ ఇన్‌చార్జి వి.సుధాకరబాబు, ఏడీవీటీ మేనేజరు ఈశ్వరనాయుడు, ప్రొడక్షన్ ఇన్‌చార్జి మోహన్‌రావు, సర్క్యులేషన్ ఇన్‌చార్జి ఉమాపతి, బ్యూరో ఇన్‌చార్జి శివప్రసాద్, స్టాఫ్ రిపోర్టర్ పి.నరేంద్ర, ఏబీఎన్ స్టాఫర్ దినేష్, నగరపాలక సంస్థ ఎస్ఈ శ్యామ్ సుందర్, ఎంఈ గౌతమి, డీఈ రమణ, హెల్త్ ఆఫీసర్ యువఅన్వేష్, జనసేన నాయకులు నరసింహులు నాయుడు, రాజా రెడ్డి, బాబీ తదితరులు పాల్గొన్నారు.



భూమిపూజ.. ప్రారంభోత్సవాలు

జీవకోనకు చేరుకున్న వేమూరి ఆదిత్యకు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు పుష్పగుచ్ఛం ఇచ్చి ఘన స్వాగతం పలికారు. కమిషనర్ మౌర్య, కార్పొరేటర్లు అన్నా అనిత, అన్నా సంధ్యతో కలిసి సీసీ రోడ్డుకు భూమిపూజ చేశారు. అనంతరం ఎమ్మెల్యే సొంత నిధులతో ప్రారంభమైన ఆర్వో వాటర్ ప్లాంట్‌ను పరిశీలించారు. అంబేడ్కర్ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన పోలీస్ అవుట్ పోస్టును ప్రారంభించారు. జీవకోన పరిధిలో రూ.37.5 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును సభా కార్యక్రమం అనంతరం ప్రారంభించారు.



ఎర్రమిట్ట ఈస్ట్ మొదటి వీధిలోని సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న ఆంధ్రజ్యోతి డైరెక్టర్ ఆదిత్య

ఎమ్మెల్యే మాటతో ఎస్పీ చొరవ

జీవకోనలో పోలీస్ అవుట్ పోస్ట్ ఏర్పాటుచేస్తామన్న ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ఇచ్చిన హామీతో ఎస్పీ హర్షవర్ధన్‌రాజు చొరవతో అవుట్ పోస్ట్ ఏర్పాటుచేశారు. దీని ప్రారంభోత్సవంలో అతిథులతో పాటు అదనపు ఎస్పీ రవిమనోహరాచారి, డీఎస్పీ శ్రీలత, సీఐ రామకిషోర్, ఎస్ఐలు నాగార్జున రెడ్డి, లోకేశ్‌బాబు పాల్గొన్నారు.



అవుట్ పోస్టును ప్రారంభిస్తున్న ఏఎస్పీ రవిమనోహరాచారి

ఏపీ ఈఏపీసెట్ కేంద్రం పరిశీలన

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మే 22 (ఆంధ్రజ్యోతి): ఏపీ ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ (ఏపీ ఈఏపీసెట్)-2025 తిరుపతిలోని శ్రీరామా, ఎస్వీ ఇంజినీరింగ్ కాలేజీ కేంద్రాల్లో నిర్వహిస్తున్నారు. వాటిని ఎస్వీయూ వీసీ అప్పారావు పరిశీలించారు. పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయని తెలిపారు.



పరీక్షలను పర్యవేక్షిస్తున్న వీసీ అప్పారావు

సూళ్లూరు పేట 'అమృత్' రైల్వే స్టేషన్

- వర్చువల్‌గా ప్రారంభించిన ప్రధాని మోదీ

ప్రధాని కార్యక్రమం అనంతరం సూళ్లూరుపేట రైల్వేస్టేషన్‌ను ప్రారంభిస్తున్న కేంద్ర మంత్రి పెమ్మసాని, పక్కనే ఎమ్మెల్యే విజయశ్రీ, మాజీ ఎమ్మెల్సీ వాకాటి, కలెక్టర్ తదితరులు



సూళ్లూరుపేట, మే 22 (ఆంధ్రజ్యోతి): అటు షార్.. ఇటు శ్రీసిటీ.. మరోవైపు రాష్ట్ర సరిహద్దు. ఇంతటి కీలకమైన సూళ్లూరుపేటలో రైల్వే స్టేషన్‌ను 'అమృత్ భారత్' కింద ఆధునికీకరించారు. రూ.14.50 కోట్లతో కొత్త సొబగులతో, ప్రయాణికులకు అన్ని వసతులతో ఆధునికీకరించిన ఈ రైల్వే స్టేషన్‌ను గురువారం వర్చువల్‌గా ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రారంభించగా.. అనంతరం కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ నేరుగా ప్రారంభోత్సవం చేశారు. అంతకుముందు ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ, కలెక్టర్ వెంకటేశ్వర్, రైల్వే అధికారులతో కలిసి రైల్వే స్టేషన్‌ను పరిశీలించారు. చేసిన అభివృద్ధి పనులను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి పెమ్మసాని మాట్లాడతూ.. ఒకప్పుడు రైళ్లలో కూర్చోడానికి సీట్లు కూడా ఉండేవి కావని, రైల్వే స్టేషన్‌లో తాగునీరు వసతి కూడా ఉండేది కాదన్నారు. ఇప్పుడు ప్రయాణికులకు ఇబ్బందులు తలెత్తకుండా అన్ని సౌకర్యాలు ఉండాలనే ఉద్దేశంతోనే ప్రధాని మోదీ ప్రధాన కూడలి ప్రాంతాల్లో అవసరమైన చోట అమృత్ భారత్ పథకంతో రైల్వేస్టేషన్ల ఆధునికీకరణకు శ్రీకారం చుట్టారన్నారు. ఒకప్పుడు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మ్యాచింగ్ ఫండ్‌తో రైల్వేలో అభివృద్ధి పనులు జరిగేవని గుర్తుచేశారు. పలు రాష్ట్రాల ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా కేంద్ర ప్రభుత్వమే పూర్తి బాధ్యత తీసుకుంటోందన్నారు. ఒక తిరుపతి రైల్వేస్టేషన్‌కే రూ.300 కోట్లు కేటాయించినట్లు చెప్పారు. డబుల్ ఇంజిన్ సర్కార్‌తోనే రాష్ట్రం అభివృద్ధి చెందుతున్న దూరదృష్టితో చంద్రబాబునాయుడు బీజేపీతో కలిసి ముందుకెళ్లారన్నారు. ఈ నిర్ణయంతోనే రాష్ట్రానికి నేడు రూ.వేల కోట్లు వస్తున్నాయని తెలిపారు. కాగా, కేంద్ర మంత్రి, ఎమ్మెల్యే, రైల్వే అధికారులతో కలిసి రైల్వేస్టేషను పరిశీలించిన మున్సిపల్ చైర్మన్ దబ్బల శ్రీమంత్‌రెడ్డి.. ప్రారంభోత్సవ వేదికిపైకి తనను పిలవలేదని అలిగి వెళ్లిపోయారు. పట్టణ ప్రథమ పౌరుడైన తనను వేదిక పైకి ఆహ్వానించలేదని రైల్వే అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు.మళ్లీ పిలిచినా, తనకు అవమానం జరిగిందంటూ వెళ్లిపోయారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వాకాటి నారాయణ రెడ్డి, తిరుపతి పార్లమెంటు టీడీపీ అధ్యక్షుడు నరసింహయాదవ్, మాజీ మంత్రి పరసా వెంకటరత్నం, మాజీ ఎమ్మెల్యే నెలవల సుబ్రమణ్యం, ఆర్డీవో కిరణ్మయి, డీఆర్ఎం విశ్వనాథ్ తదితరులున్నారు.

సమస్యలకు పరిష్కారం చూపండి

- బయోఫ్యూయల్ పరిశ్రమ ఏర్పాటుపై ప్రజాభిప్రాయ సేకరణలో స్థానికుల డిమాండ్

పెళ్లకూరు, మే 22 (ఆంధ్రజ్యోతి): పరిశ్రమ ఏర్పాటుతో ఉత్పన్నమయ్యే సమస్యల పరిష్కారంపై ముందుగా తమకు స్పష్టత ఇవ్వాలని స్థానికులు డిమాండ్ చేశారు. పెళ్లకూరు మండలం పాలచ్చూరు గ్రామ రెవెన్యూ పరిధిలో దమ్ము బయోఫ్యూయల్ ప్రైవేట్ లిమిటెడ్ ఏర్పాటుకు సంబంధించి గురువారం ప్రజాభిప్రాయ సేకరణ జరిగింది. ఆర్డీవో కిరణ్మయి అధ్యక్షతన జరిగిన సమావేశంలో స్థానికులు తమ సందేహాలను వ్యక్తం చేశారు. ఉద్యోగ అవకాశాలపై స్పష్టమైన హామీ ఇవ్వాలని కోరారు. పరిశ్రమ ఏర్పాటు చేస్తే నీటి ఎద్దడితో పాటు రహదారి సౌకర్యం కోల్పోతామని దువ్వూరు సతీష్‌రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. వ్యర్థాలు భూగర్భజలాల్లో కలవకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలన్నారు.

భూములపై సమన్వయ లోపం : పరిశ్రమ భూములపై అధికారులకు యాజమాన్యానికి మధ్య కొంత సమన్వయం లోపించింది. తొలుత నాయుడుపేట మండలంలో భూములున్నట్లు చూపారు. తర్వాత తేరుకుని పెళ్లకూరు తహసీల్దార్ ద్వారకానాథ్‌రెడ్డికి తెలియజేశారు. ఆలస్యంగా తెలియడంతో 20 శాతం మంది గ్రామస్థులు మాత్రమే హాజరయ్యారు. మూడు గంటల ఆలస్యంగా జరిగిన సమావేశంలో కనీసం తాగునీటి వసతి కూడా కల్పించక స్థానికులు ఇబ్బందులు పడ్డారు. అంతకుముందు పరిశ్రమ ప్రతినిధులు మాట్లాడుతూ 22.49 ఎకరాల్లో రూ.229.82 కోట్లతో 6.0 మెగావాట్ల విద్యుత్ ప్లాంట్‌తో కూడిన ధాన్య ఆధారిత డిస్టలరీని ఏర్పాటు చేయనున్నామన్నారు. దీనివల్ల ప్రత్యక్షంగా 200 మందికి, పరోక్షంగా 250 మందికి ఉద్యోగ అవకాశాలు లభిస్తాయన్నారు. కార్యక్రమంలో పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈ రాజశేఖర్, సీఐ సంగమేశ్వరరావు, ఎస్ఐ నాగరాజు తదితరులు ఉన్నారు.

నేటి నుంచి సీపీఎల్ 1 ప్రారంభం

- ఎస్వీయూ మైదానంలో ఏర్పాట్లు పూర్తి

చిత్తూరు ప్రీమియర్ లీగ్(సీపీఎల్ సీజన్ 1)ను శుక్రవారం నుంచి ప్రారంభించనున్నట్లు సీడీసీఏ అధ్యక్షుడు విజయ్‌కుమార్ తెలిపారు. కలెక్టర్ వెంకటేశ్వర్ చేతుల మీదుగా పోటీలను ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. దీనికి సంబంధించి ఎస్వీయూ మైదానంలో ఏర్పాట్లు పూర్తి చేసినట్లు పేర్కొన్నారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ పోటీలను ఆరు కెమెరాలతో ప్రత్యక్ష ప్రసారం చేస్తామని తెలిపారు.
ఐదు జట్లు, 13మ్యాచ్‌లు, ఏడు రోజుల పాటు టోర్నీ జరుగుతుందని వివరించారు. విజేత జట్టుకు రూ.2లక్షలు, రన్నర్స్‌కు రూ.లక్ష, మూడవ స్థానం జట్టుకు రూ.50వేలు నగదు బహుమతి ఉంటుందని వెల్లడించారు. ప్రతి మ్యాచ్‌లోనూ మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్, ఓవరాల్ టోర్నీకి మ్యాన్ ఆఫ్ ది సిరీస్, బెస్ట్ బౌలర్, బ్యాట్స్‌మెన్, ఫీల్డర్లకు అవార్డు ప్రదానం చేస్తామన్నారు.

- తిరుపతి(క్రీడలు), ఆంధ్రజ్యోతి



రెవిన్యూలో బదిలీలకు శ్రీకారం

- అన్ని క్యాడర్లలోనూ స్థానచలనం
- నోడల్ అధికారిగా చిత్తూరు కలెక్టర్

చిత్తూరు కలెక్టరేట్, మే 22 (ఆంధ్రజ్యోతి): రెవిన్యూశాఖలో బదిలీలకు ప్రత్యేక మార్గదర్శకాలు జారీ అయ్యాయి. ఉమ్మడి చిత్తూరు జిల్లాస్థాయిలో జరుగనున్న ఈ బదిలీలకు కలెక్టర్ సుమిత్ కుమార్ నోడల్ అధికారిగా వ్యవహరిస్తారు. తిరుపతి జిల్లా కలెక్టరు సభ్యుడిగా, చిత్తూరు డీఆర్వో మోహన్‌కుమార్ కన్వీనర్‌గా బదిలీల కమిటీకి నాయకత్వం వహిస్తారు.తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లు, సీనియర్ అసిస్టెంట్లు, ఆర్ఐలు, జూనియర్ అసిస్టెంట్లు, టైపిస్టులు, వీఆర్వో గ్రేడ్-1, గ్రేడ్-2లకు బదిలీలుంటాయి. ఉమ్మడి జిల్లాస్థాయిలో జరిగే వాటిని కలెక్టరేట్లకు మాత్రమే బదలాయిస్తారు.బదిలీ ప్రాంతంలో కలెక్టరేట్‌కు రిపోర్టు చేసుకున్న తర్వాత అక్కడి కలెక్టర్ మండలాల్లో పోస్టింగ్ ఇస్తారు. ప్రస్తుతం తిరుపతితో పోలిస్తే చిత్తూరు జిల్లాలోనే ఎక్కువగా తహసీల్దార్ల పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

- చిత్తూరు జిల్లా స్థాయిలో చైర్మన్‌గా కలెక్టర్

చిత్తూరు జిల్లాస్థాయిలో బదిలీల కమిటీకి చైర్మన్‌గా కలెక్టర్ సుమిత్‌కుమార్, సభ్యురాలిగా జేసీ విద్యాధరి, కన్వీనర్‌గా డీఆర్వో మోహన్ కుమార్ వ్యవహరిస్తారు. వీరి ఆధ్వర్యంలో జిల్లాస్థాయిలోనే తహసీల్దార్లు, వీఆర్వో గ్రేడ్-1, గ్రేడ్-2 అధికారులు, ఉద్యోగులకు పోస్టింగ్స్ ఇస్తారు.కొన్ని క్యాడర్లకు జేసీ విద్యాధరి చైర్మన్‌గా, డీఆర్వో మోహన్‌కుమార్, కలెక్టరేట్ ఏవో కులశేఖర్ సభ్యులుగా ఉంటారు. ఈ కమిటీ ఆధ్వర్యంలో డిప్యూటీ తహసీల్దార్, సీనియర్ అసిస్టెంట్, ఎంఆర్ఐ, జూనియర్ అసిస్టెంట్, టైపిస్టులకు పోస్టింగ్ ఇస్తారు.ఈనెల 28వ తేదీ లోగా ఉద్యోగుల నుంచి దరఖాస్తులు స్వీకరించి జూన్ 2వ తేదీ లోపు బదిలీల ప్రక్రియను పూర్తిచేయాల్సివుంది.

2వ తేదీలోగా బదిలీల ప్రక్రియ పూర్తి

బదిలీలకు సంబంధించి ఉద్యోగులనుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నాం. ఉద్యోగి హోదా, పనిచేస్తున్న జిల్లా, ఎంతకాలం నుంచి పనిచేస్తున్నారు, ఎక్కడికి బదిలీ కోరుకుంటున్నారు,ఐదేళ్లలోపు సర్వీసు ఉన్నవారు బదిలీ కోరుకుంటే కారణాలు, క్రమశిక్షణ చర్యలకు సంబంధించిన కేసులను పేర్కొంటూ జాబితా తయారుచేయాలి. ప్రభుత్వ ఉత్తర్వులను అనుసరించి జూన్‌నెల 2వ తేదీలోగా బదిలీల ప్రక్రియను పూర్తిచేస్తాం. తాజా మార్గదర్శకాలతో కలెక్టరేట్‌లో బదిలీల కసరత్తు ప్రారంభించాం.

- మోహన్‌కుమార్, చిత్తూరు డీఆర్వో

SRI PADMAVATI MAHILA VISVAVIDYALAYAM, TIRUPATI
(WOMEN'S UNIVERSITY) TIRUPATI -517502

E-TENDER NOTICE

(NIT): NO.8/SPMVV/ACADEMIC/G2/2025-2026 DATED: 22-05-2025.

SHORT TENDER NOTICE

E-tenders are invited from reputed firms for the following Stationery items to Sri Padmavati Mahila Visvavidyalayam (Women's University) Tirupati. The Information regarding detailed specifications, terms and conditions may be obtained from the website **www.apeprocurement.gov.in** and in the University website: **www.spmvv.ac.in**

The details of items: Stationery items:

Bid document down loading start date	: 24-05-2025 at 3.00 P.m.,
Bid document down loading end date	: 11-06-2025 at 3.30 P.m.,
Last date & time for receipt of bids	: 11-06-2025 at 4.00 P.m.

Sd/- **REGISTRAR**

ఘనంగా హనుమజ్జయంతి వేడుకలు



ప్రసన్నాంజనేయ విగ్రహం వద్ద ప్రసాదాలు పంపిణీ చేస్తున్న అదనపు ఈవో వెంకయ్య చౌదరి


హనుమజ్జయంతి సందర్భంగా గురువారం తిరుమలలోని బేడి ఆంజనేయస్వామి ఆలయంలో, మొదటిఘాట్‌రోడ్డులోని ఏడోమైలు ప్రసన్న ఆంజనేయస్వామి విగ్రహం వద్ద టీటీడీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించించారు. బేడి ఆంజనేయస్వామికి అభిషేకం ప్రత్యేక పూజలు నిర్వహించింది. మధ్యాహ్నం ప్రసన్న ఆంజనేయ స్వామి ప్రిగహం వద్ద వేద మంత్రోచ్చరణలు, మేళతాళాల నడుమ ప్రత్యేక పూజలు, ఆస్థానం నిర్వహించారు. భక్తులకు అన్నప్రసాదాల పంపిణీ చేశారు. కార్యక్రమాల్లో టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు, అదనపు ఈవో వెంకయ్య చౌదరి తదితరులు పాల్గొన్నారు. జపాలి ఆంజనేయస్వామికి టీటీడీ తరుపున ఛైర్మన్ బీఆర్ నాయుడు పట్టువస్త్రాలు సమర్పించారు. పూజల అనంతరం అర్చకులు సింధూర వస్త్రంతో ఛైర్మన్‌ను సత్కరించారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి



జపాలి ఆంజనేయస్వామికి పట్టువస్త్రాలను తీసుకువస్తున్న బీఆర్ నాయుడు

శ్రీవారి సర్వదర్శనానికి 14 గంటలు



తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 14 గంటల సమయం పడుతోంది. గురువారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్-2 లోని 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలోని 9 షెడ్లు సర్వదర్శన భక్తులతో నిండిపోయాయి. క్యూలైన్ కృష్ణతేజ సర్కిల్ వరకు వ్యాపించింది. వైకుంఠం క్యూకాంప్లెక్స్-1లో 5 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

- మంగళవారం హుండీ ఆదాయం: రూ.4.24 కోట్లు
- బుధవారం దర్శించుకున్న భక్తులు: 80,964
- తలనీలాలు సమర్పించినవారు: 32,125

సత్యవేడు శాసనసభ్యుడు కోనేటి ఆదిమూలం రాజకీయ భవిష్యత్తు త్రిశంకు స్వర్గంలోనే ఉంది. ఎమ్మెల్యేగా కొనసాగుతున్న ఆయన మీద టీడీపీ సస్పెన్షన్ మాత్రం గత సెప్టెంబరు నుంచీ కొనసాగుతోంది. ఇటీవలే పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ సత్యవేడు పర్యటనతో అటోఇటో తేలిపోతుందని అందరూ అనుకున్నా.. అటువంటిదేమీ జరగలేదు. నియోజకవర్గంలోని టీడీపీ శ్రేణులు మాత్రం దిక్కుతోచని స్థితిలోనే ఉన్నారు.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

సత్యవేడు టీడీపీ నాయకుడెవరు?



- అయోమయంలో ఆదిమూలం భవితవ్యం
- సస్పెన్షన్‌లోనే ఎమ్మెల్యే
- స్పష్టత ఇవ్వని నారా లోకేశ్
- దిక్కుతోచని స్థితిలో టీడీపీ శ్రేణులు

ఆది నుంచీ వివాదాలు

వ్యక్తిత్వపరంగా ఎలాంటి లౌక్యం తెలియని రాజకీయ నాయకుడిగా సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలానికి పేరుంది. దాపరికం లేకుండా ముక్కుసూటిగా మాట్లాడే అలవాటుకు తోడు ఆవేశపరుడన్న ముద్ర ఉంది. వీటన్నిటికీ మించి ఎవరినీ లెక్కచేయరని సత్యవేడు రాజకీయాల్లో ఆయన గురించి తెలిసిన వారు చెబుతుంటారు. వీటి కారణంగా ఆయన గత వైసీపీ ప్రభుత్వంలో కూడా సొంత పార్టీ నేతల నుంచీ వ్యతిరేకత ఎదుర్కొన్నారు. మరోవైపు కుటుంబ సభ్యుల్లో ఒకరి దూకుడు ఆయనకు మరిన్ని చిక్కులు తెచ్చి పెట్టాయి. గత ఎన్నికల్లో తొలుత వైసీపీ అధిష్ఠానం సత్యవేడు అసెంబ్లీ టికెట్ నిరాకరించినా ప్రత్యామ్నాయంగా తిరుపతి ఎంపీ టికెట్ ప్రకటించింది. తర్వాత నిర్ణయం మార్చుకుని సత్యవేడు టికెట్‌నే ఖరారు చేసింది. అయితే పార్టీ అధిష్ఠానం తీరుతో తీవ్ర మనస్తాపానికి లోనైన ఆయన ఏకంగా పార్టీపైనే తిరుగుబాటు చేశారు. తన నియోజకవర్గంలో అక్రమాలకు మంత్రి పెద్దిరెడ్డే కారణమని బహిరంగ ఆరోపణలు చేశారు. ఆయనను నేరుగా సవాల్ చేశారు. ఆపై టీడీపీలో చేరి అసెంబ్లీ టికెట్ తెచ్చుకున్నారు. దీంతో ఆయన పట్ల సత్యవేడులోనే కాకుండా జిల్లావ్యాప్తంగా కూడా సానుభూతి వ్యక్తమైంది. పెద్దిరెడ్డిని ఎదిరించిన తీరు కూడా పార్టీలకు అతీతంగా పలువురికి నచ్చింది. టీడీపీ ప్రభంజనం కలసిరావడంతో ఆయన ఎమ్మెల్యేగా గెలిచారు.

గెలిచిన ఆనందం అంతలోనే ఆవిరైన వైనం

సత్యవేడు ఎమ్మెల్యేగా రెండవ సారి గెలిచిన ఆనందం ఆదిమూలానికి ఎక్కువ రోజులు మిగల్లేదు. గతేడాది సెప్టెంబరులో ఆయన ఓ వివాదంలో చిక్కుకున్నారు. నియోజకవర్గంలో సొంత పార్టీకే చెందిన ఓ మహిళా నాయకురాలు ఆయనపై లైంగిక వేధింపుల ఆరోపణలు చేసి, పోలీసులకు కూడా ఫిర్యాదు చేసారు. రాష్ట్రవ్యాప్తంగా ఆ ఘటన సంచలనం సృష్టించింది. ఆయనపై క్రిమినల్ కేసు నమోదైంది. దానిపై ఆయన కేసు కొట్టివేయాలని హైకోర్టులో క్వాష్ పిటిషన్ వేశారు. అయితే ఫిర్యాదు చేసిన మహిళ అనూహ్యంగా హైకోర్టుకు వెళ్లి తన ఫిర్యాదు వెనక్కి తీసుకుంటానని అభ్యర్థించడంతో ఆ వివాదం అంతటితో ముగిసింది. ఈలోపు పార్టీ ప్రతిష్ఠ దెబ్బతిన్న కారణంగా టీడీపీ అధిష్ఠానం ఆయనను పార్టీ నుంచీ సస్పెండ్ చేసింది. కేసు రాజీ పడినందున సస్పెన్షన్ ఎత్తివేస్తారని పార్టీ శ్రేణులు భావించినా సుమారు ఎనిమిది నెలలుగా అధిష్ఠానం దీనిపై దృష్టి సారించలేదు. ఈ ఎనిమిది నెలల్లో నియోజకవర్గంలో పార్టీ పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. పనుల కోసం ఎన్నికల నాటి పరిశీలకుడు చంద్రశేఖర్ నాయుడు, తర్వాత నియమితులైన శ్రీపతి బాబులను కలవాలో, సస్పెన్షన్‌లో ఉన్న ఎమ్మెల్యేను కలవాలో అర్థంకాని పరిస్థితిలో కేడర్ ఉన్నారు. మరోవైపు మాజీ ఎమ్మెల్యే హేమలత కూడా నియోజకవర్గంలో కనిపిస్తున్నారు.

తొలగని అస్పష్టత

లోకేశ్ పర్యటన సమయంలో నియోజకవర్గానికి పూర్తిస్థాయి కో ఆర్డినేటర్ లేదా ఇంచార్జిని ప్రకటించడమో చేస్తారని భావించారు. నాయకుడెవరో స్పష్టతనిస్తే తమ సమస్యలు చెప్పుకోవడానికి, పనులు చేసుకోవడానికి వీలు కలుగుతుందని కార్యకర్తలు అనుకున్నారు. అయితే యువనేత ఈ అంశంపై ఏమాత్రం దృష్టి పెట్టలేదు. సమస్యలుంటే ఇద్దరు పరిశీలకుల దృష్టికి తీసుకెళ్ళాలని, లేదంటే జిల్లా ఇంచార్జి మంత్రికి,పార్టీ రాష్ట్ర అధ్యక్షుడికి చెప్పాలని సూచించి వెళ్లిపోయారు. దీంతో ఎమ్మెల్యేపై సస్పెన్షన్ ఇప్పట్లో ఎత్తివేసే పరిస్థితి లేదని, అదే సమయంలో ఎవరినీ ఇంచార్జిగా నియమించే పరిస్థితి కూడా లేదని పార్టీ శ్రేణులు భావిస్తున్నాయి. పార్టీ నియమించిన పరిశీలకులకు నియోజకవర్గంపై చెప్పుకోదగ్గ పట్టు లేదు. అధికారులు, ఉద్యోగులపై పట్టు అంతకన్నా లేదు. ఇంచార్జి మంత్రి అందుబాటులో వుండరు. దీంతో సమస్యలు ఎవరికి చెప్పుకోవాలో? పనులకు ఎవరిని ఆశ్రయించాలో? నామినేటెడ్ పదవులకు ఎవరు సిఫారసు చేస్తారో? తెలియక పార్టీ శ్రేణులు, ఆశావహులు గందరగోళంలో పడుతున్నారు.

చిత్తూరు చిన్నబోతోంది!

- నగరి నియోజకవర్గంలోని మూడు మండలాలు కూడా తిరుపతి జిల్లాలోకి?
- భవిష్యత్తులో మిగిలేది 22 మండలాలే

చిత్తూరు, మే 22 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వం చేపట్టిన జిల్లాల విభజనతో విద్య, వైద్య, పారిశ్రామిక, పర్యాటక ప్రాంతాలను కోల్పోయి చిత్తూరు అనాథగా మిగిలింది. ఇప్పుడు ప్రజల అభ్యర్థనలు, పరిపాలనా సౌలభ్యం పేర్లతో కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో చిత్తూరు మరింత చిన్నబోయేలా ఉంది.ఇటీవల జరిగిన మంత్రి మండలి సమావేశంలో జిల్లాల పునర్వ్యవస్థీకరణ కోసం మంత్రివర్గ సబ్ కమిటీని నియమించారు. అప్పుడే పుంగనూరు నియోజకవర్గంలోని ఆరు మండలాలను మదనపల్లె రెవెన్యూ సబ్ డివిజన్‌లోకి మార్చేందుకు రెవెన్యూ శాఖ ప్రాథమిక నోటిఫికేషన్ ఇవ్వాలని క్యాబినెట్ తీర్మానించింది. ఇందుకు అనుగుణంగా ఆయా మండలాలను మారుస్తున్నట్లు ప్రాథమిక నోటిఫికేషన్ ఇవ్వాలని గురువారం చిత్తూరు, అన్నమయ్య జిల్లాల కలెక్టర్లను ప్రభుత్వం ఆదేశించింది.దీనిపై విస్తృతంగా ప్రచారం చేసి, ప్రజల నుంచి అభ్యంతరాలు స్వీకరించాలని ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొంది. పుంగనూరులోని ఆరు మండలాలు అన్నమయ్య జిల్లాలోని మదనపల్లె రెవెన్యూ డివిజన్‌లో కలిపేస్తే ఇక చిత్తూరులో 25 మండలాలే ఉంటాయి.అలాగే జిల్లాల విభజన సమయంలో నగరి నియోజకవర్గంలోని రెండు మండలాలు తిరుపతిలో, మూడు చిత్తూరులో కలిపారు. కానీ ఎన్నికల సమయంలో చిత్తూరులో ఉన్న నగరి, నిండ్ర, విజయపురం మండలాలను కూడా తిరుపతి జిల్లాలోనే కలిపేస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారు. దీనికి అనుగుణంగా గురువారం చిత్తూరులో జరిగిన జిల్లా స్థాయి మహానాడులో నగరి ఎమ్మెల్యే భానుప్రకాష్ మాట్లాడుతూ- 'త్వరలో ఆ మూడు మండలాలను తిరుపతిలో కలిపేస్తున్నాం' అని చెప్పారు.జిల్లాల పునర్వ్యవస్థీకరణ కోసం మంత్రివర్గ ఉప సంఘాన్ని ఏర్పాటు చేసిన నేపథ్యంలో ఎమ్మెల్యే చెప్పిన మాటలు అమలయ్యే సూచనలే ఎక్కువగా కనిపిస్తున్నాయి. నగరిలోని ఆ మూడు మండలాలు తిరుపతిలో కలిసిపోతే, ఇక చిత్తూరు జిల్లాకు 22 మండలాలే మిగులుతాయి.

శ్రీవారి సేవలో నిమ్మగడ్డ రమేష్‌కుమార్



తిరుమల, మే22(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మాజీ ఎన్నికల అధికారి నిమ్మగడ్డ రమేష్‌కుమార్ గురువారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో ఆలయంలోకి వెళ్లిన ఆయన ముందుగా ధ్వజస్తంభానికి మొక్కుకుని తర్వాత గర్భాలయంలోని మూలమూర్తిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయంలోని రంగనాయక మండపానికి చేరుకున్న రమేష్‌కుమార్‌కు వేదపండుతులు ఆశీర్వచనం చేయగా అధికారులు లడ్డూప్రసాదాలు అందజేశారు.

తిరుపతి బాలిక గిన్నిస్ రికార్డు



తిరుపతి అర్బన్, మే 22(ఆంధ్రజ్యోతి): తిరుపతి ఎల్బీనగర్‌కు చెందిన ఆరవ కీర్తన గిన్నిస్ వరల్డ్ రికార్డ్ సాధించింది. గత ఏడాది డిసెంబర్ 1న హలెల్ మ్యూజిక్ స్కూల్ ఫౌండర్ ఆగస్టిన్ ఆధ్వర్యంలో 18 దేశాల నుంచి 1,500మంది బాలబాలికలు గంటపాటు ఎలక్ట్రిక్ కీబోర్డ్ ప్లే చేసి గిన్నిస్ రికార్డు కోసం ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేశారు. కీర్తన అంతరాయం లేకుండా ఎలక్ట్రిక్ కీబోర్డ్ ప్లే చేసి గిన్నిస్ రికార్డుకు ఎంపికైనట్లు గిన్నిస్ వరల్డ్ రికార్డు టీమ్ సభ్యుడు రిచర్డ్(యూకే) గత ఏడాది డిసెంబర్ 14న ప్రకటించారు. విజయవాడకు చెందిన హలెల్ మ్యూజిక్ స్కూల్ ఫౌండర్ ఆగస్టిన్ ఏప్రిల్ 14న కీర్తనకు సర్టిఫికెట్, సిల్వర్‌మెడల్ ప్రదానం చేశారు. ఆ బాలికను, తల్లిదండ్రులు విజయబాబు, శైలజలను పలువురు అభినందించారు.

వెట్టికి బలైన బాలుడి కేసులో

ముగ్గురికి రిమాండ్



నిందితులను మీడియాకు చూపిస్తున్న పోలీసులు

సత్యవేడు, మే 22 (ఆంధ్రజ్యోతి): తొమ్మిదేళ్ల గిరిజన బాలుడితో వెట్టి చాకిరి చేయించుకుని, అతడి మృతికి కారణమైన ఘటనలో ముగ్గురిని పోలీసులు రిమాండ్‌కు తరలించారు. సత్యవేడు సీఐ కార్యాలయంలో గురువారం ఈ వివరాలను పుత్తూరు డీఎస్పీ రవికుమార్ మీడియాకు వెల్లడించారు. ఆ ప్రకారం.. గూడూరు మండలం చవటపాళెం గిరిజన కాలనీకి చెందిన చెంచయ్య భార్య అంకమ్మ తన ముగ్గురు పిల్లలు, ప్రియుడితో కలిసి రెండేళ్ల కిందట సత్యవేడుకు వలసొచ్చారు. దళవాయి అగ్రహారంలోని ముత్తు వద్ద నెలకు రూ.10 వేల జీతానికి బాతులు మేపుతున్నారు. ఏడాది కింద చెంచయ్య మృతి చెందడంతో ఆమె చవటపాళెం వెళ్లారు. కర్మక్రియల అనంతరం అంకమ్మ సత్యవేడుకు వస్తుండగా.. అదే గ్రామానికి చెందిన సతీష్‌కు ఆమె రూ.25 వేల అప్పు ఉండడంతో, అతడు అడ్డుకున్నాడు. ఈ విషయం తెలిసి బాతుల వ్యాపారి ముత్తు చవటపాళెం వెళ్లి ఆ మొత్తాన్ని చెల్లించి అంకమ్మను సత్యవేడుకు తీసుకొచ్చి పనిలో పెట్టుకున్నాడు. అంకమ్మ, ఆమె పిల్లల చేత ముత్తు కుటుంబీకులు ఎక్కువ పనులు చేయించుకునే వారు. జీతం మాత్రం పెంచేవారు కాదు. దీంతో ఆమె పది నెలల క్రితం వెళ్లిపోతామని చెప్పడంతో, తన బాకీ రూ.42 వేలు చెల్లించాలని ముత్తు పట్టుబడ్డాడు. పది రోజుల్లో బాకీ చెల్లిస్తానంటే.. అప్పటి వరకు పిల్లాడిని (వెంకటేశులును) వదిలి వెళ్లాలని చెప్పాడు. దీంతో ముత్తు వద్ద ఉండిపోయిన వెంకటేశ్వర్లు బాతులు మేపే క్రమంలో ఆ బాలుడిని కంచికి తీసుకెళ్లాడు. అక్కడ ఏప్రిల్ 11న బాలుడు అనారోగ్యానికి గురికాగా ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో ముత్తు చేర్పించాడు. చికిత్స పొందుతూ 12వ తేదీ మృతి చెందాడు. ఈ విషయాన్ని ముత్తు తన భార్య ధనభాగ్యం, కుమారుడు రాజశేఖర్‌కు చెప్పాడు. వారు కంచికి వెళ్లి బాలుడి మృతదేహాన్ని పాలారు నది ఒడ్డున పూడ్చి పెట్టేశారు. ఈ విషయాన్ని అంకమ్మకు చెప్పలేదు. నెలగా కుమారుడు ఫోన్ చేయకపోవడంతో 20 రోజుల క్రితం అంకమ్మ సత్యవేడుకు వచ్చి ముత్తును అడిగింది. కంచి పరిసర ప్రాంతాలలో బాతులు మేపేందుకు వెళ్లగా వెంకటేశ్వర్లు తప్పిపోయాడని, వెతికి తీసుకొస్తామని ఆమెను పంపించేశాడు. మళ్లీ ఈ నెల 15వ తేదీన వచ్చి బాకీ చెల్లించేస్తానని, తన బిడ్డను అప్పజెప్పాలని వేడుకుంది. ఇంకా పిల్లాడు దొరకలేదని చెప్పడంత ఆమె గట్టిగా నిలదీసింది. ముత్తు, అతడి భార్య ధనభాగ్యం, కుమారుడు రాజశేఖర్ కలిసి అంకమ్మను కులం పేరుతో దూషించి బయటకు గెంటేశారు. దీనిపై ఈనెల 19వ తేదీన ఆమె సత్యవేడు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఎస్ఐ రామస్వామి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పుత్తూరు డీఎస్పీ రవికుమార్ సత్యవేడుకు చేరుకుని విచారణ చేపట్టి, ముత్తుతో పాటు ఆయన కుటుంబ సభ్యులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీతో పాటు వెట్టిచాకిరి కేసులను నమోదు చేశారు. వారిని అదుపులోకి తీసుకుని విచారించడంతో అసలు విషయం బయటపడింది. పుత్తూరు డీఎస్పీ రవికుమార్ ఆధ్వర్యంలో సీఐ మురళి, వరదయ్యపాళెం, పిచ్చాటూరు ఎస్ఐలు మల్లికార్జున, వెంకటరమణ, సిబ్బంది మంగళవారం కంచికి వెళ్లి.. తమిళనాడు పోలీసుల సాయంతో బాలుడి మృతదేహం కోసం గాలించారు. బుధవారం సాయంత్రం గుర్తించి మృతదేహాన్ని వెలికి తీశారు. కంచి తాలూకా మెజిస్ట్రేట్ రఫీక్ ఆధ్వర్యంలో బాలుడి తల్లి అంకమ్మ సమక్షంలో శవానికి పంచనామా నిర్వహించి, పోస్టుమార్టం నిమిత్తం చెంగల్పట్టు మెడికల్ కాలేజీకి తరలించినట్లు డీఎస్పీ రవికుమార్ తెలిపారు.

కష్టంగా ఉందమ్మా.. నన్ను తీసుకెళ్లమ్మా

బాతులు మేపే క్రమంలో బాలుడు వెంకటేశులును యజమాని ముత్తు చాలా హింసించేవాడని తెలిసింది. ముత్తు దగ్గర ఉన్న వెయ్యి బాతులను ఆ పసిపిల్లాడు ఒక్కడే మేపేవాడని, అతడితో విపరీతమైన పని చేయించుకునేవాడని తెలిసింది. ఈ క్రమంలో బాలుడిని ఎక్కడికి పోనివ్వకుండా పారిపోతే చంపేస్తా, కేసు పెట్టి జైలులో వేస్తానంటూ బెదిరిస్తూ కర్కశంగా వ్యవహరించే వాడని తెలిసింది. వెంకటేశులు తల్లికి ఫోన్ చేసినప్పుడల్లా ఇదే విషయం తల్లితో చెప్పి ఏడ్చేవాడని పోలీసుల విచారణలో కనుగొన్నారు. డబ్బులు కుదరలేదని, డబ్బులు వచ్చిన వెంటనే వచ్చి విడిపించుకుని వెళతానని తల్లి అంకమ్మ బాలుడికి నచ్చచెప్పేదని తెలిసింది.

టీడీపీ శ్రేణులకు అండగా..!

- గత కార్పొరేషన్ ఎన్నికల్లో తలపడ్డ వారికే మళ్లీ అవకాశం
- తిరుపతిని ఫ్లెక్సీ, ప్లాస్టిక్ ఫ్రీ సిటీగా మారుస్తాం
- మినీ మహానాడులో తీర్మానాలు



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ

తిరుపతి, మే 22 (ఆంధ్రజ్యోతి): వైసీపీ అరాచకాలకు ఎదురొడ్డి గత కార్పొరేషన్ ఎన్నికల్లో పోటీచేసిన 23 మంది కార్పొరేట్ అభ్యర్థులకే తిరిగి అవకాశం ఇవ్వాలని తిరుపతిలో గురువారం జరిగిన మినీ మహానాడులో తీర్మానించారు. ఈ సమావేశంలో నియోజకవర్గ టీడీపీ ఇంచార్జి, ఏపీసీబీసీ ఛైర్‌పర్సన్ సుగుణమ్మ మాట్లాడుతూ.. గత ఐదేళ్లు పార్టీకోసం కష్టపడి పనిచేసిన వారికి ఎట్టి పరిస్థితుల్లోనూ అన్యాయం జరగదని చెప్పారు. కాస్త ఆలస్యమైనా పార్టీ కేడర్‌కు ఇబ్బందిలేకుండా చూసుకుంటామన్నారు. ప్రభుత్వ రంగసంస్థల్లోని కాంట్రాక్టు పనుల్లో పార్టీ నాయకుల్లో ప్రాధాన్యత, పార్టీ నాయకుల కుటుంబ సభ్యులకు వివిధ సంస్థల్లో అర్హతను బట్టి ఉద్యోగ భద్రత కల్పించాలని నిర్ణయించారు. తిరుపతి నగరాన్ని బ్యానర్ ఫ్రీ, ప్లాస్టిక్‌రహిత నగరంగా ఉంచాలని రాబోయే రోజుల్లో మరిన్ని మొక్కలునాటి సుందరంగా తీర్చిదిద్దాలన్న సుగుణమ్మ ప్రతిపాదనతో తీర్మానం చేశారు. ఈనెల 27 నుంచి కడపలో జరగనున్న మహానాడుకు భారీగా తరలి వెళ్లాలని నిర్ణయం తీసుకున్నారు. టీడీపీ నాయకులు మల్లవరం స్వాతి, ఎం.లక్ష్మీదేవమ్మ, వసంతమ్మ, 17వ డివిజన్ ప్రధాన కార్యదర్శి హేమావతి భర్త శివయ్య, ఎమ్మార్‌పల్లి నాగేంద్రబాబు కుమారుడు చేతన్ మృతిపట్ల సంతాపం ప్రకటించారు. ఈ కార్యక్రమంలో తిరుపతి పార్లమెంట్ అధ్యక్షుడు నరసింహ యాదవ్, డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ, నాయకులు బి.వి.కీర్తి, మబ్బు దేవనారాయణ రెడి, రుద్రకోటి సదాశివం, ఊకా విజయకుమార్, జేబీ శ్రీనివాస్, డాక్టర్ కోడూరు బాలసుబ్రమణ్యం, పులుగోరు మురళీకృష్ణ రెడ్డి, శ్రీధర్ వర్మ, దంపూరి భాస్కర్, నూరా సుధాకర్ రెడ్డి, బుల్లెట్ రమణ, చినబాబు, మహేష్ యాదవ్, ఊట్ల సురేంద్ర నాయుడు, బీజీ కృష్ణయాదవ్, పుష్పావతి, బ్యాంక్ శాంతమ్మ, కుమారమ్మ, కరాటే చంద్ర, మునిశేఖర్ రాయల్, సుబ్బు యాదవ్, రేవతి, సూర్యకుమారి, రాజారం, విశ్వనాథం తదితరులు పాల్గొన్నారు.

పూర్ణ-తిరుపతి ప్రత్యేక రైలుకు అదనపు బోగీలు

తిరుపతి(సెంట్రల్), మే 22(ఆంధ్రజ్యోతి): వేసవి రద్దీ కారణంగా పూర్ణ-తిరుపతి మధ్య నడుస్తున్న ప్రత్యేక రైళ్ల(07609-07610)కు జూలై ఒకటో తేదీ వరకు మూడు అదనపు కోచ్‌లను ఏర్పాటు చేసినట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్‌వో శ్రీధర్ ఒక ప్రకటనలో తెలిపారు. 2ఏసీ-1, 3ఏసీ-1, స్లీపర్ క్లాస్-1 కోచ్‌లను ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



విత్తనం చల్లుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్

పచ్చిరొట్ట సాగుకు సబ్సిడీపై విత్తనాల కిట్లు

దొరవారిసత్రం, మే 22(ఆంధ్రజ్యోతి) : ఈ యేడాది జిల్లా వ్యాప్తంగా 25 వేల ఎకరాల్లో పీఎండీఎస్ కింద చిరు ధాన్యాల విత్తనాలతో పచ్చిరొట్ట పంట సాగుకు ప్రణాళిక సిద్ధం చేయాలని కలెక్టర్ ఎస్ వెంకటేశ్వర్ వ్యవసాయ అధికారులకు సూచించారు. దొరవారిసత్రం మండలం లింగంపాడు గ్రామంలో పది రకాల చిరు ధాన్యాలు కలిపిన విత్తనాలతో పచ్చిరొట్ట సాగు చేసిన గోవర్ధన్ పొలాన్ని గురువారం ఆయన పరిశీలించారు. చిరుధాన్యాలతో కూడిన కిట్లను 50 శాతం రాయితీతో ప్రభుత్వం అందజేస్తుందన్నారు. దీనిపై రైతులకు అవగాహన కల్పించాలని కలెక్టర్ కోరారు. ఈసాగు వల్ల రసాయనిక ఎరువుల వాడకంతో పాటు పెట్టుబడులు తగ్గుతాయన్నారు. తర్వాత ఆయన చిరు ధాన్యాలను పొలంలో చల్లారు. నెర్రికాలువను బాగు చేయించాలని రైతులు కలెక్టర్‌ను కోరారు. ఏపీసీఎన్ఎఫ్ డీపీఎం షణ్ముగం, ఏడీఏ అనిత, ఏవో జ్యోతిర్మయి, వ్యవసాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

లోకేశ్‌కు వర్కింగ్ ప్రెసిడెంట్ ఇవ్వాలి

- వెంకటగిరి మినీ మహానాడులో తీర్మానం

వెంకటగిరి, మే 22 : (ఆంధ్రజ్యోతి) వెంకటగిరిలో గురువారం నిర్వహించిన మిని మహానాడులో మంత్రి నారా లోకేశ్‌కు తెలుగుదేశం పార్టీ వర్కింగ్ పెసిడెంట్ హోదా కల్పించాలని, ఎన్టీఆర్‌కు భారతరత్న అవార్డు ఇవ్వాలని ఎకగ్రీవంగా తీర్మానించారు.అల్తూరుపాడు రిజర్వాయరు నిర్మాణం, సోమశిల-స్వర్ణముఖి లింకు కెనాల్ పూర్తి, వెంకటగిరి- గూడూరు రోడ్డు పనులు,వెంకటగిరిలో చేనేత.. బీఆర్ అంబేడ్కర్ భవనాల నిర్మాణం, రాపూరు చెరువును రిజర్వాయరుగా మార్చడం, పోకూరుపల్లి లిఫ్టు ఇరిగేషన్ మంజూరు, వెంకటగిరిలో 30 పడకల ఆస్పత్రిని 100 పడకలకు అప్‌గ్రేడ్ చేయడం వంటి అభివృద్ధి పనులను సభ తీర్మానం చేసింది.

ట్రావెల్స్ బస్సు అపహరణ

తిరుపతి(నేరవిభాగం), మే 22 (ఆంధ్రజ్యోతి):ఏకంగా ఓ ట్రావెల్స్ బస్సునే దుండగులు దొంగిలించారు. ఈ ఘటన తిరుపతిలో బుధవారం రాత్రి చోటు చేసుకుంది. ఈస్ట్ సీఐ శ్రీనివాసులు తెలిపిన ప్రకారం.. బుధవారం రాత్రి టీఎన్ 02బీయూ 1030 నెంబరు బస్సును డ్రైవర్ శ్రీధర్ తీసుకొచ్చి చింతలచెరువు రోడ్డులోని ఓ పార్కింగ్ ప్లేస్‌లో ఉంచారు. బస్సును గుర్తు తెలియని వ్యక్తులు తీసుకెళ్లారని ఆ పార్కింగ్ యజమాని ఫోన్ చేసి డ్రైవరుకు చెప్పడంతో అతడు, మరికొందరితో కలిసి చుట్టుపక్కల వెతికారు. బస్సు కనిపించకపోవడంతో ఓనర్ రవీంద్రకు డ్రైవరు తెలియజేశారు. ఎక్కడా బస్సు కనిపించకపోవడంతో గురువారం ఈస్ట్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, సీఐ కేసు నమోదు చేశారు.కాగా గురువారం మధ్యాహ్నాం 2గంటలకు పుంగనూరు సమీపంలో ప్రమాదానికి గురైన ఆ బస్సును పోలీసులు గుర్తించి యజమానికి సమాచారమిచ్చారు.

టెన్త్ సప్లిమెంటరీ పరీక్షలకు 579 మంది గైర్హాజరు

తిరుపతి(విద్య), మే 22(ఆంధ్రజ్యోతి): జిల్లాలో గురువారం జరిగిన పదవ తరగతి సప్లిమెంటరీ పరీక్షలకు 579 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు డీఈఓ కేవీఎన్ కుమార్ తెలిపారు. జిల్లాలోని 31 కేంద్రాల్లో 4,436 మంది హాజరు కావాల్సి ఉండగా 3,857 మంది పరీక్షలు రాశారని వివరించారు. అలాగే ఓపెన్ స్కూల్ పదవ తరగతి సప్లిమెంటరీ పరీక్షలు 8 కేంద్రాల్లో జరుగుతున్నాయని, గురువారం గణిత పరీక్షకు 435 మంది విద్యార్థులకుగాను 54మంది గైర్హాజరయ్యారని తెలిపారు.ఓపెన్ స్కూల్ ఇంటర్ ఫిజికల్ సైన్స్, పొలిటికల్ సైన్స్ పరీక్షలకు 60 మంది గైర్హాజరయ్యారని వివరించారు.

నాయుడుపేటలో పలు రైళ్లు నిలుపుదల చేయాలి

● కేంద్రమంత్రి పెమ్మసానికి వినతి



కేంద్రమంత్రి చంద్రశేఖర్‌కు పుష్పగుచ్ఛాలు అందజేస్తున్న పేర్నాటి జోసెఫ్

నాయుడుపేట, మే 22 (ఆంధ్రజ్యోతి) : నాయుడుపేట రైల్వే స్టేషన్‌లో గతంలో నిలిపేసిన చెన్నై ఎక్స్‌ప్రెస్, డెహ్రాడూన్ తదితర ఎక్స్‌ప్రెస్ రైళ్లను తిరిగి నిలిపేందుకు చర్యలు తీసుకోవాలని నాయుడుపేట సదరన్ రైల్వే వెల్ఫేర్ అసోసియేషన్ కార్యదర్శి, డీఆర్‌యుసీసీ సభ్యులు పేర్నాటి జోసెఫ్ కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌కు గురువారం వినతిపత్రం అంద జేశారు. సూళ్లూరుపేటలో అమృతభారత్ రైల్వే స్టేషన్ ప్రారంభోత్సవానికి విచ్చేసిన కేంద్రమంత్రి చంద్రశేఖర్‌తో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో నాయుడుపేట సదరన్ రైల్వే వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు మస్తానయ్య, సహకార్యదర్శి ఆర్ రాఘవన్, రవి, కంకిపాటి కిరణ్‌కుమార్, దేవిశెట్టి సునీల్, ప్రభాకర్, సుల్తాన్ తదితరులు పాల్గొన్నారు.

పౌరసరఫరాల గోదామును తనిఖీ చేసిన కలెక్టర్



వాకాడు, మే 22 (ఆంధ్రజ్యోతి) : వాకాడు పౌరసరఫరాల గోదామును గురువారం కలెక్టర్ వెంకటేశ్వర్, సబ్ కలెక్టర్ రాఘువేంద్రమీనాతో కలసి తనిఖీ చేశారు. బియ్యం, పంచదార నాణ్యతను పరిశీలించారు. రికార్డులో ఉన్న స్టాక్‌కు, గోదాములో ఉన్న సరుకుల వ్యత్యాసాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గోదాము ఇన్‌చార్జి వెంకటేశ్వర రావుపై వచ్చిన ఫిర్యాదులపై పూర్తిస్థాయిలో విచారణలు చేపట్టి అవకతవకలు జరిగి ఉంటే సివిల్ సప్లయ్ అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించామన్నారు. ఆయన వెంట తహసీల్దారు రామయ్య, ఎంపీడీవో శ్రీనివాసులు, డీటీ సందీప్, సివిల్ సప్లయ్ డీటీ మల్లికార్జున్‌రావు తదితరులు ఉన్నారు.

బాలుడి కుటుంబాన్ని ఆదుకోవాలి



సబ్‌కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కమిటీ సభ్యులు

గూడూరు, మే 22 (ఆంధ్రజ్యోతి): వెట్టిచాకిరీకి వెళ్లి మృత్యువాత పడిన గిరిజన బాలుడి కుటుంబాన్ని ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలని జిల్లా ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కమిటీ సభ్యుడు అరవ పార్వతయ్య కోరారు. ఈ మేరకు గురువారం సబ్‌కలెక్టర్ రాఘవేంద్రమీనాకు వినతిపత్రం అందజేశారు. సత్యవేడుకు చెందిన బాతుల వ్యాపారి మండలంలోని నెల్లటూరు చవట గిరిజనకాలనీకి చెందిన వెంకటేష్ (9)ను బాతులు మేపే పనిలో పెట్టుకుని వెట్టిచాకిరి చేయించారన్నారు. ఆ బాలుడు చనిపోవడంతో రహస్యంగా పూడ్చిపెట్టడంతో ఆ కుటుంబం తీవ్రవేదనలో ఉందన్నారు. ఏసుపాక పెంచలయ్య, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్యశిబిరం

గూడూరు అర్బన్, మే 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక డీఎస్ఆర్ కమ్యూనిటీ హాలులో గురువారం పెళ్లకూరు చాగణం లలితమ్మ, భాస్కర్‌రావు మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో తిరుపతికి చెందిన వెంకటేశ్వర అరవింద్ నేత్రాలయ సహకారంతో ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించారు. డాక్టర్లు భావన, వినయ్‌శ్రీ వైద్యపరీక్షలు నిర్వహించారు. అనంతరం ఉచితంగా మందులను, కంటి అద్దాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ ఏవో కృష్ణ, గౌరీశంకర్, సీతారామ నాయుడు, జీవన్ తదితరులు పాల్గొన్నారు.

యాదవ విద్యార్థులకు ప్రతిభాపురస్కారాలు

గూడూరు అర్బన్, మే 22 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది పదోవ తరగతిలో 470కి పైగా మార్కులు సాధించిన యాదవ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందజేయనున్నట్లు శ్రీకృష్ణసేవాసమితి అధ్యక్షుడు మయూరి శ్యామ్‌యాదవ్ గురువారం తెలిపారు. నెల్లూరు జిల్లా యాదవ ఎంప్లాయిస్, ప్రొఫెషనల్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జూన్ 1వ తేదీన నెల్లూరులోని యాదవ భవన్‌లో ఈ పురస్కారాలను అందజేస్తామని వివరించారు. వివరాలకు 9948606664 ఫోన్ నంబరును సంప్రదించాలని కోరారు.

విరివిగా మొక్కలు నాటాలి

చిల్లకూరు, మే 22 (ఆంధ్రజ్యోతి): సమాజంలోని ప్రతిఒక్కరూ విరివిగా మొక్కలను నాటి వాటి పరిరక్షణ బాధ్యతలు చేపట్టాలని టీడీపీ నాయకుడు సతీష్‌యాదవ్ పిలుపునిచ్చారు. గురువారం గుమ్మళ్లదిబ్బ గ్రామంలో అంతర్జాతీయ జీవవైవిధ్య దినోత్సవం సందర్భంగా అదానీ ఫౌండేషన్, తమ్మినపట్నం పంచాయతీల ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో సుబ్రమణ్యం, వెంకయ్య, రాజేష్‌రంజన్, రమణయ్య, స్థానికులు పాల్గొన్నారు.

మన్నూరులో క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు

బాలాయపల్లి, మే 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మన్నూరు గ్రామంలో గురువారం తిరుపతిలోని స్విమ్స్ ఆధ్వర్యంలో పింక్ బస్సుల ద్వారా క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు ఉచితంగా నిర్వహించారు. స్థానిక వైద్యాధికారి లియోనా మాట్లాడుతూ మన్నూరులో 100 మందిపైగా ఈ పరీక్షలను నిర్వహించామన్నారు. 26వ తేదీన అమిలి, నిడిగల్లు గ్రామాల్లో నిర్వహిస్తామన్నారు. ఎంపీటీసీ మురళీమోహన్‌రెడ్డి, కే.నాగరాజు, చైతన్యభాను, పంచాయతీ కార్యదర్శులు రాజయ్య, నీరజ, సూపర్‌వైజర్ నరసింహారావు పాల్గొన్నారు.

ఇంటర్ ప్రవేశాలకు రేపు కౌన్సెలింగ్

కోట, మే 22 (ఆంధ్రజ్యోతి): కోట మండలం చిట్టేడులోని గిరిజన సంక్షేమ బాలుర గురుకుల కళాశాలలో జూనియర్ ఇంటర్ ప్రవేశాలకు సంబంధించి ఈ నెల 24వ తేదీ కౌన్సెలింగ్ నిర్వహిస్తామని ప్రిన్సిపాల్ శేషవర్దన్ గురువారం పేర్కొన్నారు. ఫోన్ ద్వారా సమాచారం పంపిన గిరిజన, ఓసీ, బీసీ, ఎస్సీ విద్యార్థులకు ఉదయం 10 గంటల నుంచి కళాశాలలో కౌన్సెలింగ్ ఉంటుందని తెలియజేశారు. ఎంపీసీ, బైపీసీ, హెచ్ఈసీ, ఒకేషనల్ గ్రూపుల్లో చేరేందుకు మాత్రమే ఈ కౌన్సెలింగ్ జరుగుతుందన్నారు. మరిన్ని వివరాలకు 9441033367 ఫోన్ నంబరును సంప్రదించాలని కోరారు.

గుంతలో పడిన దూడను కాపాడిన స్థానికులు



గూడూరు, మే 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక రాజావీధిలో భవన నిర్మాణం కోసం తీసిన గుంతలో గురువారం ప్రమాదవశాత్తు దూడ పడిపోయింది. పర్యావరణ పరిరక్షుడైన శ్యామ్‌కుమార్‌రెడ్డి స్థానికుల సాయంతో దానిని సురక్షితంగా వెలుపలకు తీశారు.

కోళ్ల వ్యర్థాలను రోడ్డు వెంట వేయరాదు

చిట్టమూరు, మే 22(ఆంధ్రజ్యోతి) : చికెన్ దుకాణదారులు కోళ్ల వ్యర్థాలను రోడ్డు వెంట వేయరాదని ఎంపీడీవో మనోహర్ గౌడ్ తెలిపారు. గురువారం కొత్తగుంట సెంటర్లోని చికెన్ వ్యాపారులతో ఎంపీడీవో కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చికెన్, చేపల వ్యర్థాలను చిట్టమూరు సమీపంలోని రొయ్యల కాలువలో గోతి తీసి పూడ్చి పెట్టాలని సూచించారు. ఆయన వెంట చిట్టమూరు పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్లు ఉన్నారు.

రెజ్లింగ్‌లో ప్రతిభచూపిన క్రీడాకారులకు సన్మానం



నాయుడుపేట, మే 22 (ఆంధ్రజ్యోతి) : రెజ్లింగ్ అండర్-17 పోటీల్లో ప్రతిభ చూపిన క్రీడాకారులను, కోచ్‌ను టీడీపీ నాయకులు పనబాక గంగబాబు గురువారం సత్కరించారు. రెజ్లింగ్ కోచ్ బి.ఉదయకుమార్, క్రీడాకారులు పనబాక సంతోష్, గుమ్మిడిపూడి గ్రీష్మంత్, ముత్యాలయ్య, చరణ్, హజరతయ్య, రోహిత్‌లను అభినందించారు.

హనుమంతుడికి విశేష అభిషేకాలు



అభిషేకం చేస్తున్న వేదపండితులు

నాయుడుపేట టౌన్, మే 22 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని అన్ని ప్రాంతాలలో ఉన్న ఆంజనేయస్వామి ఆలయాలలో హనుమాన్ జయంతి వేడుకలు వైభవంగా నిర్వహించారు. గురువారం హనుమాన్ జయంతిని పురస్కరించుకొని ఆంజనేయ స్వామికి అభిషేకాలు నిర్వహించారు. అగ్రహారపేటలోని ఆంజనేయ స్వామి ఆలయంలో స్వర్ణముఖినది నుంచి కలశాలను తీసుకువచ్చిన జలాలతో మంత్రోచ్ఛరణల నడుమ అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ప్రత్యేక పుష్పాలంకరణలో స్వామివారు భక్తులకు దర్శనమిచ్చారు.

క్లస్టర్ విధానాన్ని రద్దు చేయాలి



తహసీల్దార్‌జయజయరావుకు వినతిపత్రం అందజేస్తున్న వీఆర్‌ఓలు

కోట, మే 22 (ఆంధ్రజ్యోతి) : వీఆర్‌ఓలకు సంబంధించిన క్లస్టర్ విధానాన్ని రద్దు చేసి పాత విధానాన్ని కొన సాగించాలని గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట వీఆర్‌ఓలు నిరసన కార్యక్రమం చేపట్టారు. వీఆర్‌ఓల అసోసియేషన్ మండల అధ్యక్షులు వాకాటి శ్రీనివాసులు, డివిజన్ కార్యవర్గ సభ్యులు కన్న రమణయ్యల ఆధ్వర్యంలో వీఆర్‌ఓలు నల్ల బ్యాడ్జీలు ధరించి పాత విధానాన్ని కొనసాగించాలంటూ నినాదాలు చేశారు. అనంతరం తమ తహసీల్దార్ జయజయరావుకు వినతిప్రతం అందజేశారు.

పారిశుధ్యంపై స్పెషల్ డ్రైవ్

కోట: కోట పంచాయతీలో గురువారం పారిశుధ్యంపై స్పెషల్ డ్రైవ్ జరిగింది. పంచాయతీ కార్యదర్శి నెలవల రాజశేఖర్ ఆధ్వర్యంలో బజారు సెంటర్, క్రాస్‌రోడ్డుతో పాటు పలు వార్డుల్లో పారిశుధ్య కార్మికులు చెత్త వలన కలిగే నష్టాలపై స్థానికులకు అవగాహన కల్పించారు.

25న పూర్వ విద్యార్థుల కలయిక

కోట, మే 22 (ఆంధ్రజ్యోతి) : విద్యానగర్ ఎన్‌బీకేఆర్ బీఈడీ కళాశాలలో 1986 - 87 సంవత్సరంలో బీఈడీ పూర్తిచేసిన విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఈ నెల 25న జరగనుంది. విద్యానగర్ వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాలలో ఈ అపూర్వ కలయిక జరుగుతుందని పూర్వ విద్యార్థులు తెలియజేశారు.

ఎంపీడీవో కార్యాలయాన్ని పరిశీలించిన కలెక్టర్

చిల్లకూరు, మే 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయాన్ని గురువారం కలెక్టర్ వెంకటేశ్వర్ పరిశీలించారు. క్రిస్‌సిటీ, సాగరమాల పనులను త్వరగా పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆయన వెంట సబ్‌కలెక్టర్ రాఘవేంద్రమీనా, తహసీల్దారు శ్రీనివాసులు, ఎంపీడీవో గోపి ఉన్నారు.

గొల్లలమలుగులో నేత్రదానం

తడ, మే 22 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని గొల్లలమలుగు గ్రామానికి చెందిన ఈశ్వరవాక రత్నమ్మ (84) గురువారం మృతి చెందారు. కుటుంబసభ్యులు ఆమె నేత్రాలను దానం చేయాలని నిర్ణయించారు. ఆమేరకు సూళ్లూరుపేట ఆచార్య భరద్వాజా సేవాసంస్థ ప్రతినిధులతో సంప్రదించారు. వారు చెన్నై శంకర్ నేత్రాలయ వైద్యుల సహకారంతో మృతురాలి కంటిలోని కార్నియాలను సేకరించారు.

ఘనంగా హనుమజ్జయంతి





విష్ణేశ్వరపురంలోని ఆంజనేయస్వామి విగ్రహం వద్ద పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్, కోనేటిమిట్టలోని ఆంజనేయస్వామి ఆలయంలో నాగవల్లీదళ అర్చనల్లో భక్తులు

గూడూరు, మే 22 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పలు ఆలయాలలో గురువారం హనుమజ్జయంతి పూజా కార్యక్రమాలను వైభవంగా నిర్వహించారు. ఆంజనేయ స్వామిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు జరిపారు. స్థానిక విష్ణేశ్వరపురంలోని ప్రసన్నాంజనేయస్వామి ఆలయంలో, ఆదిశంకర కళాశాల సమీపంలోని ఆంజనేయ స్వామి ఆలయంలో ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ పూజలు చేశారు. స్థానిక కోనేటిమిట్టలోని రామాంజనేయ స్వామి ఆలయంలో స్వామివారికి అష్టోత్తర శతసహస్ర నాగవల్లీదళ సామూహికార్చనలు జరిపారు. ఆలయ ఆవరణంలో అన్నప్రసాద వితరణ చేపట్టారు. మాళవ్యానగర్‌లోని శ్రీరామరక్షా కుటీరంలో స్వామివారికి నాగవల్లీదళ సామూహికార్చనలు, విష్ణుసహస్ర నామ పారాయణం, పుష్పయాగం పూజలు జరిపారు. ఎగువవీరారెడ్డిపల్లిలోని కోదండరామాంజనేయ స్వామి ఆలయంలో ఆదిశంకరాచార్య బ్రహ్మణ సేవాసంఘం ఆధ్వర్యంలో పూజలు చేశారు. పలు ఆంజనేయస్వామి ఆలయాలలో పూజలు చేసి అన్నప్రసాదాలను అందజేశారు.

బాలాంజనేయుడికి విశేషపూజలు



సూళ్లూరుపేట, మే 22 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలోని బాలాంజనేయ స్వామి ఆలయంలో హనుమాన్ జయంతి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ ఉత్సవాల్లో భాగంగా గురువారం స్వామివారిని పుష్పాలతో అలంకరించి లక్ష తమలపాకులతో అర్చన చేశారు. భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి స్వామివారిని దర్శించుకున్నారు. ఈ ఉత్సవాలు ఈ నెల 26 వరకు జరగనున్నాయి.

వైభవంగా శోభాయాత్ర



వెంకటగిరిటౌన్, మే 22(ఆంధ్రజ్యోతి): విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో హనుమజ్జయంతి వేడుకలు గురువారం వైభవంగా నిర్వహించారు. స్థానిక విశ్వోదయ జూనియర్ కళాశాల మైదానం నుంచి పట్టణ పురవీధుల్లో భారీగా ర్యాలీ, కోలాటం నిర్వహించారు. ప్రసాదాలు పంచి పెట్టారు.



కోట, మే 22 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని పలు గ్రామాల్లో గల ఆంజనేయస్వామి ఆలయాల్లో గురు వారం హనుమత్ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. కోటలోని ప్రసన్నాంజనేయస్వామి ఆలయంలో ఆలయ ప్రధాన అర్చకులు ప్రసాద్‌బాబు ఆధ్వర్యంలో స్వామివారికి పలు అభిషేకాలు చేశారు. ఆర్ఎస్ఎస్, బీజేపీ నాయకుల ఆధ్వర్యంలో స్థానిక ఆంజనేయస్వామి విగ్రహం వద్ద నుంచి బజారు సెంటర్ మీదుగా క్రాస్‌రోడ్డు వరకు హనుమాన్ శోభాయాత్ర జరిగింది. కార్యకర్తలు హనుమాన్ విగ్రహంతో బైక్ ర్యాలీ నిర్వహించారు. గూడలిలోని అభయాంజనేయస్వామి, కేశవరం, సిద్ధవరం గ్రామాల్లో ఆంజనేయస్వామి వారి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. భజనలు నిర్వహించారు.

మరమ్మతు పనులు నాణ్యతగా ఉండాలి



హాస్టల్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్, సబ్ కలెక్టర్ రాఘువేంద్ర మీనా

చిట్టమూరు, మే 22(ఆంధ్రజ్యోతి) : ఎస్సీ వసతి గృహాల్లో జరుగుతున్న మరమ్మతు పనులు నాణ్యతతో చేపట్టాలని కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. గురువారం చిట్టమూరు సాంఘిక సంక్షేమ వసతి గృహంలో జరుగుతున్న పనులను ఆయన తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చిట్టమూరు ఎస్సీ వసతి గృహనికి సీఎస్ఆర్ నిధులు రూ.13 లక్షలతో మరమ్మతు పనులు జరుగుతున్నాయని తెలిపారు. ఈ పనుల్లో నాణ్యత పాటించాలని లేని పక్షంలో సంబంధిత అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరిం చారు. కాగా మండలంలో నెలకొన్న పలు సమస్యలపై టీడీపీ మండల అధ్యక్షుడు కిషోర్ నాయుడు కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. ఆయనవెంట గూడూరు సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా, తహసీల్దార్ సతీష్ కుమార్, ఎంపీడీవో మనోహర్ గౌడ్, డీటీ నిరంజన్ కుమార్ ఉన్నారు.

జనసేన కిట్ల పంపిణీ

గూడూరు అర్బన్, మే 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక జనసేన కార్యాలయంలో గురువారం జనసేన క్రియాశీలక సభ్యత్వాన్ని పొందిన సభ్యులకు ఉమ్మడి నెల్లూరు జిల్లా జనసేన ఉపాధ్యక్షుడు తీగల చంద్రశేఖర్ కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనసేన పార్టీ సభ్యత్వం నమోదు చేసుకున్న సభ్యులకు ప్రమాదబీమా రూ. 5లక్షలు పార్టీ అందజేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మోహన్, భాస్కర్, క్రాంతి, మనోజ్, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

శ్మశానవాటికకు స్థలం కేటాయింపు

గూడూరు అర్బన్, మే 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక గాంధీనగర్ ప్రాంతంలో ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్ చొరవతో శ్మశానవాటికకు స్థలాన్ని కేటాయించారు. గురువారం ఆ స్థలాన్ని టీడీపీ నాయకులు శుభ్రపరిచే చర్యలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో జిల్లా విజిలెన్స్ అట్రాసిటీ కమిటీ సభ్యుడు ఏసుపాక పెంచలయ్య, సురేంద్ర, ఉదయ్ కుమార్, వెంకట కృష్ణయ్య, రమేష్‌రెడ్డి, శ్యామ్‌బాబు, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

సబ్సిడీ రుణాలకు దరఖాస్తుల ఆహ్వానం

నాయుడుపేట టౌన్, మే 22 (ఆంధ్రజ్యోతి) : నాయుడుపేట మండలంలోని ముస్లిం మైనార్టీ, క్రిస్టియన్ మైనార్టీ వర్గాలకు చెందిన వారు ఈ నెల 25వ తేదీ లోగా సబ్సిడీ రుణాలకు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో సురేష్‌బాబు తెలిపారు. రూ.లక్ష నుంచి రూ.8 లక్షల వరకు క్రిస్టియన్లకు, రూ.లక్ష నుంచి రూ.5 లక్షల వరకు ముస్లింలకు రుణాలు అందిస్తామని వివరించారు. 50శాతం సబ్సిడీ ఉంటుందని తెలియజేశారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని వృద్ధుడి మృతి

నాయుడుపేట టౌన్: పట్టణంలో గుర్తుతెలియని వాహనం ఢీకొని ఓ వృద్ధుడు మృతిచెందాడు. అర్బన్ సీఐ బాబి కథనం మేరకు.. గురువారం ఆర్ముగంనగర్‌కు చెందిన రవికుమార్ (65) నాయుడుపేట -శ్రీకాళహస్తి బైపాస్‌రోడ్డు సమీపంలో ఓ హోటల్ వద్ద ఉండగా గుర్తుతెలియని వాహనం ఢీ కొంది. దీంతో ఆయన అక్కడికక్కడే చనిపోయాడు. మృతుడి కుమారుడు మేఘవర్ణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

ట్రాన్స్‌పోర్ట్ రంగాన్ని ప్రోత్సహించేందుకు గ్రీన్‌ట్యాక్స్ తగ్గింపు



మాట్లాడుతున్న శీలం కిరణ్‌కుమార్, టీడీపీ నాయకులు

గూడూరు, మే 22 (ఆంధ్రజ్యోతి): ట్రాన్స్‌పోర్ట్ రంగాన్ని ప్రోత్సహించేందుకు సీఎం చంద్రబాబు గ్రీన్‌ట్యాక్స్‌ను తగ్గించారని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి శీలం కిరణ్‌కుమార్ అన్నారు. గురువారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2014లో టీడీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో గ్రీన్‌ట్యాక్స్ రూ.200 ఉండేద న్నారు. అంతరం అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఈ గ్రీన్‌ట్యాక్స్‌ను రూ.15వేలు వరకు పెంచిందని గుర్తుచేశారు. దీంతో రవాణారంగంలోని అనేకమంది యజమానులు కార్మికులుగా మారిపోయారని పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు రవణారంగాన్ని ప్రోత్సహించేందుకు సీఎం చంద్రబాబు గ్రీన్‌ట్యాక్స్‌ను రూ.1500లు చేశారని వివరించారు. ఈ కార్యక్రమంలో పులిమి శ్రీనివాసులు, బిల్లు చెంచురామయ్య, అబ్దుల్‌రహీం, వెంకటేశ్వర్లురాజు, ఇశ్రాయిల్‌కుమార్, చంద్రమౌళి, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి చేసి ప్రజల రుణం తీర్చుకుంటా

- మూడు సార్లు ఎమ్మెల్యేగా గెలిపించినందుకు కృతజ్ఞతలు
- మినీ మహనాడులో ఎమ్మెల్యే కురుగొండ్ల
- పెద్ద సంఖ్యలో తరలి వచ్చిన కార్యకర్తలు, జనం
- సభ విజయవంతం ● క్యాడర్‌లో నూతనోత్తేజం

వెంకటగిరి, మే 22 : (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసిన తనను మూడు సార్లు అత్యధిక మెజారిటీతో గెలిపించిన వెంకటగిరి ప్రజల రుణం తీర్చుకుంటానని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అన్నారు. గురువారం స్థానిక పింజల వీరయ్య కల్యాణ మండపంలో వెంకటగిరి నియోజకవర్గ మినీ మహానాడు జరిగింది. ముందుగా ఎన్‌టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ, టీడీపీ జాతీయ ఉపాధ్యక్షులు వెంపటి మాధవనాయుడు, జిల్లా సహకార సంఘం అధ్యక్షులు గంగోటి నాగేశ్వరరావు జ్యోతి ప్రజ్వలన చేసి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ ప్రసంగిస్తూ రాజకీయాల్లో అత్యంత దారుణమైన పాలనను గత ఐదేళ్ల వైసీపీ హయాలో చూశామన్నారు. ప్రస్తుతం రాష్ట్రం లోటు బడ్జెట్‌లో ఉన్నా సీఎం చంద్రబాబు ఏడాది కాలంలోనే 80శాతం రోడ్లు బాగుచేశారని తెలిపారు. పార్టీ జాతీయ ఉపాధ్యక్షుడు వెంపటి మాధవనాయుడు మాట్లాడుతూ కష్టపడే మనస్తత్వం గల రామకృష్ణ ఎప్పుడూ ప్రజల కోసం పనిచేస్తూ ఉంటారన్నారు. పార్టీ పెట్టి 9నెలల్లోనే అధికారంలోకి తీసుకు వచ్చిన ఏకైక నాయకుడు ఎన్‌టీ రామారావు మాత్రమే అన్నారు. ఎన్‌టీఆర్ ప్రజల్లో రాజకీయ చైతన్యం తీసుకు వచ్చి పేదలకు కూడు, గుడ్డ, గూడు నినాదంతో సంక్షేమ పథకాలు అమలు చేశారని పేర్కొన్నారు. ఆయన బాటలోనే ముఖ్యమంత్రి చంద్రబాబు పాలన సాగిస్తున్నారని చెప్పారు. నియోజకవర్గంలో ఎస్‌కెనాల్ నిర్మాణం, ఆల్తూరుపాడు రిజర్వాయర్ పనులను పూర్తి చేయాలని జిల్లా సెంట్రల్ బ్యాంకు ఛైర్మన్ మెట్టుకూరు ధనుంజయరెడ్డి కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ అధ్యక్షులు గంగోటి నాగేశ్వరరావు, టీడీపీ నియోజకవర్గ పరిశీలకులు జన్ని రమణయ్య, వెంకటగిరి వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ మాజీ ఛైర్మన్ పులికొల్లు రాజేశ్వరరావు, ఎంపీపీ తనూజరెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కెవీకే ప్రసాద్ నాయుడు, చేనేత కార్పొరేషన్ డైరక్టర్ గంగాధరం, దొంతు బాలకృష్ణ, డక్కిలి ఎంపీపీ గోను రాజశేఖర్, తిరుపతి పార్లమెంటు వాణిజ్య విభాగం అధ్యక్షులు పునుగోటి విశ్వనాథనాయుడు, నాయకులు బీరం రాజేశ్వరావు, మంకు ఆనంద్, సీసీ నాయుడు, కాపా శ్రీనివాసులు నాయుడు, అన్ని మండలాల పార్టీ అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.





ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ పక్కన, వెంపటి మాధవనాయుడు, ధనుంజయ రెడ్డి, నాగేశ్వరరావు, మినీమహానాడుకు హాజరైన జనం

బహిరంగ ప్రకటన

ఇందుమూలముగా నా క్లయింట్ M/s. Shriram Finance Ltd., Gudur బ్రాంచి మేనేజర్ వారు ఇచ్చిన [illegible]

SCHEDULE

[illegible]

S.Sreeramulu Yadav, M.A., B.L., Advocate, Off: 3-2-155, old Shar Busstand Road, Sullurpet. Cell: 94404 56976

బహిరంగ ప్రకటన

ఇందుమూలముగా నా క్లయింట్ M/s. Shriram Finance Ltd., Sullurpet బ్రాంచి మేనేజర్ వారు ఇచ్చిన [illegible]

SCHEDULE

[illegible]

S.Sreeramulu Yadav, M.A., B.L., Advocate, Off: 3-2-155, old Shar Busstand Road, Sullurpet. Cell: 94404 56976

బహిరంగ ప్రకటన

ఇందుమూలముగా నా క్లయింట్ M/s. Shriram Finance Ltd., Venkatagiri బ్రాంచి మేనేజర్ వారు ఇచ్చిన [illegible] 1) Sri Shaik Chan Basha S/o. Jamal Saheb, Lakshmi Nagar, Naidupet Town and Mandal, Tirupati District. 2) Smt. Shakira W/o. Shaik Rafi, Armugam Nagar, Naidupeta Town and Mandal, Tirupati District [illegible] Sri Shaik Karimulla S/o. Chan Basha [illegible]

SCHEDULE

Item No.1: Tirupati District, erstwhile S.P.S.R. Nellore District, Gudur Registration District, Naidupet Sub District, Naidupet Mandal, Naidupet Town and Municipality, vinnamala H/o Naidupet Village accounts, Ward No.4, Block No.6, Armugam Nagar, Sy.No.310, House bearing old Door No.4-6-56, New Door No.3-6-19 with New Assessment No.1153000224, bounded on: East: House of Patan Kareem Khan and site for repairs-20ft; West: House and site of Kasetty Ramesh to some extent and 3 ft. width., Joint Lane to reach this property from Main Road- 20 ft., North: House of Narsingulu Bhavani repairs site to some extent and house of Kunches Varalakshmi -27 1/2 ft., South: This house repairs site along with the house and site Kalthireddy Sankar Reddy - 27 1/2 ft., Within these site admeasuring an extent of 550 sq.ft. or 7 ankanams 46 sq.ft. or 61.11 sq.yards or 55.10 sq.mts of site and in it constructed RCC building in an extent of 396 sq.ft. along with all fixtures and appurtenant site therein including right of way and all easementary rights.

Item No.2: Tirupati District, erstwhile S.P.S.R. Nellore District, Gudur Registration District, Naidupet Sub District, Naidupet Mandal, Naidupet Town and Municipality, Vinnamala H/o Naidupet village accounts, Patta No.221, Sy.No.342/3 a total extent of Ac.1.30 cents in Ward No.1, Block No.5, near kaluvagattu to the South or Door No.1-8-49, Plot bearing Nos.19, 20 and 21 of vacant site, bounded on: East: 15 ft. width Road, -95 ft.; West: Girijana Colony - 95 ft.; North: 14 ft. width Road - 57 ft.; South: 14 ft. width Road - 59 ft.; Within these site admeasuring an extent of 76 ankanams 38 sq.ft. or 612.22 sq.yards or 514.24 sq.mts of site and in it constructed RCC building along with all fixtures and appurtenant site therein including right of way and all easementary rights.

Tayi Vijayakumar, B.Com., B.L., Advocate, Teachers Colony, Venkatagiri. Cell:9440507929